

వెన్నెల వేసవి
రూ॥60/-
పేజీలు:54
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★



'సైద్ధాంతికంగా దివాలా తీసిన కాంగ్రెస్' కేరళలో మూడోసారి ఎల్‌డిఎఫ్ ఖాయం
కమ్యూనిస్టులపై దుర్భాషలు అమిత్‌షా అజ్ఞానానికి నిదర్శనం **04**
ట్రంప్ హెచ్చరికలు యుద్ధ నేరాలే **05**



సంపుటి 09, సంచిక: 128 | బుధవారం | 08-04-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## 91 లక్షల పేర్లు మాయం

**స్పష్టం చేస్తున్న 'సర్' అనంతర పశ్చిమ బెంగాల్ ఓటర్ల జాబితా గణాంకాలు**

**కోల్‌కతా:** రాష్ట్రంలో నిర్వహించిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ('సర్') వ్యాయామం అనంతరం పశ్చిమ బెంగాల్‌లో దాదాపు 91 లక్షల ఓటర్ల పేర్లు ఎన్నికల జాబితాల నుండి తొలగించబడినట్లు ఎన్నికల సంఘం విడుదల చేసిన గణాంకాలు వెల్లడించాయి. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పూర్తయ్యాక తుది ఓటర్ల సంఖ్యను ఎన్నికల సంఘం ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఫిబ్రవరి 28న విడుదలైన అధికారిక గణాంకాల ప్రకారం, గత ఏడాది నవంబర్‌లో ప్రారంభమైన 'సర్' ప్రక్రియ తరువాత 63.66 లక్షల పేర్లు (మొత్తం ఓటర్లలో సుమారు 8.3 శాతం) తొలగించినట్టు స్పష్టమైంది. దీంతో ఓటర్ల సంఖ్య సుమారు 7.66 కోట్ల నుంచి 7.04 కోట్లకు తగ్గింది. అండర్ అడ్జుడికేషన్ లేదా పరిశీలనలో ఉన్న వర్గంలో ఉంచిన 60.06 లక్షల మంది ఓటర్లు ఈ 7.04 కోట్ల ఓటర్ల జాబితాలోనూ ఉన్నారు. ఈ అండర్ అడ్జుడికేషన్ వర్గంలోని 60.06 లక్షల మందిలో 27.16 లక్షల మంది పేర్లు న్యాయాధికారుల పరిశీలన తర్వాత తొలగించినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. అలాగే, ఈ వర్గంలో ఉన్న మరో 32.68 లక్షల మంది ఓటర్లను నిలుపుదల చేసి, తుది జాబితాలో చేర్చారు. కాగా, 'సర్' ప్రక్రియ ప్రారంభం నుంచి ఇప్పటివరకు మొత్తం తొలగింపులు సుమారు 90.83 లక్షలకు చేరుకున్నాయని ఎన్నికల సంఘం గణాంకాలు సూచిస్తున్నాయి. 'ఈ సవరణ ప్రక్రియను దశలవారీగా, పారదర్శకంగా నిర్వహించాం. పూర్తి బాధ్యత కోసం జిల్లా వారీ గణాంకాలను ప్రజల ముందుంచాం' అని ఒక సీనియర్ ఎన్నికల సంఘం అధికారి ఒకరు పిటిఐకి తెలిపారు. పరిశీలనలో ఉన్న 60.06 లక్షల కేసుల్లో 59.84 లక్షల వివరాలు ఇప్పటికే ప్రచురితమయ్యాయి. మిగిలిన 22,163 కేసులను పరిష్కరించారు. కానీ ఇంకా ఇ-సంతకాలు చేయాల్సి ఉంది. పెండింగ్ విధానపరమైన ప్రక్రియలు, ముఖ్యంగా తరువాయి 2లో



నాసా చంద్రయాన్

## సరికొత్త రికార్డు

**వ్యోమగాముల తిరుగు ప్రయాణం**

**కెన్నడీస్పేస్ సెంటర్:** చంద్రుడి చుట్టూ ప్రదక్షిణం చేసి మానవ ప్రపంచం చూడని వెనుక వైపు భాగాన్ని, కొత్త పార్శ్వాలను సందర్శించిన నాసా వ్యోమగాములు సరికొత్త రికార్డు సృష్టించారు. తర్వాత భూమికి తిరుగు ప్రయాణమయ్యారు. మానవ చరిత్రలో ఎన్నడూలేనివిధంగా భూగ్రహం నుండి మొత్తం 2,52,757 కి.మీ తరువాయి 12లో

కేరళ ఎన్నికల్లో... ఎల్‌డిఎఫ్‌కే

## బలమైన ప్రజాతీర్పు

'మీట్ ది ప్రెస్'లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధీమా



**తిరువనంతపురం :** కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో ప్రజల మద్దతు కొనసాగుతుందని, వామపక్ష ప్రజాతంత్ర సంఘటన్ (ఎల్‌డిఎఫ్)కు బలమైన మెజారిటీ తప్పక వస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ ధీమా వ్యక్తం చేశారు. కేరళలో ఏప్రిల్ 9న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం రాత్రి 6గంటలకు ముగియనున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి విజయన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలతో తాను ఇటీవల జరిపిన సంభాషణల ఆధారంగా సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎన్నికల ప్రచారానికి నాయకత్వం వహించిన విజయన్ మొత్తం ఎన్నికల వాతావరణం ఎల్‌డిఎఫ్‌కు అనుకూలంగా ఉందని చెప్పారు. 'ఇక్కడి ప్రజలతో మా సంభాషణల ద్వారా మాకు అర్థమైన విషయం ఏమిటంటే కేరళ ప్రజల మనస్సు మాతోనే ఉంది' అని ముఖ్యమంత్రి విజయన్ మంగళవారం కన్నూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో తెలిపారు. 'వివిధ స్థాయిలలో యుడిఎఫ్‌ను తిరస్కరించారు' అని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన ఒక అడుగుముందుకు వేసి ఫలితం పట్ల విశ్వాసం వ్యక్తం చేశారు. 2021ఎన్నికల కంటే ఎక్కు వ సీట్లు గెలుచుకుని, మరింత బలమైన ప్రజాదరణతో తరువాయి 2లో

'ముగిసిన' కేరళ, అస్సాం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రచారం

**9న పోలింగ్** 12

ఐటి కారిడార్‌లో హైడ్రా భారీ ఆపరేషన్

## రూ.1200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి స్వాధీనం

ప్రజాపక్షం/హైదరాబాద్

నగరంలోని ఐటి హబ్ సమీపంలో ఆక్రమణలపై హైడ్రా మరోసారి ఉక్కుపాదం మోపింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లో మంగళవారం నిర్వహించిన భారీ ఆపరేషన్‌లో సుమారు 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఈ భూమి విలువ బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ. 1,200 కోట్లకు పైగా ఉంటుందని అధికారుల అంచనగా ఉంది. ఆపరేషన్ సందర్భంగా భూమిపై ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డులను హైడ్రా అధికారులు తొలగించారు.

**బడా రియల్ ఎస్టేట్ సంస్థల ఆక్రమణలకు చెక్**

ఖానామెట్‌లోని సర్వే నెంబర్ 55లో ఉన్న ఈ భూమిపై గత కొంతకాలంగా వివాదం నడుస్తోంది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఇప్పటికే ఈ భూమిని 'ప్రోహిబిటెడ్ జాబితా'లో చేర్చినప్పటికీ, కొన్ని బడా నిర్మాణ సంస్థలు తరువాయి 2లో



ఇరాన్ నాగరికత మొత్తం

## నేలమట్టం



ట్రంప్ హెచ్చరిక

**వాషింగ్టన్:** ఇరాన్‌కు ఇచ్చిన గడువు ముగిసింది...గడువు మళ్ళీ పెంచుతారా? లేక ఇరాన్‌ను రాతియుగంలోకి నెట్టేస్తారా? యావత్ ప్రపంచం దూరంగా జరిగిన తర్వాత ఇంటా బయటా మెజార్టీ మద్దతు కోల్పోయిన ట్రంప్ ఏం చేయబోతున్నారు? బుధవారం తెల్లారేసరికి ఏం జరుగుతుంది? అదే సర్వత్రా ఉత్కంఠ.ఈ పరిస్థితులమధ్య మరోసారి అమెరికా దళాలు ఖర్గ్ ద్వీపంపైన, కెమికల్ ప్లాంట్ పైన దాడులు చేశాయి. అదేవిధంగా టెహ్రాన్ వ్యాప్తంగా అమెరికా,ఇజ్రాయెల్ బాంబు పేలుళ్ళు సృష్టించగా, ఇరాన్, దాని అనుబంధ హెజ్బొల్లా వంటి సంస్థలు ఇజ్రాయెల్‌పై భీకర దాడులు చేశాయి. ''హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవాలన్న తమ డిమాండ్‌ను అంగీకరించకపోతే ఈ రాత్రి ఒక నాగరికత మొత్తం అంతమైపోతుంది, దాన్ని తిరిగి తీసుకురాలేరు, అలా జరగాలని నేను కోరుకోవడంలేదు, కానీ జరగొచ్చు'' అని మంగళవారం సాయంత్రం ట్రంప్ ట్రూత్ సోషల్‌లో హెచ్చరిక చేశారు. ''ఐతే మరణించిన నాయకుల నాటి పాలన కంటే ఇప్పటి వరకూ ఇరాన్‌లో పాలనా మార్పులు సంభవించాయి, కాబట్టి, విభిన్నమైన, తక్కువ తీవ్రవాద భావాలున్న నాయకులు విజయం సాధిస్తున్నారు, కాబట్టి బహుశా విప్లవాత్మకంగా ఏదైనా అద్భుతం జరగవచ్చు, ఎవరికి తెలుసు?'' అని ట్రంప్ రాశారు. ''సుదీర్ఘమైన, సంక్లిష్టమైన ప్రపంచ చరిత్రలో ఈ రాత్రి (మంగళవారం రాత్రి) అత్యంత ముఖ్యమైన క్షణాలు, 47 ఏళ్ళ ఇరాన్ చరిత్రలో దోపిడీ, అవినీతి, దారుణమైన అణచివేత, మరణాలు అన్నీ అంతం అవుతాయి, ఇరాన్ గొప్ప ప్రజలను దేవుడు ఆశీర్వదించుగాక!'' అని తాజా పోస్టులో తరువాయి 2లో



## ప్రతి ఏటా 60వేల కొత్త కేన్సర్ కేసులు

మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రతి సంవత్సరం 55 వేల నుంచి 60 వేల కొత్త కేన్సర్ కేసులు నమోద వుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆందోళన వ్యక్తం చేశారు. కేన్సర్ నిర్మూలన పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కేన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఆధునిక వైద్య సదుపాయాలను మరింత విస్తరిస్తున్నామన్నారు. హైదరాబాద్ నిమ్స్ కేన్సర్ బ్లాక్‌లో సుమారు రూ 33 కోట్లతో ఏర్పాటు చేసిన నూతన 'లినాక్' (లీనియర్ యాక్సిలేటర్ ) సేవలను, మహిళల కేన్సర్ స్క్రీనింగ్ క్యాంపును రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపి అనిల్ కుమార్ యాదవ్‌తో కలిసి మంత్రి దామోదర్ రాజనర్సింహ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రారంభదశలో గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చనే విషయాన్ని తరువాయి 2లో

## ఎన్నికల వేళ పార్లమెంటు ప్రత్యేక సమావేశమెందుకు?

**50 శాతం నియోజకవర్గాల పెంపు సమాఖ్య సమతుల్యతను దెబ్బతీస్తుంది**
**సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా**



**న్యూఢిల్లీ :** ప్రతిపాదిత పార్లమెంట్ సమావేశాల సమయాన్ని నిర్ణయించడంలో కేంద్ర ప్రభుత్వం చూపుతున్న అనవసరపు తొందర పాటు రాజకీయంగా సందేహాస్పదమైనదని, ప్రజాస్వామ్యపరంగా సమర్థించలేనిదని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. తమిళనాడులో ఏప్రిల్ 23న, పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 23, 29 తేదీలలో ఓటింగ్ జరగనున్న తరుణంలో, పార్లమెంట్‌ను ఏప్రిల్ 16,18 తేదీల్లో సమావేశపరుస్తున్నారని, ఆయా రాష్ట్రాల ఎంపిలు ఎన్నికల ప్రచారంలో పూర్తిగా నిమగ్నమై ఉంటారని తెలిపారు. పార్లమెంటు సమావేశపరచటానికి తొందరపాటు ఎందుకు? జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన నుండి మహిళా రిజర్వేషన్‌ను వేరు చేయాలన్న డిమాండ్‌ను ఇంతకు ముందు ఎందుకు విస్మరించారు? దీని అమలు 2029లో మాత్రమే జరగాల్సి ఉంటే, ఎన్నికల ఫలితాలు తరువాయి 2లో

పాట్ ఖరాబ్ భూములుగా చెప్పి

## కబ్జా చేయడం దుర్మార్గం

సిపిఐ సీనియర్ నాయకుడు సయ్యద్ అజీజ్ పాషా

నాదర్‌గుల్‌లో కబ్జా చేసిన ప్రభుత్వ భూముల పరిశీలన




ప్రజాపక్షం/రంగారెడ్డి

సుప్రీం కోర్టును తప్పుదారి మళ్ళించి నాదర్‌గూల్ గ్రామంలో రైతులు వ్యవసాయం చేసుకుంటున్న భూములను పాట్ ఖరాబ్‌గా భూములుగా చెప్పి కబ్జా చేయడం దుర్మార్గమని సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. వేల కోట్ల విలువైన ప్రభుత్వ నిషేధిత భూములను రక్షించడానికి రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో విచారణకి గట్టిగా వాదించే తరువాయి 2లో



'ఘోష్' నివేదికపై

## నేడు హైకోర్టు కీలక తీర్పు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణలోని కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అవకతవకలపై విచారణ జరిపిన జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ నివేదికపై బుధవారం రాష్ట్ర హైకోర్టు కీలక తీర్పును వెలువరించనుంది. ఈ నివేదికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ పూర్తిచేసిన ధర్మాసనం ఇప్పటికే తీర్పును రిజర్వ్ చేసి, ఈ నెల 8న ప్రకటించనున్నట్లు వెల్లడించింది. గత ప్రభుత్వ హయాంలో నిర్మితమైన కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ అనంతరం కమిషన్ సమర్పించిన నివేదికను రద్దు చేయాలని కోరుతూ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి టి.హరీష్ రావు, ఐఎఎస్ అధికారి స్మిత సబర్వాల్, ఎస్‌కె జోషి తదితరులు హైకోర్టును ఆశ్రయించారు. తమ వాదనలు పూర్తిగా వినకుండా లేదా ఏకపక్షంగా నివేదిక రూపొందించబడిందని పిటిషన్లలో పేర్కొన్నారు. ఈ పిటిషన్లపై గత కొద్ది రోజులుగా సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరఫు, పిటిషనర్ల తరఫు తరువాయి 12లో

విద్య, రవాణ కూడలిగా బోనకల్

## విద్యాహబ్‌గా అభివృద్ధి



నిర్మాణ దశలో సమీకృత విద్యాలయం
సమగ్రాభివృద్ధికి 'భట్టి' ప్రత్యేక కృషి

ప్రజాపక్షం/ ఖమ్మం

బోనకల్ అనగానే గుర్తుకు వచ్చేది రాజకీయ చైతన్యం. రాజకీయ చైతన్యానికే గాక ఆధునిక వ్యవసాయానికి పెట్టింది పేరుగా నిలిచింది. విద్య సముపార్జనలోనూ జిల్లాలో మిగిలిన ప్రాంతాలకు దీటుగా బోనకల్ నిలిచింది. వ్యవసాయ రంగంలో ఆధునిక పద్ధతులను అనుసరించి వ్యవసాయం చేస్తూ అత్యధిక దిగుబడులను సాధిస్తున్నారు. ముఖ్యంగా వాణిజ్య పంటలైన మొక్కజొన్న, మిర్చి, పత్తి పంటల సాగులో ఇక్కడి రైతులు ముందు వరుసలో నిలిచారు. జనవరి మాసం తర్వాత ఏ గ్రామానికి వెళ్లినా మొక్కజొన్న, మిర్చి రాశులు కనిపిస్తుంటాయి. అటువంటి బోనకల్ మండలం ఇప్పుడు జిల్లాలోని ప్రధాన పట్టణాలకు దీటుగా ఒక ప్రధాన కూడలిగా అభివృద్ధి చెందనుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, స్థానిక శాసన సభ్యులు మల్లు భట్టివిక్రమార్క కృషితో బోనకల్ మండలం సమగ్రాభివృద్ధి దిశగా పయనిస్తోంది. రహదారులు, విద్య, వ్యవసాయ రంగాల్లో తరువాయి 12లో

## ప్రజల కోసం నిజంగా పోరాడేది కమ్యూనిస్టు పార్టీలే

సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ
శంషాబాద్ మండలంలో 'ఇంటింటికీ సిపిఐ'



ప్రజాపక్షం/రంగారెడ్డి

దేశంలో ప్రజల కోసం నిజంగా పోరాడేది కమ్యూనిస్టు పార్టీలేనని,మోసాలు చేసే బూర్జువా పార్టీలకు మాత్రం డబ్బున్నవాళ్లే అండగా నిలుస్తున్నారని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ అన్నారు. శంషాబాద్ మండలంలో నిర్వహించిన ''ఇంటింటికి సిపిఐ'' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు తెలుసుకున్నారు.మంగళవారం సిపిఐ శంషాబాద్ మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా బెంగళూరు హైవేపై ఉన్న హోటళ్లు,షాపులు తిరిగి పార్టీ కరపత్రాలు పంచారు. వ్యాపారులు,కార్మికులతో నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై తీవ్రంగా స్పందించారు.నారాయణ మాట్లాడుతూ దేశంలో బిజెపి, కాంగ్రెస్ లాంటి బూర్జువా పార్టీలు పెద్ద పెద్ద కార్పొరేట్ వాళ్ల నుంచి డబ్బులు తీసుకుని వాళ్లకే తరువాయి 12లో

## దేశ రక్షణకోసం నాతో సహా...
# 1.40కోట్లమంది ప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధం

ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియన్ ప్రకటన
విద్యుత్ కేంద్రాలవద్ద మానవహారాలకు పిలుపు



**టెహ్రాన్ :** దేశ రక్షణకోసం ప్రాణత్యాగం చెయ్యడానికి నాతో సహా కోటీ 40 లక్షలమంది ఇరాన్ ప్రజలు (14 మిలియన్లు) సిద్ధంగా ఉన్నారని ఆ దేశ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్ ప్రకటించారు. దేశంకోసం ప్రాణత్యాగం చేయడానికి తానుకూడా సిద్ధంగా ఉన్నానని ఆయన చెప్పారు. హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే ఒక్కరాత్రిలో ఇరాన్‌ను నాశనం చేసేస్తామని, బహుశా ఆ రాత్రి మంగళవారమే కావచ్చునని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించిన తర్వాత మంగళవారం ఉదయం పెజెష్కియన్ ఎక్స్‌వేదికగా, ''దేశంకోసం ప్రాణత్యాగ చేసేందుకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటివరకూ 1.40 కోట్లమంది ధైర్యవంతులైన ప్రజలు ముందుకు వచ్చి సంసిద్ధత వ్యక్తం చేశారని పేర్కొన్నారు. ఇరాన్ దేశ మొత్తం జనాభా తొమ్మిది కోట్లు (90 మిలియన్లు). ఇరాన్‌కోసం నేను త్యాగం చేస్తున్నాను, ప్రాణత్యాగం చేస్తాను, త్యాగాలు చేస్తూనే ఉంటాను అని పెజెష్కియన్ పేర్కొన్నారు. అంతకుముందు ట్రంప్ ''ఓరి పిచ్చి వెధవల్లారా...ఆ జలసంధిని తెరవండి, లేకపోతే మీరు నరకంలో జీవిస్తారు, చూస్తూ ఉండండి, అల్లాకే సర్వం స్తోత్రాలు'' అని తన ట్రూత్ సోషల్ మీడియాలో రాశారు.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో,మారుమూల ప్రాంతాలలో ప్రభుత్వం దేశభక్తియుత ప్రచారం విస్తారంగా కొనసాగిస్తోందని గడచిన 15 రోజులుగా వార్తలు వెలువడటమే కాకుండా ఇరాన్ నాయకులూ ఈ వార్తలను ధృవీకరించారు. ఫిబ్రవరి 22వ తేదీ నుండి ఇరాన్‌కు ట్రంప్ వరుసగా గడువులు ఇవ్వడం ప్రారంభించారు.

ఈ గడువులు ఆయన ఇస్తూ, ఇస్తూ...తాజాగా మంగళవారాన్ని తుది గడువుగా ఎంచుకున్నారు. ఇరాన్‌వ్యాప్తంగా ఉన్న కీలకమైన విద్యుత్ కేంద్రాలు,ఇంధన కేంద్రాలు, ముఖ్యమైన వంతెనలు, విశ్వవిద్యాలయాలు, ఆర్థిక వనరులను ఏకకాలంలో ధ్వంసం చేస్తామని గడచిన పది రోజులుగా ట్రంప్ హూంకరిస్తున్నారు. ఎన్ని బెదిరింపులు చేసినా తలవంచని ఇరాన్ పాలకులు దేశవ్యాప్తంగా ఒకవైపు అల్లర్లను అణచివేసేందుకు చర్యలు తీసుకుంటూ మరోవైపు దేశభక్తియుత ప్రచారం, దేశ రక్షణ కర్తవ్యాన్ని ప్రజలకు బోధిస్తూ విస్తృత ప్రచారం చేస్తున్న పూర్వరంగంలో అధ్యక్షుడు పెజెష్కియన్ నుండి ఈ ప్రకటన వెలువడింది.

**అల్టిమేటమ్‌ల భాష కట్టిపెట్టండి**
**చర్చలకు వెళ్ళండి : రష్యా హితవు**

హోర్ముజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలు తప్పవంటూ ట్రంప్ తీవ్ర హెచ్చరికలవల్ల పశ్చిమాసియాలో భయానక వాతావరణం ఏర్పడిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు రష్యా హితవు చెప్పింది. ఇరాన్‌కు వరుస బెదిరింపులు, గడువు తేదీలతో అల్టిమేటమ్‌లు ఇవ్వడం మానుకోవాలని,ఇరాన్‌తో చర్చలు పునఃప్రారంభించాలని విజ్ఞప్తి చేసింది. బుషెహెర్ వంటి పౌర స్థావరాలపై దాడులు తలపెట్టవద్దని హెచ్చరించింది. బుషెహెచ్ సమీపంలో క్షిపణి దాడులు జరగ్గానే అందులో పనిచేస్తున్న 198 మంది రష్యా కార్మికులు,సిబ్బందిని అక్కడి నుండి ఖాళీ చేయించింది. ఇరాన్‌కు బూతులతో కూడిన అల్టిమేటమ్‌ను ట్రంప్ జారీ చేసిన తర్వాత పశ్చిమాసియాలో తీవ్ర భయాందోళనలు పెరిగాయి. పౌర ప్రాంతాలపై కూడా దాడులు చేస్తామని ఆయన సంకేతాలు ఇచ్చారు. రష్యా విదేశీవ్యవహారాలమంత్రి సెర్గీ లావరోవ్ ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చీతో సోమవారం రాత్రి టెలిఫోన్‌లో సంభాషించారు.

అల్టిమేటమ్‌ల భాషను అమెరికా వదిలిపెట్టాల్సిన అవసరం ఉందని అరాఘ్చీతో లావరోవ్ అన్నారు. బుషెహెర్ వంటి పౌర అణువిద్యుత్ కర్మాగారం వంటి వ్యవస్థలపై దాడులు చేయవద్దని కోరారు. ఇరాన్ చుట్టూ నెలకున్న ఉద్రిక్తతలను తగ్గించడానికి వివిధ దేశాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలవంతం అవుతాయన్న ఆశాభావం లావరోవ్ వ్యక్తం చేశారు. అమెరికా ప్రభుత్వం అల్టిమేటమ్‌ల భాష కట్టిపెట్టి చర్చల బల్ల వద్దకు వెళితే ఇరాన్ చుట్టూ ఉన్న ఉద్రిక్తతలు సడలిపోతాయని ఆయన అన్నారు.

# సోషలిస్టు వియత్నాం అధ్యక్షుడుగా తో లామ్

పార్లమెంటు ఏకగ్రీవ ఎన్నిక
అభివృద్ధి ఫలాలు ప్రజలకు పంచడమే లక్ష్యమని ప్రకటన



**హనోయ్ :** ఆగ్నేయ ఆసియా దేశం సోషలిస్టు రిపబ్లిక్ ఆఫ్ వియత్నాం (ఎస్ఆర్‌వి) అధ్యక్షుడుగా తో లామ్ (69) బాధ్యతలు చేపట్టారు. వియత్నాం కమ్యూనిస్టుపార్టీ సెక్రటరీ జనరల్ తో లామ్‌ను దేశ పార్లమెంటు మంగళవారం ఏకగ్రీవంగా అధ్యక్ష పదవికి ఎన్నుకుంది. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తరహాలో వియత్నాం కమ్యూనిస్టుపార్టీ–ప్రభుత్వ బాధ్యతలు రెండింటినీ నిర్వహించే ఒక అత్యంత శక్తిమంతమైన నాయకుడుగా అవతరించడంతో వియత్నాం చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. కానీ తో లామ్ ఐదేళ్ళు మాత్రమే అధ్యక్ష పదవీ బాధ్యతల్లో ఉంటారు. ఇప్పటివరకూ సోషలిస్టు వియత్నాంలో పార్టీ సెక్రటరీ జనరల్ పదవి, దేశాధ్యక్ష పదవిని వేరు వేరు నాయకులు నిర్వహించేవారు. మొత్తం 495 మంది డిప్యూటీలు హాజరై ఆయనను ఎన్నుకున్నారు. తర్వాత కొత్త ప్రధానమంత్రిని కూడా పార్లమెంటు ఎన్నుకుంటుంది. అధ్యక్షుడుగా పదవీ ప్రమాణం చేసిన తర్వాత తొలి ప్రసంగం చేస్తూ, దేశ అభివద్ధి ఫలితాలను ప్రజలకు పంపిణీ చేసి వారి జీవన భృతిని మెరుగుపరచడంతోపాటు, దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరత్వానికి కీలకమైన శాంతి–సుస్థిరత సాధనే తన ప్రథమ ప్రాధాన్యతాంశమని తో లామ్ చెప్పారు. కమ్యూనిస్టుపార్టీలో దశాబ్దాలుగా ఎదిగి అత్యంత శక్తిమంతమైన నాయకుడుగా ఆయన ఎదిగారు.

2024 నుండి ఆయన కమ్యూనిస్టుపార్టీ సెక్రటరీ జనరల్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. గతంలో ఆయన 2024 మే నెల నుండి అక్టోబరు వరకూ ఆరునెలలపాటు తాత్కాలికంగా దేశాధ్యక్ష పదవీ బాధ్యతలు నిర్వహించారు. వాస్తవానికి ఆయన ప్రజా భద్రతామంత్రి. ఈ రెండు పదవులను ఏకకాలంలో ఆయన నిర్వహించారు. 2016 నుండి ఆయన ప్రజా భద్రతామంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తూ ప్రస్తుతం అధ్యక్ష పదవికి ఎన్నికయ్యారు. 2026 జనవరి 23వ తేదీన జరిగిన వియత్నాం కమ్యూనిస్టుపార్టీ జాతీయ 14వ కాంగ్రెస్‌లో పార్టీ అత్యున్నత సెక్రటరీ జనరల్ పదవికి ఎన్నికయ్యారు.

1981 ఆగస్టులో ఆయన కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ వియత్నాం సభ్యత్వం తీసుకున్నారు. యుక్త వయసు వచ్చినప్పటినుండీ ఆయన వియత్నాం పోలీసు బలగాల్లో ప్రవేశించి పోలీస్ జనరల్‌గా బాధ్యతలు నిర్వహించారు. తన కెరీర్‌ను పూర్తిగా ప్రజా భద్రతకే అంకితం చేశారు. ఆ తర్వాత ప్రజా భద్రతామంత్రిగా 11 సంవత్సరాలు పనిచేసి ఇప్పుడు దేశంలో అత్యున్నతమైన అధ్యక్ష పదవి చేపట్టారు.

# అపస్మారకస్థితిలో మొజ్తబా ఖమేనీ!



**టెహ్రాన్ :** ఇరాన్ సర్వాధినేత మొజ్తబా ఖమేనీ అపస్మారక దశలో ఉన్నారా? ఆయన మరణానికి చేరువలో ఉన్నారా? ఇరాన్ తీసుకుంటున్న నిర్ణయాల్లో ఆయన ప్రమేయం ఏమీ లేదా? మొజ్తాబా గాయపడ్డారన్న వార్తలను కేవలం అమెరికా, పాశ్చాత్యదేశాలు మాత్రమే కట్టుకథలుగా ప్రచారం చేస్తున్నాయా? ఇవన్నీ ఇప్పుడు మిలియన్ డాలర్ (కోటి రూకల ప్రశ్న) ప్రశ్నగా మారాయి.

ఆయన కోమా దశలో ఉన్నారని 'టైమ్స్ పత్రిక' ఒక కథనం ప్రచురించింది. ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా–ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ, ఆయన రెండో భార్య లేదా మొజ్తాబా ఖమేనీ తల్లి, కూతురు, అల్లుడు, మనమరాలు, కోడలు ఇతర ఉన్నతాధికారులు మరణించారు. మొజ్తాబా ఖమేనీ కూడా ఆ సమయంలో అక్కడే ఉన్నారని, కానీ ఆయన తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నారని, మెరుగైన శస్త్రచికిత్స కోసం ఆయనను రష్యా తరలించారని వార్తలు వెలువడ్డాయి. కానీ ఇటీవల ఇరాన్‌లో రష్యా దౌత్యవేత్త మాత్రం మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని ప్రకటించారు. ఆ తర్వాత టైమ్స్‌తోపాటు అంతర్జాతీయ మీడియా నుండి పైవిధంగా తాజా కథనం వెలువడింది.

డోనాల్డ్ ట్రంప్ మొదట్లో అనేకసార్లు మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ఆయన కోలుకోలేని దశలో ఉన్నారని ప్రకటించారు. ఆర్థిక,సామాజిక,సైనికపరమైన ఇరాన్ వ్యవస్థను నడిపించే శక్తిసామర్థ్యాలు ఆయనకు లేవని కూడా ట్రంప్ ప్రచారం చేశారు. ఈ వార్తలను ఇరాన్ పాలకులు ఇంతవరకూ ధృవీకరించలేదు. ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ ప్రస్తుతం ఇరాన్‌పై పెత్తనం చేస్తోందని కూడా అంతర్జాతీయ మీడియా వార్తలు ప్రచురించింది.

## రష్యా ప్లాంట్ ప్రమాదంలో 12 మంది మృతి

**మాస్కో :** రష్యా పెట్రోకెమికల్ ప్లాంట్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో అంతిమంగా మరణించినవారి సంఖ్య 12కు చేరుకుందని అధికార వర్గాలు తెలియజేశాయి. ఐదు రోజుల క్రితం అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత సహాయ బృందాలు మంగళవారం వరకూ గాలింపు చర్యలు జరిపి మృతదేహాలను వెలికితీసి ఈ సహాయ చర్యలను పూర్తిచేశాయి. రష్యా టాటార్‌స్థాన్ ప్రాంతంలోని నిజ్నెకామ్స్క్ పట్టణంలో ఉన్న నెఫ్టెఖిమ్ ప్లాంటు యాజమాన్య బాధ్యతలు నిర్వహిస్తున్న సిబూర్ సంస్థ మరణించిన 12 మంది కార్మికులు,సిబ్బంది పేర్లను టెలిగ్రామ్‌లో పోస్టు చేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సంతాప,సానుభూతులు తెలియజేసింది. ఈ ప్లాంటులో సింథటిక్,ప్లాస్టిక్, రబ్బరు తయారు చేస్తారు. ఈ ప్లాంటులో పీడనం తగ్గిపోవడంతో అగ్ని ప్రమాదం సంభవించింది.

## కబ్జా చేయడం దుర్మార్గం
(మొదటి పేజీ తరువాయి)

ప్రముఖ న్యాయవాదులను నియమించి, సుప్రీం కోర్టు ద్వారానే కమిషన్ నియమింపజేసి నాదార్గుల్ గ్రామంలో ఈ భూములు పాట్ ఖరాబ్ లేక వ్యవసాయ భూముల తేల్చేలా చేయాలనీ అయన డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా నాదర్‌గుల్‌లో వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంపై సయ్యిద్ అజీజ్ పాషా నేతృత్వంలో సిపిఐ నిజనిర్ధారణ బృందం మంగళవారం కబ్జా చేసిన భూములను, అక్రమంగా నిర్మించిన కాంపౌండ్ వాల్ లను, పరిశీలించారు.అక్కడే వ్యవసాయం చేసుకుంటున్న రైతులు వచ్చి తమ భూములు ఖాళీ చేయాలనీ గుండాలు,రౌడీలు,బౌన్సర్లు బెదిరిస్తున్నారని,ఈ భూముల్లో గత 60 సంవత్సరాల నుండి దాదాపు 130 కుటుంబాలు 600 రైతులు వ్యవసాయం చేసుకుంటున్నామని సయ్యిద్ అజీజ్ పాషా కు తెలిపారు.అదేవిధంగా బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లో పాత సర్వేనంబర్ 613/ కొత్త సర్వే నంబర్ 119 లో 373 ఎకరాల ప్రభుత్వ భూములను తమ భూమి అంటూ కంపెనీలు బోర్డులు ఎలా పెడుతాయని ప్రశ్నించారు. ప్రభుత్వ యంత్రాంగం నిద్రపోతున్నదా అని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ 373 ఎకరాల మధ్యలో లచ్చమ్మకుంట 23 ఎకరాల చెరువు ను కూడా కబ్జా చేయడంపై హైడ్రా ఎందుకు చెర్యలు తీసుకోవడంలేదని అయన ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి వ్యక్తిగతంగా ఈ భూ బాగోవతంపై ద్రుష్టి పెట్టి కబ్జా కు పాల్పడ్డ కంపెనీలపై కఠిన క్రిమినల్ కేసులు పెట్టి, కబ్జా కు గురైన ఈ భూములని తిరిగి స్వాధీన పరుచుకువలని అలాగే వ్యవసాయం చేసుకుంటున్న రైతుల భూములను వారికే అప్పగించాలని కోరారు. నాదార్గుల్ గ్రామంలో ప్రభుత్వ భూములను రక్షించేందుకు సిపిఐ పెద్దఎత్తున పోరాటం చేస్తామని అలాగే అక్కడే సాగు చేసుకుంటున్న రైతులకు అండగా ఉంటామని సయ్యిద్ అజీజ్ పాషా హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఆర్. గోపాల్,తెలంగాణ సర్వోదయ మండలి అధ్యక్షులు ఆర్.శంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## బలమైన ప్రజాతీర్పు
(మొదటి పేజీ తరువాయి)

ఎల్‌డిఎఫ్ తిరిగి అధికారంలోకి వస్తుందని విజయన్ దృఢ విశ్వాసం వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్ర అసెంబ్లీలో 140 అసెంబ్లీ స్థానాలకు గాను ఎల్‌డిఎఫ్ 99 స్థానాలను గెలుచుకుంది. రాష్ట్రంలో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఏకు ఒక్క సీటు కూడా రాదని పినరయి విజయన్ స్పష్టం చేశారు. విమర్శలను అంగీకరిస్తూనే అది విస్తృతమైన వ్యతిరేకతగా మారలేదని ముఖ్యమంత్రి విజయన్ నొక్కిచెప్పారు. కేరళలో సిపిఐ(ఎం), బిజెపిల మధ్య అవగాహన ఉందని ఆరోపించిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ వ్యాఖ్యలకు విజయన్ కూడా గట్టిగా స్పందించారు. రాహుల్‌గాంధీ ఆరోపణలను తోసిపుచ్చుతూ ఆయన నిరాధారమైన ఆరోపణలు చేశారని, గాంధీ జవాబుదారీభావంతో వ్యవహరించాలని హితవు చెప్పారు.

కాంగ్రెస్ రాజకీయ విధానాన్ని ప్రశ్నిస్తూ అరవింద్ కేజ్రీవాల్ వంటి నాయకుల పట్ల ఆ పార్టీ వైఖరిని విజయన్ నిలదీశారు. తన ప్రత్యర్థిని ఓడించాలనే ఆతృతలో కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ వ్యవహరించిన తీరు చివరికి బిజెపికి సహాయపడింది అని విజయన్ అన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను సిబిఐ అరెస్ట్ చేసినప్పుడు కాంగ్రెస్ అండగా నిలవలేదన్న తన ఆరోపణను ప్రస్తావిస్తూ ఆయన పేర్కొన్నారు. కేరళలో బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ చేరకపోవడాన్ని కూడా ఆయన విమర్శించారు. 'మేము నిరసనలు నిర్వహించినప్పుడు కాంగ్రెస్, ఆ పార్టీ నాయకులను ఆహ్వానించాం. కానీ వారు నిరాకరించారు. ఇలాంటి సమస్యలు కేవలం ఎల్‌డిఎఫ్‌కు మాత్రమే సంబంధించినవి కావు.

ఇది కేరళ ఉమ్మడి సమస్య' అని విజయన్ వివరించారు. శబరిమల మహిళల ప్రవేశం విషయంలో జాగ్రత్తతో కూడిన, సంప్రదింపుల వైఖరిని అవలంభిస్తానని సిఎం పినరయి విజయన్ ఉద్ఘాటించారు. వరద నిర్వహణకు సంబంధించి కాంగ్రెస్ ఎమ్మెల్యే మాథ్యూ కుఝల్‌నదన్ చేసిన ఆరోపణలపై ఆయన స్పందిస్తూ 'ఈ వరదలు మానవ జోక్యం వల్ల సంభవించలేదని పూర్తిగా ప్రకృతి వైపరీత్యాల వల్లే సంభవించాయని నిపుణుల పరిశోధనలు స్పష్టం చేశాయి' అని ఆయన సమాధానమిచ్చారు. ఇటీవల సిపిఐ(ఎం)నుంచి వీడి తన సొంత నియోజకవర్గమైన అంబలప్పుఝాలో యుడిఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న ప్రముఖ నాయకుడు జి.సుధాకరన్ ఒక మహిళా నాయకురాలిపై చేసిన వ్యాఖ్యలపట్ల కూడా విజయన్ నిరాశ వ్యక్తం చేశారు. అటువంటి వ్యాఖ్యలు 'ఒక బాధ్యతాయుతమైన నాయకుడు చేయకూడనివి' అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత ఆయన ప్రమాణాలు పడిపోవడాన్ని ఈ వ్యాఖ్యలు ప్రతిబింబిస్తున్నాయన్నారు.






## రూ.1200 కోట్లు
(మొదటి పేజీ తరువాయి)

దీనిని తమ ఆధీనంలో ఉంచుకున్నాయి. దాదాపు 4.20 ఎకరాల భూమిని మీనాక్షి రియల్ ఎస్టేట్ సంస్థ తమదిగా చెప్పుకోగా, వాసవి నిర్మాణ సంస్థ అక్కడ ఆర్‌సిసి ప్లాంట్లు, కార్మికుల కోసం తాత్కాలిక షెడ్లు నిర్మించింది. ఇదే సర్వే నెంబర్‌లోని మరో 4 ఎకరాల భూమిని కొలను మాధవరెడ్డి కుమార్తె కొలను సబితకు చెందినట్లు చెప్పబడుతున్న భూమిని కూడా హైడ్రా స్వాధీనం చేసుకుంది. ఇక్కడ బౌన్సర్‌ల ద్వారా కాపలా ఏర్పాటు చేశారని హైడ్రా అధికారులు చెప్పారు.

**రంగంలోకి దిగిన హైడ్రా కమిషనర్**

ఈ ఆక్రమణలపై ఫిర్యాదులు అందడంతో హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. రెవెన్యూ, సంబంధిత శాఖల సమన్వయంతో అది ప్రభుత్వ భూమి అని నిర్ధారించుకున్నాక, మంగళవారం కూల్చివేతలు ప్రారంభించారు. హైడ్రా చర్యలకు సిద్ధమవడంతో, వాసవి నిర్మాణ సంస్థ తమ ఆర్‌సిసి ప్లాంట్‌ను స్వయంగా తొలగించుకుంది. కార్మికుల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లను హైడ్రా సిబ్బంది నేలమట్టం చేశారు. స్వాధీనం చేసుకున్న 8 ఎకరాల భూమి చుట్టూ అధికారులు వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. 'ఇది ప్రభుత్వ భూమి' అని తెలిపే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

**గతంలోనూ చర్యలు :** ఖానామెట్ పరిధిలో హైడ్రా ఆపరేషన్లు నిర్వహించడం ఇది మొదటిసారి కాదు. గతంలోనూ సర్వే నెంబర్ 53లోని మొండికుంట ఆక్రమణలతో పాటు, సర్వే నెంబర్ 55లో మరో 11 ఎకరాల భూమిని హైడ్రా విజయవంతంగా స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. తాజా ఆపరేషన్‌తో ఐటి కారిడార్‌లోని భూకబ్జాదారులకు హైడ్రా గట్టి హెచ్చరికలు పంపినట్లయింది.

## ప్రత్యేక సమావేశమెందుకు?
(మొదటి పేజీ తరువాయి)

వెలువడే మే 4 తర్వాత పార్లమెంట్‌ను సమావేశపరచకుండా అడ్డుకుంటోంది ఏమిటి ? అనే ప్రశ్నలకు ప్రధానమంత్రి మోదీ తప్పక సమాధానం చెప్పాలని రాజా డిమాండ్ చేశారు. ఈమేరకు 'ఎక్స్'లోని తన ఖాతాలో మంగళవారం ట్వీట్ చేశారు. పార్లమెంటును సమావేశపరిచే సమయం యాదృచ్ఛికం కాదని, ప్రజాస్వామ్య నియమాలను పక్కనపెట్టి, కేవలం ఎన్నికల గణాంకాలను అధిగమించేందుకే ఆ తేదీలను నిర్ణయించారని విమర్శించారు.

సీట్ల పెంపు విధానంతో చిన్న రాష్ట్రాల అణిచివేత లోక్‌సభ సీట్లను రాష్ట్రాల వారీగా 50 శాతం పెంచడం తటస్థంగా కనిపించినప్పటికీ, ఇది నిర్మాణాత్మకంగా పక్షపాత ఫలితాన్ని ఇస్తుందని డి.రాజా అన్నారు. ఈ విధానంలో 5 దక్షిణాది రాష్ట్రాల లోక్‌సభ స్థానాలు 129 నుండి 195 సీట్లకు పెరుగుతాయన్నారు. ఏడు పెద్ద ఉత్తరాది రాష్ట్రాలు సంఖ్య 203 నుండి 306 సీట్లకు ఎగబాకుతాయని, తద్వారా 816 సీట్లున్న సభలో అవి మెజారిటీ మార్కులో దాదాపు ముప్పావు వంతుకు చేరుకుంటాయని వివరించారు. జనాభా స్థిరీకరణ, బలమైన సామాజిక సూచికలు సాధించిన రాష్ట్రాలను ఇది దండిస్తుందని, కొన్ని రాష్ట్రాలు అధికారంలోకి వచ్చే మార్గాన్ని తీవ్రంగా కుదిస్తుందని హెచ్చరించారు. పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల వంటి చిన్న రాష్ట్రాలను మరింతగా అణచివేస్తుందన్నారు. ఇది 'ఏకరీతి' విస్తరణ అనే విధానంలో అంతర్లీన పక్షపాతాన్ని బయటపెడుతుందనేది సిపిఐ వైఖరి అని రాజా స్పష్టం చేశారు. దిద్దుబాటు సూత్రాలు లేకుండా, ఇటువంటి చర్య సమాఖ్య సమతుల్యతను దెబ్బతీస్తుందని, పరిమిత ప్రాంతీయ విస్తరణతో ప్రభుత్వాలు ఏర్పడటానికి వీలు కల్పిస్తుందన్నారు. తద్వారా ప్రాంతీయంగా కేంద్రీకృతమైన ఆధిపత్యాన్ని బలోపేతం చేస్తుందని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనను కేవలం అంకగణితానికి కుదించలేమని, అది సమానత్వం, వైవిధ్యం, సమతుల్య సమాఖ్య అనే రాజ్యాంగ దృష్టిని ప్రతిబింబించాలని రాజా పేర్కొన్నారు. తొందరపాటుతో బిజెపి ఏకపక్ష అజెండాతో భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను పునర్నిర్మించలేమని విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన అనేది సమాఖ్య సమతుల్యతను దెబ్బతీసే విధంగా కాకుండా, దానిని పరిరక్షించే విధంగా, న్యాయబద్ధమైన, సంప్రదింపుల ప్రక్రియను అనుసరించి జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

## 91 లక్షల పేర్లు మాయం
(మొదటి పేజీ తరువాయి)

ఈసంతకాలు పూర్తయ్యాక తొలగింపులు, చేర్పుల్లో స్వల్ప మార్పులు ఉండవచ్చని అధికారులు అంటున్నారు. ఈ మొత్తం ప్రక్రియను స్థిరమైన మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించామని వారు స్పష్టం చేస్తున్నారు. ఇకపై ఎలాంటి కొత్త చేర్పులు చట్టపరమైన నిబంధనలు లేదా సంబంధిత అధికారుల సూచనల ఆధారంగా మాత్రమే జరుగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, తుది అనుబంధ జాబితా విడుదలతో పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశకు సంబంధించిన ఓటరు జాబితాను సోమవారం అర్ధరాత్రి తర్వాత ఫ్రీజ్ చేసినట్టు సమాచారం. 294 అసెంబ్లీ స్థానాల్లో 152 స్థానాలకు ఈనెల 23న తొలి దశలో పోలింగ్ జరగనుంది. మిగిలిన 142 స్థానాలకు ఈనెల 29న రెండో దశలో ఓటింగ్ జరుగుతుంది. రెండో దశకు సంబంధించిన ఓటరు జాబితాను గురువారం (ఏప్రిల్ 9న) ఫ్రీజ్ చేస్తారు. ఈ దశలో ఇకపై ఓటరు జాబితాలో ఎలాంటి చేర్పులు ఉండవు. 'తొలి దశ నామినేషన్ చివరి తేదీ తర్వాత చట్టప్రకారం జాబితాను ఫ్రీజ్ చేశాం' అని ఎన్నికల సంఘం సీనియర్ అధికారి పిటిఐకి తెలిపారు. ఇకపై ఏ మార్పులైనా ఉంటే అవి పూర్తిగా సుప్రీంకోర్టు నుంచి వచ్చే తాజా ఆదేశాలపై ఆధారపడి ఉంటాయని ఆయన చెప్పారు. పశ్చిమ బెంగాల్‌కు సంబంధించిన 'సర్' అంశంపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈనెల 13న చేపట్టనుంది.

## నేలమట్టం
(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు. కానీ మరోవైపు గుండెధైర్యం, ఆత్మవిశ్వాసం నింపుకున్న ఇరాన్‌లో విద్యుత్ కేంద్రాలు,ఇంధన కేంద్రాలవద్ద మానవహారాలుగా ఏర్పడి కాపలా ఉండి, ప్రాణత్యాగాలు చేయడానికి కోటీ 40 లక్షలమంది ఇరానియన్లు ముందుకు వచ్చారు. దేశాధ్యక్షుడు పెజెష్కియన్ సహా ప్రజలు దేశం కోసం ప్రాణత్యాగానికి సిద్ధంగా ఉన్నారు. ''పిచ్చి వెధవల్లారా, ఆ జలసంధిని తెరవండిరా...లేకపోతే నరకంలో బ్రతుకుతారు..చూస్తూ ఉండండి...అల్లాకే అన్ని స్తోత్రాలు'' అని ట్రంప్ ఆదివారం ఒక ప్రకటన చేశారు. పిచ్చివాళ్ళచేతుల్లో అణ్వాయుధం ఉండకూడదని ఇరాన్‌ను విమర్శించారు. కానీ ఆయన చెప్పినట్లు ఒక నాగరికతను రాత్రికి రాత్రే తుడిచిపెట్టాలంటే అణుబాంబు వేయాల్సిందే, మరి ఆయనే ఒక పిచ్చివాడిలా ఆలోచనలు చేసి, హిట్లర్ తరహాలో మూర్ఖంగా ప్రవర్తించి ఇరాన్‌పై అణుబాంబులు వేస్తారా? రెండో ప్రపంచ యుద్ధంలో అంతిమంగా రష్యాపై ఆధిపత్యం సంపాదించడానికి ఆనాటి అమెరికా అణుబాంబు ప్రయోగాలు చేసినట్టే, ప్రపంచ మద్దతు కోల్పోయిన ట్రంప్ మళ్ళీ అదే బాటలో ప్రయాణం చేస్తారా? మరో గడువు పెంపు హెచ్చరిక చేసి కాగితం పులిలా మిగిలిపోతారా? ఇవే ప్రశ్నలతో ఉత్కంఠ నెలకొని ఉంది. రష్యా కూడా ట్రంప్‌కు తాజాగా హితవచనాలు పలికింది. కానీ చైనా ప్రభుత్వం మాత్రం మౌనంగా నోరు మెదపకుండా కళ్ళతోనే పరిణామాలన్నింటినీ పరిశీలించడం కూడా భవిష్యత్తుకు ఒక కీలక మలుపుగా విశ్లేషకులు భావిస్తున్నారు.

**దాడులు చేస్తాం : రైళ్ళు ఎక్కకండి**
**ఇరాన్ ప్రజలకు ఐడిఎఫ్ హెచ్చరిక**

ఇరాన్ ప్రజలకు ఇజ్రాయెల్ సైనికదళం తీవ్ర హెచ్చరిక చేసింది. ట్రంప్ ప్రకటనల నేపథ్యంలో ఇరాన్ రైల్వే వ్యవస్థను ధ్వంసం చేస్తామని, ప్రజలు రైళ్ళల్లో ప్రయాణం చేసి ప్రాణాలు పోగొట్టుకోవద్దని ఇరాన్ ప్రజలకు ఇజ్రాయెల్ రక్షణ బలగాలు (ఐ.డి.ఎఫ్) హెచ్చరించాయి. ఇరాన్ వ్యాప్తంగా దాడులు ఉధృతం చేస్తామని ప్రకటించింది.హోర్ముజ్‌ను తెరవకపోతే మంగళవారం రాత్రికే ఇరాన్‌ను ధ్వంసం చేస్తామని ట్రంప్ హెచ్చరించిన తరుణంలో ఇజ్రాయెల్ రక్షణ బలగాల హోం కమాండ్ యుద్ధకాల మార్గదర్శకాల సమయాన్ని ఏప్రిల్ ఏడో తేదీ రాత్రి ఎనిమిది గంటలవరకూ పొడిగించింది. ఇరాన్ ప్రజలు ఇళ్లల్లో 100 మంది ఒకేచోట గుమిగూడేందుకు, బాహ్యప్రపంచంలో 50 మంది గుమిగూడేందుకు ప్రభుత్వ మార్గదర్శకాల ద్వారా అనుమతి ఉంది. ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం విద్యాసంస్థలను స్వేచ్ఛగా నడపవచ్చు. కానీ ట్రంప్ తాను ప్రకటించిన విధంగా ఇరాన్‌పై భీకర దాడులకు సిద్ధమైతే ఇంటా బయటా అనుసరించే ఈ వ్యూహం మార్చేందుకు ఐ.డి.ఎఫ్ సిద్ధంగా ఉంది.

# మహిళపై పోలీసుల దాడి ఆరోపణలు

మానవ హక్కుల కమిషన్ కేసు నమోదు
మూడు నెలల క్రితం ఓ మహిళ మరణం మిస్టరీ?
గాంధీనగర్ పోలీసులపై తరచుగా విమర్శలు?

ప్రజాపక్షం/సిటీబ్యూరో: మహిళపై గాంధీనగర్ పోలీసులు దాడి చేశారని వచ్చిన ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ మానవ హక్కుల కమిషన్ కేసు నమోదు చేసింది. జస్టిస్ డా.షమీమ్ అక్తర్ అధ్యక్షతన విచారణ ప్రారంభమయ్యింది. ఫిర్యాదుదారురాలు తనపై శారీరక దాడి, అసభ్య పదజాలంతో దూషణ, బెదిరింపులు జరిపినట్లు, అలాగే దొంగతనం అనుమానంతో ఆమె ఫొటోను అపార్ట్‌మెంట్లో ప్రచారం జేసి గౌరవాన్ని దెబ్బతీశారని ఆరోపించారు. ఈ ఘటనల వల్ల తీవ్ర మానసిక వేదనకు గురై ఆత్మహత్యాయత్నం చేసినట్లు కూడా తెలిపింది. ఆరోపణల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని, మానవ హక్కుల పరిరక్షణ చట్టం, 1993 సెక్షన్ 18(సి) ప్రకారం, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఫిర్యాదును పరిశీలించి, బాధితురాలిపై ఎలాంటి వేధింపులు జరగకుండా చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని కమిషన్ సూచించింది. సంబంధిత పోలీస్ అధికారులకు ఆదేశాలను పంపిస్తూ, తదుపరి విచారణను ఈనెలాఖరుకు వాయిదా వేశారు.

ఇటీవల ఓ మహిళ మరణం మిస్టరీ?

ఇటీవల ఓ మహిళ చనిపోయిన విషయం కూడా ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది. గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు ప్రచారం చేసి దహన సంస్కారాలు చేశారని.. అయితే నిజానికి గుండెపోటు కాదని.. హత్య అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంటికి అత్యంత సమీపంలోనే దేశంలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలు ఉన్న కార్పొరేట్ ఆసుపత్రులు ఉన్నా...మాసబ్ ట్యాంక్ వద్ద ఉన్న ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించడంలో ఆంతర్యాన్ని ఏమిటనేది అర్థం కావడం లేదు. ఈ విషయంలో నిజాలను రాబట్టాల్సిన పోలీసులు పక్కదారి పట్టించే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ఏదేమైనా గాంధీనగర్ పోలీసుల వైఖరిపై స్థానికంగా ఆందోళన వ్యక్తమవుతోంది.

## కొత్త కేన్సర్ కేసులు
(మొదటి పేజీ తరువాయి)

ప్రజలల్లో అవగాహన పెంచుతున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాలకు కూడా క్యాన్సర్ చికిత్స అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టామని,అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలను విస్తరిస్తున్నామన్నారు. ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల ప్రాంతాల్లో కూడా కీమోథెరపీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చామని,46 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం ద్వారా ముందస్తుగానే వ్యాధి నిర్ధారణకు ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని హెచ్‌పివి టీకా కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని, 14 నుంచి 15 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పివి టీకా అందిస్తూ గర్భాశయ క్యాన్సర్ నివారణకు కృషి చేస్తున్నామని, క్యాన్సర్‌ను నోటిఫైబుల్ వ్యాధిగా ప్రకటిస్తూ తద్వారా ప్రతి క్యాన్సర్ కేసును నమోదు చేసే విధానాన్ని తీసుకువస్తున్నామని మంత్రి వివరించారు.

## విచక్షణారహితంగా రసాయనిక ఎరువుల వినియోగంతో

# భూసారానికి ముప్పు

### మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ప్రజాపక్షం/ హైదరాబాద్ : విచక్షణారహితంగా రసాయనిక ఎరువుల వినియోగంతో భూసారం దెబ్బతిని, పంట దిగుబడులు తగ్గుతున్న నేపథ్యంలో ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టిందని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మట్టి నమూనా పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులను శాస్త్రీయంగా వాడాలని మంత్రి సూచించారు. మంగళవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి మాట్లాడిన మంత్రి యూరియా యాప్‌పై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. యూరియా యాప్‌తో లైన్లలో నిలబడే బాధ తప్పిందని, సమయం వృథా కాకుండా అనుకూలమైన సమయంలో తెచ్చుకునేందుకు అవకాశం ఏర్పడిందని రైతులు యూరియా యాప్‌ని కొనియాడారు. భవిష్యత్తులో కూడా యూరియా యాప్‌తోనే అమ్మకాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని మంత్రిని రైతులు కోరారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోనికి తీసుకొని, రైతుల అభిప్రాయాల మేరకే ఈ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధిక యూరియా వాడకం ద్వారా వచ్చే అనర్థాలను రైతులకు మంత్రి వివరించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని, సిఫార్సుల మేరకు నేల స్వభావానికి అనుగుణంగా శాస్త్రీయంగా ఎరువులు వినియోగించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, వాటి ఫలితాల అర్థం చేసుకోవడం, పంటలకు అనుగుణంగా ఎరువుల వినియోగం వంటి అంశాలపై ఇందుకు 30 వేల మంది యువ రైతులకు సాయిల్ హెల్త్ వాలంటీర్లుగా శిక్షణ ఇస్తున్నామని, వారిలో ప్రతి గ్రామంలో ఇద్దరు నుండి ముగ్గురు వాలంటీర్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నమన్నారు. రైతులు తాము పండించే అన్ని పంటలలో పామాయిల్ పంటను కూడా వేయవచ్చని, పామాయిల్ పంటను వేసి కూడా వరి, పత్తి, మొక్కజొన్న లాంటి పంటలు పండించుకోవచ్చని రైతులకు వివరించారు. రైతులందరు పామాయిల్ పంటను వేసినట్లయితే స్థిరమైన అధిక ఆదాయం పొందే వీలుంటుందని అన్నారు.

**మంత్రిని కలిసిన హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గం**

హుజురాబాద్ మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్ లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మంగళవారం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ప్రతిపాదించిన డంపింగ్ యార్డు పనులను నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ పాల్గొన్నారు.




## 'ఎఐ' ద్వారా ముందస్తుగానే

# 'కేన్సర్' గుర్తింపు చర్యలు

### వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాపక్షం/హైదరాబాద్: ప్రజా ఆరోగ్య వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, ప్రాథమిక స్థాయి నుంచి సూపర్ స్పెషాలిటీ స్థాయి వరకు ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేస్తున్నదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ) ద్వారా కేన్సర్ వంటి వ్యాధులను ముందస్తుగానే గుర్తించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మంగళవారం 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి దామోదర రాజనర్సింహ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విధి నిర్వాహణలో బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి మంత్రి అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యం అంటే కేవలం వ్యాధులు లేకపోవడం మాత్రమే కాదని, శారీరక, మానసిక, సామాజికంగా ఆరోగ్యంగా ఉండడమేనన్నారు. ప్రజల ఆరోగ్యమే అభివృద్ధి చెందిన సమాజానికి బలమైన పునాది అని అన్నారు. ప్రభుత్వ డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, సపోర్టింగ్ స్టాఫ్ సేవల వల్లే ప్రజల ఆరోగ్యం రక్షితంగా ఉందన్నారు. మౌలికసదుపాయాలు, మానవ వనరులు, ఔషధాలు, డయాగ్నోస్టిక్ సేవలను మెరుగుపరుస్తున్నామని తెలిపారు. జీవనశైలిలో వచ్చిన మార్పులు, ఆహారపు అలవాట్లు, కాలుష్యం తదితర కారణాలతో డయాబెటిస్, బిపి, గుండె, మూత్రపిండాలు, క్యాన్సర్ వంటి నాన్ కమ్యునికెబుల్ వ్యాధులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వ్యాధులను ఎదుర్కొనేందుకు ప్రివెంటివ్, ప్రమోటివ్, క్యూరెటివ్, రిహాబిలిటేటివ్ విధానంతో సమగ్ర ఆరోగ్య సేవలను అందిస్తున్నామన్నారు. డయాలిసిస్ సేవలను విస్తరిస్తూ కొత్తగా 79 కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని,109 ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేసి, అత్యవసర సేవలను బలోపేతం చేస్తున్నామని, రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలను కాపాడేందుకు ప్రతి 35 కిలో మీటర్లకు ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని, రూ. 1100 కోట్ల వ్యయంతో నాలుగు స్థాయిల ట్రామా కేర్ వ్యవస్థను అమలు చేయబోతున్నామని, ఎమర్జెన్సీరెస్పాన్స్ సమయాన్ని గణనీయంగా తగ్గించామని, త్వరలో మరిన్ని అంబులెన్సులను అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు.



# పారదర్శకంగా 'తెలంగాణ ఆడిట్ వ్యవస్థ'

### ప్రశంసించిన గుజరాత్ ఆడిట్ అధికారుల బృందం..

### డిప్యూటీ సిఎం భట్టితో సమావేశం ...

ప్రజాపక్షం/హైదరాబాద్:రాష్ట్రంలోని పలు గ్రామ పంచాయతీలను సందర్శించి ఆన్‌లైన్ వ్యవస్థను అధ్యయనం చేస్తున్నామని, తెలంగాణ రాష్ట్రంలో ఆడిటింగ్ వ్యవస్థ పారదర్శకంగా, సమర్థవంతంగా కొనసాగుతుందని గుజరాత్ అధికారులు ప్రశంసించారు.తెలంగాణ రాష్ట్రంలో ఆన్‌లైన్ ఆడిటింగ్ వ్యవస్థను పరిశీలించేందుకు గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారుల బృందం తెలంగాణ రాష్ట్రంలో పర్యటించింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్కతో ప్రతినిధి బృందం మంగళవారం సమావేశమైంది. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలతో తెలంగాణ ఆడిట్ శాఖ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందని, వరుసగా గత మూడుసార్లు దేశంలో నంబర్ వన్ ర్యాంకు సాధించిందని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు అత్యంత బలంగా ఉన్నాయని గుజరాత్ అధికారులకు వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ఆడిట్ శాఖ పనితీరు అధ్యయనానికి అవసరమైన పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని, రాష్ట్రంలో జరుగుతున్న విషయాలను అర్థం చేసుకునేందుకు తమ అధికారులు పూర్తిగా సహకరిస్తారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ ఆడిట్ శాఖ డైరెక్టర్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై నిత్యం ఉద్యమించే సిపిఐకి

# విరాళాలతో అండగా నిలబడండి

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నరసింహ




ప్రజాపక్షం/హైదరాబాద్: పేదవర్గాల సంక్షేమమే లక్ష్యంగా నిత్యం ఉద్యమాలు నిర్వహించే సిపిఐకి విరాళాలు అందజేసి భవిష్యత్తు పోరాటాలకు మరింత అండగా నిలవాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇటి.నరసింహ ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చేపట్టిన 'ఇంటింటికి సిపిఐ' నినాదంతో నిధి సేకరణకు ప్రజల నుంచి మంచి ఆధారణ ఉందని తెలపారు. సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్టలోని తుకారం గేట్ నుంచి చంద్రయ్య హోటల్ వరకు 'షాప్ టు షాప్' విరాళాలను మంగళవారం సేకరించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఇటి.నరసింహ మాట్లాడుతూ సమాజంలో నెలకొన్న అనేక ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు ఉద్యమిస్తూ ప్రజల వైపు నిలబడే ఏకైక పార్టీ సిపిఐ అని అన్నారు. అడ్డగుట్ట లాంటి ప్రాంతంలో సిపిఐ అనేక పోరాట కార్యక్రమాలను కొనసాగించిందని వాటి పోరాట ఫలితంగానే అడ్డగుట్ట ఏర్పడిందన్నారు. గుడిసెవాసులకు పట్టాలు ఇవ్వాలని, పేద వర్గాలకు రేషన్ కార్డులు, పెన్షన్లు అందించాలని ఉద్యమించడం ద్వారా అనేక పథకాలను ప్రజలకు సాధించిపెట్టిందని గుర్తు చేశారు.


**స్థానిక ఉద్యమాల్లో సిపిఐ ముందుంది.: బోస్**

తుకారం గేట్ పోలీస్ స్టేషన్‌ను కొనసాగించాలని సిపిఐ నాయకత్వంలో ఆందోళనలు కొనసాగించినప్పటికీ ప్రభుత్వ అధికారులు మాత్రం ప్రజలు పడుతున్న ఇబ్బందులను ఏమాత్రం పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో సిపిఐని మరింత బలోపేతం చేస్తూ నియోజకవర్గంలో నెలకొన్న ప్రజా సమస్యలపై భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, నియోజకవర్గ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమర్ ఖాన్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కొమురెల్లి బాబు, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టుకింది శ్రీనివాస్, ఎఐఎస్ఎఫ్ జిల్లాఅధ్యక్ష కార్యదర్శి అనిల్ కుమార్, నాయకులు చైతన్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ మోసాలపై హైదరాబాద్

# పోలీసుల దాడి

### 20 మంది అరెస్ట్, రూ.1.59 కోట్లు బాధితులకు రీఫండ్



ప్రజాపక్షం/హైదరాబాద్: సైబర్ నేరాలపై హైదరాబాద్ సిటీ పోలీసుల కట్టుదిట్టమైన చర్యలతో మార్చి2026లో అంతర్రాష్ట్ర స్థాయిలో కీలక పురోగతి నమోదైంది. నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ప్రత్యేక ఆపరేషన్లలో భాగంగా దేశంలోని ఐదు రాష్ట్రాల్లో 13 కేసులకు సంబంధించి 20 మంది నిందితులను అరెస్ట్ చేసి, బాధితులకు రూ. 1.59 కోట్లకు పైగా నష్టాన్ని తిరిగి అందజేశారు. పోలీసుల వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మార్చి నెలలో మొత్తం 54 ఎఫ్ఐఆర్‌లు నమోదవగా, జోనల్ సైబర్ సెల్స్ వద్ద 3081 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో పెట్టుబడి, గేమింగ్, జాబ్, మాట్రిమోనియల్, క్రెడిట్ కార్డ్ సోషల్ మీడియా మోసాలు అధికంగా నమోదయ్యాయి. ముఖ్యంగా గేమింగ్ ఫ్రాడ్ కేసులు ఎక్కువగా వెలుగులోకి వచ్చాయి. అంతేకాకుండా, బాధితులు కోల్పోయిన రూ.4.40 కోట్లలో రూ.1.59 కోట్లను బ్యాంకింగ్ సమన్వయంతో తిరిగి రికవరీ చేయడం విశేషం. ఒటిపి ఫ్రాడ్ ఇన్వెస్ట్‌మెంట్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లలో కూడా గణనీయమైన మొత్తాలను పోలీసులు తిరిగి ఇప్పించారు. సైబర్ పెట్రోలింగ్ ద్వారా సోషల్ మీడియాలో గేమింగ్, బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహిస్తున్న 129 ప్రొఫైళ్లను గుర్తించి తొలగించారు. అలాగే 'సైబర్ సింబా' అవగాహన కార్యక్రమం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచడంతో రోజువారీ ఫిర్యాదులు తగ్గినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫర్లను నమ్మవద్దని, మోసపోతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ లేదా అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు.

# జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో ఎసిబి దాడులు

### అవినీతి ఆరోపణలపై 9 గంటలకుపైగా తనిఖీలు, సిబ్బంది ఫోన్లు స్వాధీనం



ప్రజాపక్షం/జగిత్యాల : జగిత్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం లో మంగళవారం ఉదయం ఎసిబి అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. పలు విభాగాల్లో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఈ తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగంపై వచ్చిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ప్రత్యేక దృష్టిసారించారు. దాడుల సందర్భంగా కార్యాలయంలో ఉన్న సిబ్బంది ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి సమాచారాన్ని బయటకు పంపకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. కార్యాలయంలోని పత్రాలు, ఫైళ్లను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. పట్టణంలో అనుమతుల మంజూరు, నిర్మాణాల అనుమతుల్లో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఎసిబికి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారుల పనితీరును సమగ్రంగా పరిశీలిస్తున్నారు. అక్రమాలపై ప్రాథమిక ఆధారాలు లభిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశముందని ఎసిబి వర్గాలు పేర్కొన్నాయి. ఈ దాడులతో మున్సిపల్ కార్యాలయ సిబ్బందిలో కలకలం రేగింది. పట్టణ ప్రజలు మాత్రం ఈ చర్యలను స్వాగతిస్తూ, అవినీతి నిర్మూలనకు ఇది మొదటి అడుగు కావాలని అభిప్రాయపడుతున్నారు. అయితే ఉదయం నుంచి రాత్రి వరకు అధికారులు ఇంకా తనికీలు నిర్వహిస్తుండడంతో పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ తనిఖీలో డిఎస్‌పి విజయ్ కుమార్‌తో పాటు అధికారులున్నారు.

# రాష్ట్రానికే 'మోడల్ కాలనీ' తలమానికం

- రూ.10 కోట్లతో మోడల్ పబ్లిక్ స్కూల్
- ఏప్రిల్ చివరిలో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం
- మొదటి విడతలో 1500 మందికి ఇండ్ల పంపిణీ : ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



ప్రజాపక్షం/హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని ఫణిగిరి రామస్వామి గుట్ట సమీపంలో 116 ఎకరాల విస్తీర్ణంలో 2160 సింగిల్ బెడ్ రూమ్‌లతో నిర్మించిన మోడల్ కాలనీ తెలంగాణ రాష్ట్రానికే తలమానికం కానుందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మోడల్ కాలనీని మంత్రి సందర్శించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన మోడల్ కాలనీ కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ నుండి అప్పటి మార్కెట్ రేట్ ప్రకారం ధర చెల్లించి భూమి కొనుగోలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మోడల్ కాలనీని తీర్చిదిద్దుతామని అందులో భాగంగానే భూమి కొనుగోలుకు చేసిన వ్యయం మినహాయించి మొత్తంగా ఒక్క నిర్మాణానికే 125 కోట్లు వెచ్చించడంతో పాటు మరో 20 కోట్లు తాజాగా మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు. పదికోట్లతో మోడల్ కాలనీలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు, మరో పది కోట్లతో ఇదే కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటి హాల్, క్రీడా ప్రాంగణం, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ ఏర్పాట్లతో పాటు సిసిరోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ మాసంలో మోడల్ కాలనీ ప్రారంభోత్సవం ఉంటుందని, ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రారంభోత్సవానికి ముందే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని అందులో మొదటి విడతలో అధికారులు 1500 మంది లబ్ధిదారుల ఎంపిక చేస్తారని ఆయన ప్రకటించారు. అయితే అదే సమయంలో లబ్ధిదారుల ఎంపిక రాజకీయాలకు అతీతంగా పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉంటుందని బహిరంగంగా మంత్రి ప్రకటించారు. హుజూర్‌నగర్‌కే ఐకాన్‌గా నిలబడనున్న ఈ మోడల్ కాలనీ లబ్ధిదారుల ఎంపికలో అపోహలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని నిష్పక్షపాతంగా ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన సిఫార్సులు కూడా అర్హులైన వారే ఉండాలని ఆయన సూచించారు. అనర్హులను సిఫార్స్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుల జాబితాను ఒకటికి రెండుసార్లు నిశితంగా పరిశీలించాలని జాబితాలో ఒక్క అనర్హుడి పేరు ఉన్న మోడల్ కాలనీ నిర్మాణ సంకల్పం దెబ్బ తింటుందని ఆయన అధికారులకు నిర్దిష్టమైన అదేశాలు జారీ చేశారు. నిజ నిజాలు తెలుసుకోకుండా ప్రజల్లో గందరగోళం సృష్టించి అపోహాలు రేకితిస్తే కఠిన తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారుల ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉంటుందని అన్నారు. ఒకవేళ ఎవరికైనా అనుమానం వస్తే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, ఆర్డీవో శ్రీనివాసులు, గృహనిర్మాణ శాఖ అధికారులు, తహసిల్దార్ బండ కవిత, సిఐ చరమంద రాజు, ఎస్ఐ మోహన్‌బాబు పాల్గొన్నారు.

## హైదరాబాద్ డ్రగ్స్ ముఠాపై

# భారీ దాడులు

### రూ.63.65 లక్షల నిషేధిత పదార్థాల స్వాధీనం



ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ సిటీ పోలీస్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (హెచ్‌న్యూస్) ఆధ్వర్యంలో భారీ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించారు. చిలకలగూడ, సనత్‌నగర్, ఆదిబట్ల పోలీస్ స్టేషన్లతో కలిసి నిర్వహించిన సంయుక్త దాడుల్లో ఒక అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ సహా ఐదుగురిని అరెస్ట్ చేసి, రూ.63.65 లక్షల విలువైన నిషేధిత పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం ఈ ఆపరేషన్లలో ఎండిఎంఎ 115 గ్రాములు, హాష్ ఆయిల్ 1005 గ్రాములు, ఎక్టసీ పిల్స్ 363 గ్రాములు, ఒజి 41 గ్రాములు, ఎల్ఎస్‌డి బ్లాట్స్ స్వాధీనం చేసుకున్నారు. అదనంగా వాహనాలు, మొబైల్ ఫోన్లు, నగదు కూడా పోలీసులు సీజ్ చేశారు.అంతర్రాష్ట్ర పెడ్లర్ సింహాచలం ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి డ్రగ్స్ సేకరించి హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. మరోవైపు, స్థానికంగా ఉన్న అక్షయ్ పటేల్ కొరియర్ సేవలు, ఎన్‌క్రిప్టెడ యాప్స్ ద్వారా డ్రగ్స్ తెప్పించి సబ్‌పెడ్లర్ల ద్వారా విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికల ద్వారా కస్టమర్లను సంప్రదించి డెలివరీలు నిర్వహించడం, నగదు లేదా యుపిఐ ద్వారా చెల్లింపులు స్వీకరించడం ఈ ముఠా విధానంగా పోలీసులు వెల్లడించారు. యువత, ముఖ్యంగా విద్యార్థులు డ్రగ్స్ బారిన పడి పెడ్లర్లుగా మారుతున్న ఆందోళనకర పరిస్థితి బయటపడింది.ఈ సందర్భంగా హెచ్‌న్యూ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని, డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని విజ్ఞప్తి చేసింది.

# అవిశ్రాంత ఉద్యమాలతోనే అనేక హక్కులు సాధించుకున్నాం

### 'ఇంటింటికీ సిపిఐ' కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి



ప్రజాపక్షం/హైదరాబాద్ : సిపిఐ అవిశ్రాంత ఉద్యమాలు నిర్వహించడం ద్వారా అనేక హక్కులను సాధించుకున్నామని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి అన్నారు. 'ఇంటింటికి సిపిఐ' కార్యక్రమంలో భాగంగా మంగళవారం యాకత్‌పురా నియోజకవర్గం ఐఎస్ సదన్ డివిజన్‌లో సామూహిక విరాళాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛాయాదేవి మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు అవసరమైన నిధులను ప్రజల నుంచి సమీకరించడంతో పాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. ఇటీవల సుప్రీం కోర్టు దళిత క్రైస్తవులకు సంబంధించి ఇచ్చిన తీర్పు వివక్ష చూపేవిధంగా ఉందని, సిక్కు బౌద్ధం హిందూలోని దళితులకు ఇచ్చిన ఎస్‌సి హోదాను అన్ని మతాలకు వర్తింపచేయాలని కోరారు. దళితులు ఏ మతంలోకి మారినప్పటికీ కుల వివక్ష అస్పృశ్యత కొనసాగుతూనే ఉందని, ఎవరైనా తమకు నచ్చిన మత విశ్వాసాల పట్ల నమ్మకంగా ఉండడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు అని, కానీ ఈ తీర్పు రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని, తక్షణమే దీనిని పునర్ సమీక్షించాలన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి కమతం యాదగిరి మాట్లాడుతూ పాలకవర్గాలపై, పెట్టుబడిదారులపై కార్మికవర్గం అనేక తిరుగుబాట్లు చేసి హక్కులను సాధించుకున్నామన్నారు. బ్రిటిష్ కాలం నుంచి నేటి వరకు కార్మికవర్గం సమ్మెల ద్వారా తమకు న్యాయబద్ధంగా రావాల్సిన హక్కులను పొందుతున్నాయని, నేటి మోదీ ప్రభుత్వం కార్పోరేట్ వర్గాల ప్రయోజనాల కోసం శ్రామికులను మరింత దోపిడీ చేయడం కోసం నాలుగు లేబర్ కోడ్‌ను తీసుకువచ్చి కార్మిక రంగానికి తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. అచ్చేదిన్ అని మాట్లాడే మోదీ ఎందుకు నయా తరహా బానిస వ్యవస్థను నెలకొల్పుతున్నారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ ఐఎస్ సదన్ డివిజన్ కార్యదర్శి మహమూద్, జిల్లా కౌన్సిల్ సభ్యులు సక్రి బాయి, కళ్యాణ్, భాను తదితరులు పాల్గొన్నారు.

## ఆంధ్రజ్యోతి దినపత్రికపై వైసిపి దాడి

# దారుణం

### సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ

ప్రజాపక్షం/హైదరాబాద్ : హైద్రదాబాద్‌లో ఆంధ్రజ్యోతి దినపత్రికపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసిపి) మద్దతుదారులు దాడిచేయడం దారుణమని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ అన్నారు. ప్రజాస్వామ్యంలో విభేదాలుంటాయని, వాటిని వారి వారి సంస్థల ద్వారా ఖండించవచ్చన్నారు. భౌతికంగా దాడులు చేయడం అప్రజాస్వామ్యమని, ఈ దాడులను సిపిఐ తీవ్రంగా ఖండిస్తోందని నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

**మల్కాజ్‌గిరి మునిసిపల్ కార్పొరేషన్ : ఇఇ-1**

కొటేషన్ నోటీసు

NIT No. Quatation Notice No. 01/HD/EE-I/MKJ ZONE/MMC/26-27, తేది: 07.04.2026

పని పేరు: నిర్వహణ పరికరాల సేకరణ, లిఫ్ట్ నిర్వహణ, బోలార్డ్స్, బారికేడ్స్, రేడియం రిబ్బన్స్, ఫ్లెక్సీ బ్యానర్స్, సోలార్ స్టడ్స్, రినోవేషన్ ఐటెమ్స్. పరిమాణం: Each (ప్రతి), కొటేషన్ సమర్పణకు ప్రారంభ తేదీ & సమయం / కొటేషన్ సమర్పణకు ఆఖరి తేదీ & సమయం : 8.04.2026న ఉ.11.30గం.ల నుండి 13.04.2026న ఉ.11.30గం.ల వరకు, అధికారి పేరు & చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ - 1, సెల్ నెం. 9154796465. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా @ http://www.tender.telangana.gov.inకు పంపవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-1, మల్కాజ్‌గిరి జోన్, ఎంఎంసి.

DIPR R.O. No. : 255-PP/CL/ADVT/2026-27, Date: 07-04-2026

## కార్పొరేట్ వ్యక్తుల అక్రమ సంపాదనను జాతీయం చేయాలి

**సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్**

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ వ్యక్తుల అక్రమ సంపాదనను జాతీయం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కమిటీ ఆన్ ఎకనామిక్ ఎఫైర్స్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం భారతదేశంలో శతకోటీశ్వరుల సంఖ్య 358 మందికి చేరిందని, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విధించాల్సిన సంపద పన్ను 2016లో రద్దు చేయటమే ఇందుకు కారణమని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. శతకోటీశ్వరుల ఆస్తులు పరిశీలిస్తే స్థూల జాతీయోత్పత్తిలో సగానికి సమానంగా ఉందంటే దేశం ఏ మార్గంలో పయనిస్తుందో అర్థమౌతుందని, శత కోటీశ్వరుల అక్రమ సంపాదనను నియంత్రించాల్సిన మోదీ ప్రభుత్వం అదనంగా శతకోటీశ్వరుల ఆస్తులపై పన్నును 5 శాతానికికి తగ్గించి వారి ఆస్తులు పెరగటానికి సహాయం అందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలు బ్యాంకుల నుండి తీసుకున్న అప్పులను తిరిగి చెల్లించకపోతే వారి బ్యాంకు అప్పులను రద్దు చేయటం ద్వారా ఆ సంస్థలకు లక్షల కోట్లు రూపాయల అదనపు లాభం పొందేలా మోదీ ప్రభుత్వం కృషి చేసిందన్నారు. మరో వైపు గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ చట్టానికి కేటాయించాల్సిన బడ్జెట్‌ను తగ్గించడం మోడీకి పేద ప్రజలపై ఉన్న కపట ప్రేమ, కార్పొరేట్ సంస్థలపై ఉన్న వర్గ సంబంధమైన ప్రేమ బహిర్గతమౌతున్నదని ఆయన పేర్కొన్నారు. కార్పొరేట్ సంస్థలకు అక్రమంగా పెరిగిన ఆస్థులపై ఆర్థిక నిపుణులతో కమిటీ వేసి విచారించాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికాలో వచ్చిన సామాజిక స్పందన నో కింగ్, నో కింగ్‌డమ్ అన్నట్లుగానే భారతదేశంలో కూడా కార్పొరేట్ సంస్థల దోపిడిపై నో లూట్, నో లూట అనే నినాదంతో సామాజిక తిరుగుబాటు వస్తుందని దానితో మోదీ లాంటి కార్పొరేట్ సంస్థల అడుగులకు మడుగులొత్తే వారికి తగిన బుద్ధి చెప్పే పరిస్థితి ఏర్పడుతుందని బోస్ హెచ్చరించారు.

## గుర్తింపు లేని 'ఆదిత్య డిగ్రీ కాలేజీ' యాజమాన్యంపై కేసు నమోదు చేయండి

**ఎఐవైఎఫ్ డిమాండ్**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి గుర్తింపు, ఉస్మానియా విశ్వవిద్యాలయ అఫిలియేషన్ లేకుండానే హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలలో అక్రమంగా అడ్మిషన్లను తీసుకుంటు న్న 'ఆదిత్యడిగ్రీ కాలేజ్' యా జమాన్యంపై కేసు నమోదు చే యాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రతినిధి బృందం తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ వి.బాలకిష్టారెడ్డికి ఫిర్యాదు చేసింది. విద్యాశాఖ అదేశాలను పాటించని అనధికార కళాశాలలను బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేసింది.ఈ మేరకు ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, రాష్ట్ర వర్కిం గ్ ప్రెసిడెంట్ నేర్లకంటి శ్రీకాంత్ తదితరుల బృందం మంగళవారం ఫిర్యా దు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదిత్య డిగ్రీ, ఆదిత్య బిజినెస్ కళాశాలల కు ఒయు , ఉన్నత విద్య మండలి నుండి ఎటువంటి అనుమతులు లేవని, ఈ విద్యాసంస్థలో అడ్మిషన్స్ తీసుకోవద్దని ఈ నెల 4వ తేదీన ఒయు రిజిస్ట్రార్ సర్క్యూలర్‌ను జారీ చేసినా, ఆ ఆదిత్య యాజమాన్యం భేఖాతారు చే స్తుందని ఆరోపించారు. అడ్మిషన్ల కోసం నాగోల్ లోని ఒక ప్రైవేట్ హోట ల్‌లో ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలతో సమావేశాన్ని ఏర్పాటు చేయడాన్ని వారు ఖండించారు. విద్యను వ్యాపారంగా మార్చే కార్పొరేట్ దోపిడీ, ప్రస్తుత ప్రభుత్వాల విద్యా విధానాల కారణంగా, ప్రైవేట్ విద్యా సంస్థలు విద్యను వ్యాపారంగా మార్చి, మోసాలకు పాల్పడుతున్నారని వారు మండిపడ్డారు.

## జైళ్లను సంస్కరణ, పునరావాస కేంద్రాలుగా తీర్చిదిద్దాలి : జయేశ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** జైళ్లు కేవలం నిర్బంధ కేంద్రాలుగా కాకుండా ఖైదీలను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే సంస్కరణ, పునరావాస కేంద్రాలుగా మారాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ సూచించారు. తెలంగాణ జైళ్ల, సవరణ సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిట్రీట్– 2026 కార్యక్రమం చంచల్‌గూడలో మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. జైళ్ల భద్రత బలోపేతం, సాంకేతిక వినియోగం, ఖైదీల నైపుణ్యాభివృద్ధి, మానసిక ఆరోగ్యం, మాదకద్రవ్యాల నియంత్రణ వంటి కీలక అంశాలపై ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జయేశ్ రంజన్ చర్చించారు. నశా ముక్త్ భారత్ అభియాన్ కింద డీఅడిక్షన్ కేంద్రాల ఏర్పాటు అవసరాన్ని అధికారులు ప్రస్తావించారు. జైళ్ల సవరణ సేవల డిజి డాక్టర్. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ శాఖ అమలు చేస్తున్న సంస్కరణ కార్యక్రమాలు, విద్యా, సంక్షేమ చర్యలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ రిట్రీట్ ద్వారా అధికారులు పరస్పర అనుభవాలను పంచుకుని, సవాళ్లకు వినూత్న పరిష్కారాలు కనుగొనే అవకాశం లభిస్తుందని తెలిపారు. జైలు ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ అవకాశాలు పెంచాల్సిన అవసరాన్ని జయేశ్ రంజన్ సూచించగా, సంస్థాగత స్వాయత్తత, పారదర్శకత, జట్టు భావన సంస్థాభివృద్ధికి కీలకమని అన్నారు. తెలంగాణ జైళ్ల శాఖ తీసుకుంటున్న సంస్కరణ చర్యలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ ఐజి ఎన్. మురళీ బాబు, డిఐజిలు డాక్టర్.డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌లో 'టాఫే జెఫార్మ్' ప్రారంభం

**రైతులకు అత్యాధునిక సాంకేతికత చేరువ**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచంలోనే అతిపెద్ద ట్రాక్టర్ తయారీ సంస్థ ల్లో ఒకటైన ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టిఎఎఫ్ఇ), వ్యవసాయ ఉత్పాదకతను పెంచే లక్ష్యంతో రాజస్థాన్‌లోని భవానీ మండిలో తన నూతన పరిశోధనా కేంద్రం 'టాఫే జెఫార్మ్ రాజస్థాన్'ను ఈనెల 2 ప్రా రంభించింది. స్థిరమైన వ్యవసాయ పద్ధతులను రైతులకు చేరువ చేయడం ద్వారా వారి శ్రేయస్సును మెరుగుపరచడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశ్యం. టాఫే చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సందీప్ సిన్హా ఈ అత్యాధునిక కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ ప్రెసిడెంట్ (కార్పొరేట్ రిలేష న్స్) టి. ఆర్. కేశవన్, స్థానిక ప్రభుత్వ ప్రతినిధులు, డీలర్లు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. ఈ నూతన కేంద్రం కేవలం ప్రదర్శనశాలగా మా త్రమే కాకుండా, సమగ్ర వ్యవసాయ పర్యావరణ వ్యవస్థగా పని చేయనుం ది. ఇందులో ప్రధానంగా మూడు విభాగాలు ఉన్నాయి. టాఫే వివిధ రకా ల ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను రైతులు ప్రత్యక్షంగా చూసి, వాటి పనితీరును పరీక్షించే అవకాశం ఉంటుంది. డీలర్లు, సేవా సిబ్బంది మరియు రైతులకు సాంకేతిక అంశాలపై ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆధునిక వ్య వసాయ పద్ధతులు, పంట రక్షణ, గరిష్ట దిగుబడిని సాధించే మెళకువలపై ఇక్కడ రైతులకు అవగాహన కల్పిస్తారు. ఈ సందర్భంగా సిఈఓ సందీప్ సిన్హా మాట్లాడుతూ భారతీయ పరిస్థితులకు తగిన ప్రపంచ స్థాయి యాంత్రీకరణ పరిష్కారాలను అందించడమే తమ లక్ష్యమన్నారు. పంట ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్ వరకు ఉన్న తాజా ధోరణులను రైతులు ఇక్కడ తెలుసుకోవచ్చని ఆయన తెలిపారు.

# అగ్నిప్రమాదాల నివారణకు సమన్వయంతో చర్యలు

**మంత్రి పొన్నం ప్రభాకర్**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పెరుగుతున్న అగ్నిప్రమాదాలను అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అగ్నిమాపక భద్రతపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన అగ్నిప్రమాదాల్లో సుమారు 150 మంది ప్రాణాలు కోల్పోయారని, రూ.800 కోట్ల ఆస్తి నష్టం వాటిల్లిందని మంత్రి తెలిపారు. అయితే, ఫైర్ సిబ్బంది సమయానికి స్పందించి 2 వేల మందికి పైగా ప్రాణాలు రక్షించారని చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరంలో అగ్నిప్రమాదాల నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని మంత్రి వెల్లడించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్లు, గ్యాస్ లీకేజీలు, పరిశ్రమల భద్రతా లోపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే నగరంలో అండర్‌గ్రౌండ్ ఎలక్ట్రిక్ కేబుల్ వ్యవస్థను అమలు చేయనున్నట్లు తెలిపారు.అగ్నిప్రమాదం సంభవించిన వెంటనే సమాచారాన్ని అందించాలని, అత్యవసర సమయాల్లో ఫైర్, పోలీస్, విద్యుత్ శాఖలు తక్షణ స్పందనకు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. గుల్జార్ హౌజ్ ఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్, ఫైర్ డిజి విక్రమ్ మాన్ సింగ్, ట్రాఫిక్ జాయింట్ సిపి జోయల్ డేవిస్ తదితరులు పాల్గొన్నారు. అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు.

## ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలి







**పిహెచ్‌సిల ముందు ధర్నాలు**

**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు అమలుతో పాటు కార్మిక చట్టాలను వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆశా వర్కర్లు ధర్నాలు నిర్వహించారు. ఈ నెల 23న నిర్వహించే రాష్ట్ర వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం ఎక్కడికక్కడ అన్ని ఆసుపత్రుల ముందు నిరసన ప్రదర్శనలు నిర్వహించి అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ప్రైమరీ హెల్త్ సెంటర్ ముందు జరిగిన నిరసన ధర్నాలో ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ మాట్లాడుతూ నిత్యం పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్న ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా కనీస వేతనం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీ ఇచ్చి రెండున్నర ఏళ్లు గడిచినా నేటికి కూడా ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. వైద్యరంగంలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు హెల్త్ ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలు కూడా లేకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే యూనియన్ ప్రతినిధులతో చర్చలు జరిపి ఆశా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎఐటియుసి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ఆశా వర్కర్లు తమ హక్కుల కోసం గొంతెత్తి అడుగుతుంటే ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. ఆశా కార్మికుల ఆందోళనలను అణిచివేసేందుకు ఈ జిల్లాలో మెడికల్ అధికారులు చట్ట వ్యతిరేక ప్రయత్నాలు చేస్తున్నారని, వీటిని ఎఐటియుసి సహించబోదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాళ్లు అల్లాడి హేమలత, బి.వాసంతి, టి.హేమలత, జె.జసంతోషి, కె.శోభ, శశికళ తదితరులు పాల్గొన్నారు.

**రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు**

ఆశా వర్కర్ల రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా సూర్యాపేట జిల్లాలో ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా మెడికల్ అధికారులకు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.కవిత నేతృత్వంలో వినతి పత్రాలను అందజేశారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మహబూబాబాద్ జిల్లా కలెక్టర్‌కు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రజిని తదితరులు వినతి పత్రం అందజేశారు. ఖమ్మం జిల్లా ఎంవి పాలెంలో పిఎస్‌సి ముందు ఆశా వర్కర్లు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి తోటా రామాంజనేయులు, అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఆశాల యూనియన్ నాయకులు ఓరుగంటి శ్రావణి కళావతి, జయమ్మ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.



## పిన్న వయస్సులోనే చెస్‌లో అరుదైన ప్రతిభ

**రెండు ప్రపంచ రికార్డులు సొంతం**

**జూబ్లీహిల్స్‌లో ఘన సత్కారం.. మంత్రుల ప్రశంసలు**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేవలం 2 సంవత్సరాల 11 నెలల పిన్న వయస్సులోనే చెస్‌లో అరుదైన ప్రతిభ చాటుతూ కొండా శ్రేయాన్ష్ మురళీకృష్ణ పటేల్ రెండు ప్రపంచ రికార్డులు సాధించి చరిత్ర సృష్టించాడు. రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అతడు 15 నిమిషాల 52 సెకండ్లలో 93 బ్యాక్ ర్యాంక్ చెక్‌మేట్స్‌ను పరిష్కరించడంతో పాటు, 1 గంట 9 నిమిషాల 9 సెకండ్లలో 21 చెస్ బోర్డులను అమర్చి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్)లో స్థానం సంపాదించాడు. జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యేస్ అండ్ ఎంపిస్ కాలనీ కల్చరల్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, అటవీ శాఖ మంత్రి కొండాసురేఖ, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ శ్రేయాన్ష్ సాధన తెలంగాణ కు గర్వకారణమని కొనియాడారు. భవిష్యత్తులో అతడికి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మంత్రి కొండా సురేఖ తన మనవడి ప్రతిభను చూసి భావోద్వేగానికి గురై ఆనంద భాష్పాలు రాల్చారు. శ్రేయాన్ష్ తల్లి కొండా సుస్మిత పటేల్ తన కుమారుడి ప్రతిభపై ఆనందం వ్యక్తం చేస్తూ, అతని లక్ష్య సాధనకు సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు. రాయ్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, శ్రేయాన్ష్ ప్రతిభ ఇతర చిన్నారులకు ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో శ్రేయాన్ష్‌కు ట్రోఫీలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. త్వరలో బ్రిటిష్ పార్లమెంట్‌లో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ తరపున అతడికి సత్కారం జరగనుంది.

## హైదరాబాద్‌లోఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడిని ఖండించిన మహేష్ కుమార్ గౌడ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ఎబిఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ (వైసిపి) కార్యకర్తల దాడిని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు పూర్తిగా అనవసరమని, ఖండించదగినదని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మీడియా సంస్థలపై దాడులు జరగడం అత్యంత ఆందోళనకరమని, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వాలపై విమర్శలు చేయడం మీడియా హక్కు అని, ఆ హక్కును అణచివేయడానికి చేసే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించబోమని స్పష్టం చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రాజకీయ పార్టీలన్నీ దీనిని గౌరవించాల్సిన అవసరం ఉందని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

# మౌలిక సదుపాయాల కల్పనకు సిఎంసి స్థాయీసంఘం పెద్దపీట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) పరిధిలో మౌలిక సదుపాయాల కల్పన, పర్యావరణ పరిరక్షణ, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా స్థాయీసంఘం సమావేశం నిర్ణయం తీసుకుంది. మాదాపూర్‌లోని న్యాక్ భవనంలో మంగళవారం జయేష్ రంజన్ అధ్యక్షతన స్థాయీసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 15 ప్రతిపాదనలకు (12 ప్రధాన + 3 అదనపు) కమిటీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.

**రహదారుల విస్తరణ – మౌలిక వసతులు**

నగర రవాణా వ్యవస్థను మెరుగుపరచడంలో భాగంగా పలు కీలక నిర్ణయాలు సమావేశంలో తీసుకున్నారు. లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాఫిక్ కష్టాలను తీరుస్తూ అప్రోచ్ ర్యాంప్‌లతో కూడిన 4లేన్‌ల రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (ఆర్‌ఓబి) నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దూలపల్లి అబ్దుల్లా కంపెనీ నుండి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు సెంట్రల్ మీడియన్, డ్రైనేజి, లైటింగ్ సౌకర్యాలతో కూడిన విడిసిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నారు. బౌరంపే ట ప్రధాన రహదారి నుండి ఓఆర్‌ఆర్ సర్వీస్ రోడ్డు వర కు బిటి రోడ్డును విస్తరించాలని నిర్ణయించారు. కొండాపూర్ రోడ్డు విస్తరణ పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ లైన్(11 కెవి)లు తరలింపునకు ఆమోదం తెలిపారు.



**పర్యావరణం – ప్రజా ఆరోగ్యం**

పర్యావరణ హితం కోసం సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా కమిషనర్, జోనల్ అధికారులు, విభాగాధిపతుల కోసం ఎలక్ట్రిక్ వాహనాలు వాహనాలను కొనుగోలు చేయనున్నారు. శేరిలింగంపల్లిలోని కుడికుంట చెరువు నిర్వహణ బాధ్యతలను క్లీన్ లేక్ ప్రాజెక్ట్ కెఎల్‌పిసికి అప్పగించారు. దీనికి షాన్‌గో, రెయిన్ వాటర్ ప్రాజెక్ట్ సహకారం అందించనున్నాయి. ప్రగతినగర్‌లో రామోజీ ఫౌండేషన్ సహకారంతో (సిఎస్‌ఆర్ కింద) దాశరథి కృష్ణమాచార్యుల పార్కును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దనున్నారు. కెపిహెచ్‌బి 6వ ఫేజ్‌లో ప్రజల సౌకర్యార్థం ఈఎస్ఐ డిస్పెన్సరీ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించారు.కార్పొరేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల (ఎస్‌డబ్ల్యూజి, ఎస్ఎఫ్ఎ, ఎఆర్‌పి)ల వేతనాలను జిహెచ్‌ఎంసి సిబ్బందితో సమానంగా పెంచుతూ కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ పెరిగిన వేతనాలు ఏప్రి ల్ 2026 నుండి మార్చి 2027 వరకు వర్తిస్తాయి.

**పాలనా సంస్కరణలు**

పరిపాలనను మరింత వేగవంతం చేసేందుకు, ప్రజలకు సేవలను సులభతరం చేసేందుకు అదనపు కమిషనర్‌కు మరిన్ని పరిపాలనా అధికారాలను బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. అధికారుల రోడ్ల అనుసంధానం, వరద నీటి కాల్వల వ్యవస్థ బలోపేతం, పారిశుద్ధ్య సేవలను మెరుగుపరచడమే ఈ సమావేశ ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఆమోదం పొందిన పనులన్నింటినీ తక్షణమే ప్రారంభించి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత విభాగాలను ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో మహిళల అభ్యున్నతి

**● సెంట్రింగ్ యూనిట్లతో నెలకు రూ.లక్ష ఆదాయం ● వనజ విజయగాథకు మంత్రి సీతక్క ప్రశంసలు**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం మహిళల సాధికారతకు కొత్త దారులు తీసుకొస్తోంది. ఒకేసారి గృహ నిర్మాణం, మహిళల ఆర్థికాభివృద్ధి అనే రెండు లక్ష్యాలను ప్రభుత్వం సాదిస్తోంది. పం చాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశాలతో మహిళల ను సాంప్రదాయేతర రంగాల్లో ప్రోత్సహిస్తూ, సెంట్రింగ్ యూనిట్లు, సిమెంట్ ఇటుకల తయారీ వంటి నిర్మాణ రంగ వ్యాపారాల వైపు దారి చూపిస్తున్నారు. ఈ క్రమంలో మహిళా సంఘాలు నెల కు లక్ష రూపాయల వరకు ఆదాయం పొందుతున్నాయి. వనపర్తి జిల్లా పానగల్ మండలం బండపల్లి గ్రామానికి చెందిన పెద్దబుడి వనజ ఈ కార్యక్రమానికి ఆదర్శంగా నిలిచింది. కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ పట్టభద్రురాలైన ఆమె, ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా నిర్మాణ రంగంలో వ్యా పారం ప్రారంభించి ప్రస్తుతం నెలకు సుమారు రూ.1లక్ష ఆదాయం సంపాదిస్తోంది. తనతో పాటు మరికొందరికి ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్) సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా 772 మంది మహిళలకు ఉచిత శిక్షణ అందించారు. సెంట్రింగ్ పనులు, షియర్ వాల్ నిర్మాణం వంటి అంశాల్లో సాంకేతిక నైపుణ్యాలు నేర్పించారు. శిక్షణ అనంతరం బ్యాంక్ లింకేజ్ ద్వారా వనజ రూ.20 లక్షల రుణం పొందగా, మూడు సెంట్రింగ్ యూనిట్లను ఏర్పాటు చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగస్వామ్యమవుతోంది. ప్రస్తుతం ఆమె వ్యాపారం గ్రామంలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా విస్తరిస్తోంది. తన విజయానికి మంత్రి సీతక్క, సెర్ప్ సిఇఒ దివ్య దేవరాజన్, సంబంధిత అధికారుల సహకారం ఎంతో దోహదపడిందని వనజ కృతజ్ఞతలు తెలిపారు.

**గృహ నిర్మాణ రంగంలో మహిళలకు ప్రోత్సాహం**

2025–26 సంవత్సరానికి 3.5 లక్షల ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని పెట్టుకున్న ప్రభుత్వం, నిర్మాణ సామగ్రిపై పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని మహిళలను ఈ రంగంలోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఒక్కో సెంట్రింగ్ యూనిట్‌కు సుమారు రూ.4 లక్షల పెట్టుబడి అవసరమవుతుండగా, అవసరమైన ఆర్థిక సహాయాన్ని కూడా ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటివరకు శిక్షణ పొందిన 772 మందిలో 154 మంది మహిళలు సెంట్రింగ్ యూనిట్లు స్థాపించగా, మరో 16 మంది ప్రధాన్ మంత్రి ఉపాధి సృష్టి పథకం (పిఎంఇజిపి) కింద దరఖాస్తు చేసుకున్నారు. మహిళలు అవకాశాలను గుర్తించి ముందడుగు వేస్తే ఏ రంగంలోనైనా విజయాలు సాధించగలరని వనజ నిరూపించిందని మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తయారు చేయాలన్న లక్ష్యానికి ఇది దోహదం చేస్తుందని ఆమె తెలిపారు.

## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలకు స్టార్ కంపెయినర్ల నియామకం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమిళ నాడు రాష్ట్రంలో ఈ నెల 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో స్టార్ కంపెయినర్లుగా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్య నాయకులను అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఎఐసిసి) నియమించింది. స్టార్ కంపెయినర్లుగా ఎఐసిసి అగ్ర నాయకులు మల్లిఖార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సహా 40 మందిని నియమించింది. ఈ మేరకు ఎఐసిసి అధిష్టానం మంగళవారం ఎన్నికల కమిషన్‌కు ఒక లేఖను రాసింది. అలాగే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి అదనపు బాధ్యతలను ఇచ్చింది. తమిళనాడులో కాంగ్రెస్ పోటీ చేస్తున్న 28 అసెం బ్లీ నియోజక వర్గాలలో 12 అసెంబ్లీ నియోజక వర్గాలకు సీ నియర్ పరిశీలకునిగా ఉత్తమ్ కుమార్ రెడ్డిని ని యమించింది. కాగా తమిళనాడులో కాంగ్రెస్ డిఎంకెతో కలిసి పొత్తుతో పోటీ చేస్తున్న విషయం తెలిసిందే.

## సాగునీటి తక్షణ విడుదలకు మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లాలోని ఘనపూర్ అయకట్టు కింద సాగు చేస్తున్న రైతులకు సాగునీరు విడుదల చేయకపోడం పట్ల తెలంగాణ మానవ హక్కుల కమిషన్ తీవ్రంగా స్పందించింది. ఎం. బయ్యారెడ్డి సింగూర్ ప్రాజెక్టు నుండి వనదుర్గ ప్రాజెక్టు (ఘనపూర్ ఆయకట్టు) కు 0.30 టిఎంసి నీటిని 12 రోజులపాటు విడుదల చేయాలని ఇందుకు సంబంధింత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుకు సూచించింది. కమిషన్ చైర్మన్ డా. జస్టిస్ షమీమ్ అక్తర్ అధ్యక్షతన, ఈ కేసుల్లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. సుమారు 20 వేల ఎకరాల్లో సాగుచేసిన వరి పంట కోత దశలో ఉండగా, నీటి కొరత వల్ల పంట నష్టపోయే ప్రమాదం ఉన్నట్లు గమనించింది. ఈ పరిస్థితి రైతుల జీవనోపాధి, గౌరవప్రద జీవనం ఆహార హక్కులకు (భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద) భంగం కలిగించడమేనని కమిషన్ అభిప్రాయపడింది. నీటి విడుదలకు సంబంధించి తీసుకున్న చర్యలపై ఈ నెల 30లోపు నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

## 'ఉపాధి హామీ' పథకాన్ని తొలగించేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర

**కల్వకుంట్ల కవిత**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు మోదీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఉపాధి హామీ పథకానికి పేరు మార్చి చట్టబద్దత లేకుండా చేశారని, తద్వారా ఈ పథకాన్ని ఒక ప్రోగ్రామ్‌గా మార్చారని, నిధులు ఇవ్వకుండా పేదలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్ లో ఈ కార్యక్రమాన్ని రద్దు చేస్తే కూడా అడిగే పరిస్థితి లేకుండా చేస్తున్నారని కవిత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదలపైన కక్ష గట్టినట్టుగా వ్యవహరిస్తోందని, వారి నోటి కాడి కూడును లాగేసుకుంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కొవిడ్ తర్వాత 2021–22లో రూ14 కోట్ల పని దినాలు ఉంటే, గత ఏడాది రూ 7 కోట్లకు పని దినాలను తగ్గించారని, ఉపాధి హామీలో పని దినాలు కల్పించే ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని తెలిపారు. పేద ప్రజల నోటికాడి కూడును లాగేస్తుంటే తెలంగాణలోని బిజెపి ఎంపిలు మౌనంగా ఉండటం అన్యాయమన్నారు.

# ట్రంప్ హెచ్చరికలు యుద్ధ నేరాలే!

## ఇరాన్‌ను బెదిరించడంపై నిపుణుల అభిప్రాయం



**వాషింగ్టన్:** ఇరాన్‌లోని ప్రతి వంతెనను, ప్రతి విద్యుత్ కేంద్రాన్ని పేల్చివేస్తామని ఒక మీడియా సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడం యుద్ధ నేరాల కిందకు వస్తుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. ఈ వ్యాఖ్యలు చాలా విస్తృతంగా ఉండడాన్ని, కొంతమంది సైనిక చట్టాల నిపుణులు తప్పుబట్టారు. ట్రంప్ వ్యాఖ్యలు అంతర్జాతీయ చట్టాల ప్రకారం యుద్ధ నేరంగా పరిగణించవచ్చని అంటున్నారు. నిపుణుల అభిప్రాయాన్ని అనుసరించి, ఈ వివాదం ప్రధానంగా మూడు అంశాలపై ఆధారపడి ఉంటుంది. ఆ విద్యుత్ కేంద్రాలు చట్టబద్ధమైన సైనిక లక్ష్యాలా కాదా? దాడులు ఇరాన్ చర్యలతో పోలిస్తే సముచితమా? కాదా? అనే అంశాలతో పాటు పౌరుల ప్రాణనష్టాన్ని ఎంతవరకు తగ్గించారు? అనేది కూడా కీలకమే. ట్రంప్ చేసిన హెచ్చరికలు పౌరులకు కలిగే నష్టాన్ని పరిగణనలోకి తీసుకోలేదన్న అభిప్రాయాన్ని కలిగిస్తున్నాయి. దీనిపై కాంగ్రెస్‌లోని డెమోక్రాట్లు, ఐక్యరాజ్యసమితి అధికారులు, సైనిక చట్టాల నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి దాడులు అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించేవని వారు వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గూటెరెస్ అధికార ప్రతినిధి స్టెఫాన్ డుజారిక్ మాట్లాడుతూ, పౌర మౌలిక వసతులపై దాడులు అంతర్జాతీయ చట్టాల ప్రకారం నిషేధనమి హెచ్చరించారు. ఒకవేళ అవి సైనిక లక్ష్యాలుగా పరిగణలోకి తీసుకున్నప్పటికీ, పౌరులకు అధిక నష్టం కలిగించే అవకాశం ఉంటే దాడి చేయడం నిషిద్ధమని తేల్చిచెప్పారు. అమెరికా ఎయిర్ ఫోర్స్‌లో మాజీ న్యాయాధికారిగా పనిచేసిన రాచెల్ వాన్‌లాండింగ్‌హామ్ ప్రకారం, విద్యుత్ నిలిపివేయడం వల్ల ఆసుపత్రులు, నీటి శుద్ధి కేంద్రాలు ప్రభావితమై పౌరులు మరణించే ప్రమాదం ఉంది. ఇదిలా ఉండగా, పర్షియన్ గల్ఫ్‌లోని ముఖ్యమైన జలమార్గమైన హోర్ముజ్ జలసంధిలో నౌకాయానం దాదాపు నిలిచిపోయింది. ప్రపంచ చమురు సరఫరాలో సుమారు 20 శాతం ఈ మార్గం ద్వారా జరుగుతుంది. దీనివల్ల చమురు ధరలు పెరిగి, స్టాక్ మార్కెట్లు కూడా అస్థిరతకు గురయ్యాయి. ట్రంప్ మాత్రం యుద్ధ నేరాలపై తాను ఏ మాత్రం ఆందోళన చెందడం లేదని చెప్పారు. అవసరమైతే అన్ని విద్యుత్ కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేస్తామని కూడా హెచ్చరించారు. ఇక వైట్ హౌస్ ప్రతినిధి అన్నా కెల్లీ మాట్లాడుతూ, ఇరాన్ ప్రజలు తమపై అణచివేత చేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాంబుల శబ్దాన్ని స్వాగతిస్తారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, కొన్ని రాజకీయ నాయకులు ఈ వ్యాఖ్యలను సమర్థించారు. రిపబ్లికన్ సెనేటర్ జోని ఎర్నస్ట్ ఈ చర్యలు యుద్ధ నేరాలు కావని అన్నారు. కానీ డెమోక్రాటిక్ సెనేటర్ క్రిస్ వాన్ హోలెన్ మాత్రం ఇటువంటి దాడులు స్పష్టమైన యుద్ధ నేరం అవుతాయని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ చట్టాల ప్రకారం, ఒక విద్యుత్ కేంద్రం సైనిక స్థావరాలకు కూడా విద్యుత్ సరఫరా చేస్తే దానిని లక్ష్యంగా చేసుకోవచ్చు. కానీ దాడి వల్ల పౌరులకు కలిగే నష్టం అసమానంగా ఎక్కువగా ఉండకూడదు. అలాగే పౌర నష్టాన్ని తగ్గించడానికి అన్ని చర్యలు తీసుకోవాలి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ప్రత్యామ్నాయ మార్గాలు, ఉదాహరణకు ట్రాన్స్‌మిషన్ లైన్లు లేదా సబ్‌స్టేషన్లను లక్ష్యంగా చేసుకోవడం వంటి అంశాలను ముందుగా పరిశీలించాలి. మొత్తం విద్యుత్ కేంద్రాన్ని ధ్వంసం చేయడం చివరి చర్యగా ఉండాలి. ఇక అంతర్జాతీయ చట్టాల అమలు విషయంలో ఒక ముఖ్యమైన సమస్య ఉంది. దేశాలు తమ సార్వభౌమాధికారాన్ని విడిచిపెట్టకుండా బాహ్య సంస్థల ద్వారా బాధ్యతను స్వీకరించకపోతే, ఈ చట్టాలు అమలు చేయడం కష్టమవుతుంది. ఏదిఏమైనా, చట్టపరంగా సరైనదిగా భావించిన చర్యలు కూడా దీర్ఘకాలంలో ప్రతికూల ఫలితాలను ఇవ్వవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటువంటి చర్యలు ప్రజల్లో భయాన్ని పెంచి, విభేదాలను మరింత తీవ్రతరం చేసి, యుద్ధాన్ని దీర్ఘకాలం కొనసాగించే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు.


# ఓటర్లలో సగం.. పోటీలో నామమాత్రం..

### అస్సాం ఎన్నికల్లో మహిళల పరిస్థితి

**గువాహటి:** రాష్ట్రంలోని మొత్తం ఓటరు జాబితాలో మహిళలు 49.98 శాతం ఉన్నారు. 35 జిల్లాల్లో 16 జిల్లాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే ఎక్కువగా ఉన్నప్పటికీ, 126 సభ్యుల అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న 722 మంది అభ్యర్థుల్లో కేవలం 59 మంది మాత్రమే మహిళలు. ఇది మొత్తం అభ్యర్థుల్లో 8.17 శాతం మాత్రమే. ప్రచార సభల్లో మహిళలు భారీగా పాల్గొంటూ కనిపిస్తున్నప్పటికీ, రాజకీయ పార్టీలు వారికి టికెట్లు ఇవ్వడంలో వెనుకంజ వేస్తున్నాయని కార్యకర్తలు విమర్శిస్తున్నారు. మహిళా ఓటర్లను ఆకర్షించడానికి పలు హామీలు ఇస్తున్నా, అభ్యర్థిత్వం విషయంలో మాత్రం పరిమిత ప్రాతినిధ్యానికే కట్టుబడి ఉన్నారని వారు అంటున్నారు. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో 74 మహిళలు పోటీ చేసినప్పటికీ, ఈసారి ఆ సంఖ్య 59కి తగ్గింది. పార్టీలలో కాంగ్రెస్ అత్యధికంగా 14 మహిళా అభ్యర్థులకు టికెట్లు ఇచ్చింది. బిజెపి కేవలం 7 మందికి అవకాశం ఇచ్చింది. ఇతర పార్టీలు చాలా తక్కువ సంఖ్యలో మహిళలకు టికెట్లు ఇచ్చాయి. కొన్ని పార్టీలు అసలు మహిళలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదు. మహిళల ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ, 2029 లోక్‌సభ ఎన్నికల నుంచి 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని హామీ ఇస్తుండగా, మరోవైపు మహిళలకు నామమాత్రపు ప్రాతినిధ్యం కూడా దక్కకుండా చేయడం విడ్డూరం. బిజెపితోసహా పలు రాజకీయ పార్టీలు పదే పదే మహిళలను నిర్లక్ష్యం చేస్తున్నాయని స్పష్టమవుతున్నది. మహిళలు ఓటర్లుగా ఎక్కువగా పాల్గొంటున్నప్పటికీ, నాయకత్వ స్థాయికి వారిని తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు లేదా అవకాశాలు తగినంతగా లేవు. మహిళలు ఇప్పుడు నిర్లక్ష్యం చేయలేని ఓటు శక్తిగా మారినందున, పార్టీలు వారికి పథకాలు, ఆర్థిక సహాయం, సంక్షేమ హామీలతో ఆకర్షించడానికి ప్రయత్నిస్తున్నాయి. అయితే ఇది రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంచడంలోకి మారడం లేదని విమర్శలు ఉన్నాయి. ఒకవైపు మహిళలు ఓటర్లుగా సమానంగా లేదా ఎక్కువగా ఉన్నారు. మరోవైపు నిర్ణయాధికారంలో వారి భాగస్వామ్యం చాలా తక్కువగా ఉంది. ఇది కేవలం పార్టీలు అవకాశాలు ఇవ్వకపోవడం మాత్రమే కాదు... రాజకీయ వ్యవస్థలోని నిర్మాణాత్మక అడ్డంకులు, ఆర్థిక పరిమితులు, సామాజిక పరిస్థితులు కూడా దీనికి కారణమవుతున్నాయని స్పష్టమవుతున్నది. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు మాత్రమే సరిపోదు, నిర్ణయాధికారంలో సమాన భాగస్వామ్యం కూడా అవసరమనే వాస్తవాన్ని ఈ పరిస్థితి ముందుకు తెస్తోంది.

# మైనారిటీ వర్గాల పేర్లు తొలగింపు

- పశ్చిమ బెంగాల్‌లో 'సర్'పై మమతా బెనర్జీ



**కోల్‌కతా:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ('సర్')ను అడ్డం పెట్టుకొని మతువా, మైనారిటీ వర్గాల పేర్లను భారీగా తొలగించారని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) అధినేత్రి మమతా బెనర్జీ ఆరోపించారు. నదియా జిల్లాలోని చక్‌దహాలో జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, ఈ సవరణ ప్రక్రియలో పేర్లు కోల్పోయిన వారికి తమ పార్టీ మద్దతుగా నిలుస్తుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్ పట్ల వివక్ష చూపుతున్నదని ఆరోపించారు. కొన్ని ప్రత్యేక వర్గాలను లక్ష్యంగా చేసుకుని ఓటరు జాబితాల నుంచి పేర్లు తొలగిస్తున్నారని అన్నారు. మాతువాలు, రాజ్‌బన్షీలు, మైనారిటీల పేర్లు తొలగిస్తున్నారని అంటూ. 'ప్రజలకు ఇది అర్థం కావడం లేదా?' అని ఆమె ప్రశ్నించారు. ముర్షిదాబాద్, మాల్డా, ఉత్తర దినాజ్‌పూర్ వంటి మైనారిటీ జనాభా అధికంగా ఉన్న జిల్లాల్లో ఓటర్ల పేర్లు ఎంచుకుని తొలగిస్తున్నారని కూడా ఆమె ఆరోపించారు. అదే సమయంలో, సుప్రీంకోర్టులో తన జోక్యంతో 'అడ్జుడికేషన్' కింద ఉన్న సుమారు 60 లక్షల కేసుల్లో 32 లక్షల పేర్లు తిరిగి చేర్చిన వైనాన్ని మమత గుర్తుచేశారు. ఇంకా పేర్లు లేని వారు ట్రైబ్యునల్‌ను సంప్రదించాలని, వారికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ న్యాయ సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు. అక్రమ చొరబాట్ల విషయాన్ని ప్రస్తావిస్తూ, దేశ సరిహద్దులను రక్షించడం కేంద్ర బాధ్యతని, అయితే అది రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తున్నదని ఆమె అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలను ప్రజల గుర్తింపు, ప్రజాస్వామ్య హక్కులను కాపాడే పోరాటంగా అభివర్ణించిన మమత, ఓటర్లను తమ ఓటు ద్వారా స్పందించాలని కోరారు. 294 సభ్యుల పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఎన్నికలు ఏప్రిల్ 23, ఏప్రిల్ 29న తేదీల్లో, రెండు దశల్లో జరుగనున్నాయి. ఓట్ల లెక్కింపు మే 4న చేపడతారు.

## మణిపూర్‌లో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు

**ఇంఫాల్:** మణిపూర్‌లో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా మారింది. బిష్ణుపూర్ జిల్లాలో గ్రెనేడ్ దాడిలో గాయపడిన ఇద్దరు చిన్నారులు మరణించడంతో ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెచుకుంది. ఈ దాడికి అనుమానిత కుకి మిలిటెంట్లు కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఆగ్రహంతో కూడిన కొంత మంది సమీపంలోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్పిఎఫ్) శిబిరంపై దాడి చేశారు. పౌరులను రక్షించడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ క్యాంప్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి భద్రతా బలగాలు కాల్పులు జరపాల్సి వచ్చిందని సమాచారం. ఈ ఘటనలో పలువురు గాయపడి, వారిని ఇంఫాల్‌లోని ఆసుపత్రులకు తరలించారు. కాగా, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో నిరసనలు, రోడ్డు నిరోధాలు కొనసాగుతున్నాయి. కోంజెంగ్ హజారి లీకై ప్రాంతంలోని సెగా రోడ్ వద్ద కూడా ఆందోళనలు నమోదయ్యాయి. శాంతి భద్రతల పరిస్థితి దృష్ట్యా, ఇంఫాల్ వెస్ట్, ఇంఫాల్ ఈస్ట్, థౌబాల్, కకచింగ్, బిష్ణుపూర్ జిల్లాల్లో ఇంటర్నెట్, మొబైల్ డేటా సేవలను తాత్కాలికంగా నిలిపివేయాలని గవర్నర్ ఆదేశించారు. కాగా, సామాజిక మాధ్యమాల ద్వారా తప్పుడు సమాచారం, ద్వేష ప్రసంగాలు, రెచ్చగొట్టే వీడియోలు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా గుంపులను సమీకరించే అవకాశాన్ని నివారించడమే ఈ నిర్ణయ లక్ష్యంగా ఉంది. ఈ ఉద్రిక్తతకు ప్రధాన కారణమైన ఘటనలో, ట్రోంగ్లాఓబి ప్రాంతంలో జరిగిన బాంబు దాడిలో తీవ్రంగా గాయపడిన ఐదేళ్ల వయస్సు గల ఇద్దరు పిల్లలు, ఒయినామ్ టామ్‌థిన్, అతని సోదరి, మరణించారు. వారి తండ్రి భారత సైన్యంలో పనిచేస్తుండగా, తల్లి గౌహతిలో నర్సుగా పని చేస్తున్నారు. ఈ సంఘటన స్థానిక ప్రజల్లో తీవ్ర భావోద్వేగాన్ని రేకెత్తించింది. ఇప్పటికీ ప్రాంతంలో ఉద్రిక్తత కొనసాగుతుండగా, బాధితులకు న్యాయం చేయాలని, భద్రతా చర్యలను బలోపేతం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**బిజెపి అధికారంలోకి వస్తే**

# చొరబాటుదారులు వెనక్కే..

- పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా



**పథర్‌కండి/హైలాకండి (అస్సాం):** పశ్చిమ బెంగాల్‌లో 'పరివర్తన్' (మార్పు) అనివార్యమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా మంగళవారం పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమంగా ప్రవేశించిన వారందరినీ వారివారి స్వదేశాలకు పంపిస్తామని అన్నారు. పథర్‌కండిలో జరిగిన ఎన్నికల సభలో మాట్లాడుతూ, అస్సాంలోని బరాక్ లోయలో కాంగ్రెస్ పార్టీ అక్రమ వలసదారులకు ఆశ్రయం కల్పించిందని, అందువల్ల శ్రీభూమి, సిల్చర్, కచార్ జిల్లాల్లో వారు అధిక సంఖ్యలో ఉన్నారని ఆరోపించారు. పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) చట్టం అమల్లోకి వస్తే రాష్ట్రంలో అక్రమ ప్రవేశదారులు ఉండరని కాంగ్రెస్‌కు తెలుసని, అందుకు దానిని వ్యతిరేకిస్తున్నదని అన్నారు. బంగ్లాదేశ్ నుంచి హింసకు గురైన హిందువులు ఈ చట్ట పరిధిలోకి వస్తారని, అయితే కాంగ్రెస్ దీనికి వ్యతిరేకంగా ఉండి ముస్లిం అక్రమ ప్రవేశదారులను స్వాగతిస్తుందని అమిత్ షా ఆరోపించారు. భారతదేశం ఒక ధర్మశాల కాదని, అక్రమ ప్రవేశదారులకు దేశంలో స్థానం లేదని ఆయన స్పష్టం చేశారు. అస్సాం, త్రిపుర, బెంగాల్ ప్రాంతాల నుంచి వచ్చిన అక్రమ ప్రవేశదారులందరినీ తిరిగి పంపిస్తామని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అక్రమ ప్రవేశదారుల సహాయంతో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తోందని, కానీ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మూడు తరాల ప్రయత్నాలతో కూడా అస్సాంను అక్రమ వలసదారుల భూమిగా మార్చలేదని ఆయన విమర్శించారు. హైలాకండిలో మరో సభలో మాట్లాడుతూ, కాంగ్రెస్ అస్సాంలో ముస్లిం విద్యార్థుల కోసం 700 మదరసాలను నిర్మించిందని, అయితే బిజెపి వాటిలో 402ను ప్రాథమిక పాఠశాలలుగా మార్చి ఆధునిక విద్య అందించేలా చేసిందని అమిత్ షా వివరించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే గుజరాతీలను అక్షరాస్యతలేని వారిగా వ్యాఖ్యానించడం దుర్మార్గమని అమిత్ షా అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిని పాములుగా అభివర్ణించారని ఖర్గేపై ఆయన ఆరోపించారు. రాహుల్ గాంధీ నాయకత్వం వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ నాయకుల ప్రజా ప్రతిష్ఠ తగ్గిందని అన్నారు. ఎఐ సమ్మిట్ సందర్భంగా కాంగ్రెస్ నిరసనల ద్వారా దేశాన్ని అవమానించిందని కూడా ఆయన విమర్శించారు. నిరసనకారులను 'బబ్బర్ షేర్' అని రాహుల్ గాంధీ పిలవడం కాంగ్రెస్ స్థాయిని సూచిస్తుందని అమిత్ షా ఎద్దేవా చేశారు. ఈసారి 13 అసెంబ్లీ స్థానాలన్నింటినీ బిజెపి, దాని మిత్రపక్షాలు గెల్చుకుంటాయని ధీమా వ్యక్తం చేశారు.

# టిఎంసి, బిజెపి ఒకే నాణానికి రెండు పార్శ్వాలు



### కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్

**కోల్‌కతా:** పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి), బిజెపి అనేవి ఒకే నాణానికి రెండు పార్శ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేష్ వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి కొత్త ప్రత్యామ్నాయం అవసరమని, దాదాపు 20 సంవత్సరాల తర్వాత కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా మూడో మార్గాన్ని ప్రజలకు చూపుతున్నదని ఆయన తెలిపారు. కోల్‌కతాలో కాంగ్రెస్ మేనిఫెస్టో విడుదల సందర్భంగా మాట్లాడిన జైరాం రమేష్, 2006 తర్వాత ఇప్పుడు మళ్లీ పార్టీ స్వతంత్రంగా పోటీ చేస్తోందని, ఇది పార్టీకి బూస్టర్ డోస్‌లాంటిదని చెప్పారు. ఈ నిర్ణయం పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తుందని అభిప్రాయపడ్డారు. అలాగే, బిజెపిపై తీవ్ర విమర్శలు చేస్తూ, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. దేశ జాతీయ గీతం జనగణమనను పక్కన పెట్టే ప్రయత్నం కూడా జోరందుకుందని ఆయన వ్యాఖ్యానించారు.వందే మాతరం అంశాన్ని ముందుకు తెచ్చి సాంస్కృతిక రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) విషయంలో కూడా కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రజల పేర్లు తొలగించడాన్ని ఒక ప్రమాదకర ధోరణిగా పేర్కొన్నారు.

### సాధికారత కల్పించే...

# ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్మించేందుకు కట్టుబడి ఉండాలి


**కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పిలుపు**
**కేరళ నర్సులతో ఇటీవల జరిపిన సంభాషణ వీడియోను 'ఎక్స్'లో పోస్ట్**



**న్యూఢిల్లీ :** భారతదేశ ఆరోగ్యసంరక్షణ భవిష్యత్తునర్సులమీదే ఆధారపడిఉన్నందున,వారికిమద్దతునిస్తూ, గౌరవిస్తూ, సాధికారత కల్పించే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను నిర్మించడానికి కట్టుబడి ఉండాలని కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ పిలుపునిచ్చారు. ప్రాధాన్యతల విషయంలో వారి మాటే మార్గదర్శనం చేయాలని రాహుల్‌గాంధీ నొక్కిచెప్పారు. ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ కేరళకు చెందిన నర్సులతో తాను ఇటీవల జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియోను మంగళవారం తన సోషల్ మీడియా ఖాతా'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ఆ సంభాషణ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను కలిపి ఉంచే నిశ్శబ్ద శక్తిని తనకు గుర్తు చేసిందని అన్నారు. ఇటీవల ఢిల్లీలో పనిచేస్తున్న కేరళకు చెందిన నర్సుల బృందంతో మాట్లాడే అవకాశం తనకు లభించిందన్నారు. నర్సులే ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు పునాదిఅని రాహుల్‌గాంధీ నొక్కిచెప్పారు. వారి అంకితభావం, నిస్వార్థత, సానుభూతి వంటి లక్షణాలే తమ ప్రియమైన వారిని ఇతరుల సంరక్షణకు అప్పగించే ధైర్యాన్ని కుటుంబాలకు ఇస్తాయన్నారు. అనేక రకాలుగా, నర్సులే వైద్య రంగానికి మానవ ముఖం అని పేర్కొన్నారు. 'మా సంభాషణ సందర్భంగా నేను వారిని ఒక సాధారణ ప్రశ్నను అడిగాను. కేరళకు చెందిన నర్సులు భారతదేశం అంతటా, ప్రపంచ వ్యాప్తంగా ఎందుకు ఇంతగా గౌరవించబడుతున్నారు?. వారి సమాధానం కూడా అంతే సరళంగా ఉంది. కఠోర శ్రమ, నిజాయితీ, సానుభూతి అన్నారు. ఇవి కేవలం మాటలు కావు. కేరళ సంస్కృతిలో లోతుగా పాతుకుపోయిన విలువలు' అని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. రాష్ట్రం విద్య, ఆరోగ్యసంరక్షణ, మానవ అభివృద్ధిపై నిరంతరం పెట్టుబడులు పెడుతూ తాము వెళ్లే ప్రతీచోటా విలువలను పాటించే వృత్తి నిపుణుల తరాలను సృష్టిస్తోందని మాజీ కాంగ్రెస్ చీఫ్ రాహుల్ గాంధీ చెప్పారు. 'కానీ ఈ విషయంలో తీవ్రమైన ఆందోళనలు కూడా ఉన్నాయి. భారతదేశంలో శిక్షణ పొందిన నర్సుల కొరత గురించి వారు మాట్లాడారు. కొన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో ఒక వార్డులో 100మందికి పైగా రోగులను 15మంది నర్సులు మాత్రమే చూసుకుంటున్నారు. ఇది సురక్షితమైన ప్రపంచ ప్రమాణాలకు చాలా దూరంలోనే ఉంది. ఇది మన సిబ్బందికి అందే సంరక్షణ నాణ్యతను నేరుగా ప్రభావితం చేస్తుంది' అని రాహుల్‌గాంధీ చెప్పారు.

# మత విశ్వాసం.. న్యాయ సమీక్షకు అతీతం


- శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీం కోర్టు ముందు కేంద్రం వాదన



**న్యూఢిల్లీ:** మతాచారాల్లో శాస్త్రీయత లేకపోతే దాన్ని సరిదిద్దాల్సిన బాధ్యత చట్టసభదేనని సుప్రీం కోర్టులో కేంద్రం స్పష్టం చేసింది. నెలసరి వయసు ఉన్న మహిళలకు శబరిమల ఆలయంలో ప్రవేశ నిషిద్ధాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారిస్తున్నది. ఈ కేసులో కేంద్ర తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదన వినిపిస్తూ, ప్రతి మత సంప్రదాయాన్ని గౌరవించాల్సిన అవసరం ఉందని, ప్రతి విషయం గౌరవం లేదా శారీరక స్వేచ్ఛతో సంబంధం కలిగి ఉండదని అన్నారు. ఉదాహరణకు, మజార్ లేదా గురుద్వారాకు వెళ్లినప్పుడు తలను కప్పుకోవాల్సి వస్తే దాన్ని వ్యక్తిగత స్వేచ్ఛకు విరుద్ధమని చెప్పలేమని ఆయన వివరణ ఇచ్చారు. ఎవరైనా మానవ బలి వంటి ఆచారం మతపరమైనదని వాదిస్తూ కోర్టును ఆశ్రయించినా, అది ప్రజా శాంతి, నైతికత లేదా ఆరోగ్యానికి విరుద్ధమైతే కోర్టు నేరుగా తిరస్కరించవచ్చని ఆయన తెలిపారు. కోర్టు హేతుబద్ధమైన, అధునాతనమైన, శాస్త్రీయంగా సమర్థించదగిన ప్రమాణాల ఆధారంగా మతాచారాలను పరీక్షించకూడదని కేంద్రం వాదించింది. అలా చేయడం న్యాయ సమీక్ష కాకుండా, న్యాయమూర్తుల వ్యక్తిగత అభిప్రాయాలను మతంపై రుద్దినట్లవుతుందని పేర్కొంది. రాజ్యాంగంలో సాంఘిక నైతికత అనే పదం స్పష్టంగా లేకపోయినా, కోర్టులు దాన్ని విస్తృతంగా అర్థం చేసుకోవడం న్యాయ పరిమితులను మించడమే అవుతుందని కేంద్రం అభిప్రాయపడింది. భారతదేశం బహుమత సమాజం కావడంతో, ప్రతి మతానికి, ప్రతి వర్గానికి వేర్వేరు ఆచారాలు, విశ్వాసాలు ఉంటాయని, వాటిని కోర్టు అర్థం చేసుకోవడం సవాలుగా ఉంటుందని కేంద్రం తెలిపింది. 2018లో ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన రాజ్యాంగ పీఠం 4:1 ఆధిక్యంతో ఇచ్చిన తీర్పులో, 10 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళలకు శబరిమల అయ్యప్ప ఆలాయంలో ప్రవేశాన్ని నిషేధించే సంప్రదాయం చట్టవిరుద్ధమని ప్రకటించింది. తర్వాత 2019లో మరో రాజ్యాంగ పీఠం ఈ అంశాన్ని విస్తృతంగా పరిశీలించేందుకు పెద్ద పీఠానికి పంపింది. ఈ కేసుతో పాటు, మసీదులు, దర్గాలు, అలాగే పార్సీ ఆగియారీల్లో మహిళల ప్రవేశానికి సంబంధించిన ఇతర అంశాలనూ కోర్టు పరిశీలిస్తోంది. ఫిబ్రవరి 16న సుప్రీంకోర్టు ఈ కేసులో తుది విచారణను ఏప్రిల్ 7 నుంచి ప్రారంభిస్తామని తెలిపింది. ఈ విచారణ ఏప్రిల్ 22 వరకు కొనసాగే అవకాశం ఉంది. ఈ వివాదం మత స్వేచ్ఛ, లింగ సమానత్వం మధ్య ఉన్న సున్నితమైన ఘర్షణను ప్రతిబింబిస్తోంది.

# షా బానో బేగం కేసుపై పుస్తకం!

**రచయిత్రిపై మూక దాడి ఆరోపణ.. ఖండించిన పోలీసులు**



**ఇండోర్:** తనను తాను ఒక రచయిత్రిగా ప్రకటించుకున్న ఒక మహిళ, ఒకప్పుడు సంచలనం సృష్టించిన షా బానో కేసుపై పుస్తకం రాయడానికి కుటుంబ సభ్యులను కలవడానికి ప్రయత్నించినప్పుడు తనపై మూకదాడి జరిగిందని ఆరోపించింది. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో తాను ఇందోర్‌కు వచ్చినప్పుడు, పిల్లలను అపహరించే వ్యక్తిగా అనుమానించి ఒక గుంపు తనపై దాడి చేసిందని ఆరోపించింది. అయితే పోలీసులు ఈ ఆరోపణలను తోసిపుచ్చారు. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక వీడియోలో, ఆ మహిళ తన పుస్తక ప్రాజెక్ట్ కోసం షా బానో కుటుంబ సభ్యులను కలిసేందుకు వచ్చానని చెప్పింది. అయితే ఆ వీడియో విశ్వసనీయతను నిర్ధారించలేకపోతున్నట్టు పిటిఐ తన వార్తా కథంలో పేర్కొంది. ఇందోర్‌కు వచ్చిన ఈ మహిళ, పుస్తక ఒప్పందానికి సంబంధించి షా బానో కుటుంబ సభ్యులు అధికంగా డబ్బు కోరారని, తాను అభ్యంతరం వ్యక్తం చేయడంతో వారితో వాగ్వాదం జరిగిందని తెలిపింది. ఆ సమయంలో ఒక వ్యక్తి తనను చైల్డ్ లిఫ్టర్‌గా ఆరోపించడంతో అక్కడ చేరుకున్న గుంపు తనపై దాడి చేసిందని ఆమె ఆరోపించింది. అయితే, ఖజ్రానా పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జ్ మనోజ్ సింగ్ సెంధవ్ ఈ మూక దాడి ఆరోపణలను ఖండించారు. పరస్పర ఒప్పందంతో ఇరు పక్షాలు ఎలాంటి ఫిర్యాదు చేయకూడదని నిర్ణయించుకున్నాయని కూడా ఆయన వివరించారు. అదనపు ఉప పోలీస్ కమిషనర్ రాజేష్ దండోత్యా వివరణ ప్రకారం, ఆ వివాద సమయంలో మహిళపై డేటా చోరీ ఆరోపణలు వచ్చాయి. కానీ అక్కడ ఉన్నవారు దాన్ని 'బేటా చోరీ' (పిల్లల అపహరణ)గా తప్పుగా అర్థం చేసుకోవడంతో కొంత గందరగోళం ఏర్పడింది. ఈ పరస్పర ఒప్పందం కారణంగా, మహిళగానీ, షా బానో కుటుంబ సభ్యులుగానీ ఎవరూ పోలీసులకు అధికారిక ఫిర్యాదు ఇవ్వలేదు. షా బానో ఇందోర్ నివాసి. 1978లో ఆమె తన న్యాయవాది భర్త మహ్మద్ అహ్మద్ ఖాన్ నుంచి విడాకులు పొందిన తరువాత, పోషణ కోసం కోర్టును ఆశ్రయించింది. దీర్ఘకాల న్యాయ పోరాటం తరువాత, 1985లో సుప్రీం కోర్టు ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ తీర్పుకు వ్యతిరేకంగా ముస్లిం సంస్థల నుంచి నిరసనలు వ్యక్తమయ్యాయి. అనంతరం అప్పటి ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ ప్రభుత్వం 1986లో ముస్లిం మహిళల (వివాహ విరమణ తర్వాత హక్కుల పరిరక్షణ) చట్టాన్ని ప్రవేశపెట్టింది. ఈ చట్టం ద్వారా సుప్రీంకోర్టు తీర్పు ప్రభావం తగ్గించారు. కాగా, షా బానో 1992లో మరణించింది.

### ఎన్‌డిఏ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రతీ రూపంలో..

# మహిళా సాధికారతకు ప్రాధాన్యత ఇచ్చింది

### ప్రధాని మోదీ ఉద్ఘాటన



**న్యూఢిల్లీ :** తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రతీ రూపంలోమహిళా సాధికారికతకు ప్రాధాన్యతను ఇచ్చిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్ల చట్టంతో భారతదేశం మరింత మహిళా నేతృత్వంలోని పాలన దిశగా పయనిస్తోందని నొక్కి చెప్పారు. మరింత సమ్మిళిత పాలనకు, అభివృద్ధి చెందిన భారతదేశానికి మహిళల అధిక ప్రాతినిధ్యం ఎంత కీలకమో నొక్కిచెబుతూ 'మహిళల శాసన నాయకత్వాన్ని పెంపొందించడం' అనే అంశంపై కేంద్ర మంత్రి అన్నపూర్ణాదేవి ఒక వార్తా పత్రికలో రాసిన వ్యాసంపై ఆయన వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రి మోదీ మంగళవారం తన 'ఎక్స్'పోస్ట్‌లో ఈ విషయమై స్పందిస్తూ ఇలా అన్నారు. 'ప్రాతినిధ్యం అనేది ప్రభావాన్ని చూపాలి. ప్రభుత్వం ఎల్లప్పుడూ ఇ'రూపంలో నారీ శక్తికి ప్రాధాన్యతనిచ్చింది. అందువల్ల నారీ శక్తివందన అధినియమ్ పునాది వేయడంతో భారతదేశం మరింత మహిళా నేతృత్వంలోని పాలన వైపు పయనిస్తోంది. ఇది వికసిత్ భారత్‌కు కూడా కీలక స్తంభం' అని అన్నారు. నారీ శక్తి వందన అధినియమ్ మరింత జనాదరణ పొందిన 2023లో పార్లమెంట్ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టం. ఈ చట్టం ప్రకారం లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్ ఇవ్వబడుతుంది. రాజ్యాంగాన్ని సవరించి తీసుకువచ్చిన ఈ చట్టం నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అమలులోకి వస్తుంది. 2029లో అమలు చేసేందుకు మహిళా రిజర్వేషన్ చట్టాన్ని సవరించేందుకు ప్రధానమంత్రి శనివారం పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలను ఏప్రిల్ 16నుండి 18వరకు మూడు రోజులు పొడిగిస్తున్నట్లు ప్రకటించారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియకు ముందే చట్టాన్ని అమలు చేయాలన్న ప్రతిపాదన వాస్తవంగా కార్యరూపం దాల్చితే రాజ్యాంగానికి మరొక సవరణ అవసరం అవుతుందని అధికారులు తెలిపారు. మూడు రోజుల పార్లమెంట్ సమావేశంలో ప్రభుత్వం ఈ మేరకు ఒక చట్టాన్ని ఆమోదించే అవకాశం ఉంది. ఇది మహిళా సాధికారతకు సంబంధించిన అంశం కాబట్టి అన్ని రాజకీయ పార్టీలు విశాల దృక్పథంతో, రాజకీయ లెక్కలకు అతీతంగా పూర్తి మద్దతు ఇవ్వాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ కోరారు.

# కష్టకాలంలో క్యూబా సంఘీభావమే బలం

సోషలిస్టు క్యూబా తన ఆరున్నర దశాబ్దాల అస్థిత్వంలో ఎన్నడూ ఎరుగనంతటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నది. 1959లో ఫైడల్ కాస్ట్రో నాయకత్వంలో విప్లవ ప్రభుత్వం ఏర్పడిన దరిమిలా అమెరికా అధ్యక్షులందరూ దాని గొంతునులమటానికి ప్రయత్నిస్తూనే వచ్చారు. ఆర్థిక ఆంక్షలు కొనసాగిస్తూనే ఉన్నారు. అయినా క్యూబన్‌ల విప్లవ దీక్ష వాటన్నింటినీ తట్టుకుంటూ సోషలిస్టు అభివృద్ధి పథంలో పురోగమిస్తూనే ఉంది. ప్రస్తుత అధ్యక్షుడు డోనాల్డ్‌ట్రంప్ దాని ఆయువుపట్టు మీద దెబ్బకొట్టాడు. ఆయిల్ సరఫరాను నిషేధించాడు. క్యూబాకు ఏ దేశం ఆయిల్ సరఫరా చేసినా భారీ సుంకాలు విధిస్తానని హెచ్చరించాడు. క్యూబాను స్వాధీనం చేసుకుంటానని బహిరంగ ప్రకటన చేశాడు, "నా ఉద్దేశం, నేను దానికి స్వేచ్ఛ కల్పించవచ్చు లేదా స్వాధీనం చేసుకోవచ్చు. నేను ఏమి అనుకుంటే అది చేయగలను" అని వైట్‌హౌస్‌లో విలేకరులతో చెప్పారు. ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబాపై దృష్టి కేంద్రీకరిస్తానని గత నెలలో ప్రకటించాడు. ట్రంప్ రెండవసారి అధికారంలోకి వచ్చాక లాటిన్ అమెరికాలోని కమ్యూనిస్టు, ప్రగతిశీల ప్రభుత్వాలను మార్చటంపై దృష్టి పెట్టడం గుర్తు చేసుకోదగింది. ఈ దుర్మార్గపు లక్ష్యసాధనకై ఆయన జనవరి 29న క్యూబాపై పూర్తిగా ఆయిల్ దిగ్బంధం ప్రకటించాడు. ఆ దీవి దేశానికి ఆయిల్ సరఫరా చేయటానికి యత్నించిన దేశాలపై అమెరికా ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడి చేసింది. దీనికి తోడు విదేశాంగమంత్రి మార్కో రుబియో క్యూబాకు విదేశీ మారక ద్రవ్యం అందే ప్రతి ఒక్క మార్గాన్ని మూసివేసే ప్రయత్నం మొదలు పెట్టాడు. క్యూబా ఆదాయంలో ఒక ప్రధాన వనరు విదేశాల్లో సేవలందించే దాని డాక్టర్లు. వారిని వెనక్కుపంపేటట్లు వారి సేవలు ఉపయోగించుకుంటున్న దేశాలపై రుబియో ఒత్తిడి తెచ్చాడు. ఎంతటి అమానుషం!

ట్రంప్ క్యూబాపై దిగ్బంధనాన్ని కఠినం చేసి, మిత్రదేశాల ఆయిల్ ఓడలేవీ క్యూబన్ రేవులకు చేరకుండా చూడటంతో క్యూబా తీవ్రమైన ఇంధన సంక్షోభం ఎదుర్కొన్నది. విద్యుచ్ఛక్తి ఉత్పత్తి కనీస స్థాయికి పడిపోయింది. బ్లాకౌట్లు సర్వసాధారణమైనాయి. బస్సులు, కార్లు నిలిచిపోయాయి. ఎప్పుడు కరెంటుపోతుందో తెలియక ఆసుపత్రుల్లో ఆపరేషన్‌లు బంద్ అయినాయి. మరణాల సంఖ్య సాధారణం కన్నా రెట్టింపు అయింది. ఈ దుర్భర స్థితిలో క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ డియజ్ కనెల్ ట్రంప్‌తో చర్చలు ప్రతిపాదించినా నిరాకరించబడినాయి. గొంతునొక్కటమే ట్రంప్ ఉద్దేశం కదా! ఈ పరిస్థితుల్లో ఒక రష్యన్ ఓడ ఆయిలుతో క్యూబా చేరుకుని ఊపిరి సలుపుకునేటట్లు చేసింది. మరో ఓడ పంపుతామని ఊరటగొలిపే మాట చెప్పింది.

అమెరికా ప్రభుత్వంతో క్యూబా తెరవెనుక చర్చల పర్యవసానంగానే రష్యన్ ఆయిలును అనుమతించారని చెప్పబడుతున్నది. అందుకు బదులుగా క్యూబా 2010 నుండి అమెరికన్ ఖైదీలను విడుదల చేసింది. ట్రంప్ క్యూబన్‌ల ప్రాణాలతో చెలగాటమాడకుండా ఆయిలు, యితర నిత్యావసరాల దిగుమతిని అనుమతిస్తాడని ఆశించుదాం. ట్రంప్ ఇరాన్‌తో యుద్ధంలో తలమునకలుగా ఉన్న కారణాన క్యూబాతో ఘర్షణను వాయిదా వేసుకున్నాడా లేక మానవతా దృక్పథంతో రష్యన్ ఆయిలు ట్యాంకర్‌ను అనుమతించాడా – వేచి చూడాల్సి ఉంది.

క్యూబా దశాబ్దాలుగా విదేశీ సహాయంపై ఆధారపడి ఉంది. సోవియట్ యూనియన్, తూర్పు యూరప్ సోషలిస్టు ప్రభుత్వాలు దీర్ఘకాలం అన్ని విధాల అండగా ఉన్నాయి. తర్వాతకాలంలో వెనిజులా ఇంధనం సరఫరా చేస్తూ ఆర్థిక వ్యవస్థ, ప్రజాజీవనం ప్రాణం నిలుపుతూ వచ్చింది. అయితే వెనిజులా అధ్యక్షుడు మదురోను ట్రంప్ తప్పుడు ఆరోపణతో బంధించి అమెరికా తీసుకెళ్లిన దరిమిలా క్యూబాకు ఆయిలు సరఫరాను ట్రంప్ నిలుపు చేశాడు. క్యూబా మొదటిసారి ఒంటరి అయింది. ఇంధన దిగ్బంధానికి ముందు క్యూబా రోజూ 1,10,000 బ్యారల్స్ ఆయిలు వినియోగించేది. అందులో 40 వేల బ్యారల్స్ దేశీయ ఉత్పత్తి. మిగతాది వెనిజులా, మెక్సికో, రష్యా నుంచి సరఫరా అయ్యేది. ట్రంప్ సృష్టించిన ప్రస్తుత సంక్షోభం క్యూబన్ ప్రజల నిభాయింపు శక్తిని పరీక్షిస్తున్నది. సామాజిక అశాంతిని, ప్రజల తిరుగుబాటును సృష్టించటం ట్రంప్ ఉద్దేశం. మియామిలో నివసిస్తున్న వలసవచ్చిన క్యూబన్‌లు సంపన్నులు. వారికి క్యూబా సోషలిస్టు రిపబ్లిక్ వ్యతిరేక విద్రోహ చర్యల నిమిత్తం అమెరికన్ మితవాదులు, మాగా మద్దతుదారులు ధనం సమకూర్చుతున్నారు. విదేశాంగమంత్రి రుబియో స్వయానా క్యూబన్ వలస కుటుంబ పుత్రుడు.

ట్రంప్ ఉద్దేశాలు, వ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ, మారిన ప్రపంచ పరిస్థితులు, భౌగోళిక రాజకీయాల దృష్ట్యా క్యూబా కమ్యూనిస్టు పార్టీ, ప్రభుత్వం తమ విధానాలను పునఃసమీక్షించుకోవలసిన స్థితిలోకి నెట్టబడు తున్నాయి. 2021లో చేపట్టిన ద్రవ్య విధాన సంస్కరణ విఫలమైందని వారు గుర్తిస్తున్నారు. దేశ ఇంధన అవసరాల్లో 40 శాతం లభ్యత మీదే ఆధారపడి, ద్రవ్య పరంగా గొంతు బిగించబడుతున్న స్థితిలో ఏ ఆర్థిక వ్యవస్థ నిలబడలేదు. కాబట్టి చైనా, వియత్నాంలు ఆదర్శంగా విధానాల్లో సడలింపులను క్యూబా ఆలోచించవచ్చు.

క్యూబన్‌లు ప్రస్తుత పరిస్థితికి ట్రంప్ ఆయిలు దిగ్బంధనంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనాటి క్లిష్ట పరిస్థితుల్లో క్యూబాకు ప్రపంచ ప్రగతిశీల శక్తుల సంఘీభావం ఎంతైనా అవసరం. క్యూబా కూడా అమెరికాతో చర్చలు కోరుకుంటున్నది. దిగ్బంధనాన్ని సడలించేందుకు ట్రంప్ తెరవెనుక చర్చలు కొనసాగిస్తారా లేక ప్రభుత్వం మార్పునకు మొండిగా ముందుకెళతారా? వేచి చూదాం! ●



## 'సర్' అత్యంత ప్రమాదకరంగా మారింది

**బిజెపి 'సర్' ని ఒక ఎన్నికల అస్త్రంగా ఉపయోగించుకుంటున్నది. ఎన్నికల కమిషన్‌తో కలిసి కేంద్ర ప్రభుత్వం ప్రజల ఓటు హక్కును కొల్లగొడుతున్నది. ప్రస్తుతం ఈ అంశంపై కేసు సుప్రీం కోర్టులో ఉంది. అందరికీ ఓటు హక్కు లభించేలా తీర్పు ఉంటుందనే నమ్ముతున్నాను. మీ అందరికీ రాజ్యాంగం గురించి తెలుసు. కానీ, అతి కొద్దిమందికి మాత్రమే మొదటి రెండు కాపీలలో 22 చిత్రాలు ఉన్నాయని తెలుసు. ఆ బాధ్యతను నిర్వర్తించిన ఘనత నందన్‌లాల్ బోస్‌కు దక్కుతుంది. ఆయన కుటుంబీకుల పేర్లు ఇప్పుడు ఎన్నికల జాబితాలో లేవు. 'సర్' ఎంతటి ప్రమాదకరమో చెప్పడానికి ఇదో ఉదాహరణ. వందేమాతరం గీతాన్ని పాడాలని ఆదేశించడం ద్వారా విశ్వగురు రవీంద్రనాథ్ ఠాగూర్‌ను కేంద్ర ప్రభుత్వం అవమానించింది.**

– కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జైరామ్ రమేష్




## జంతు ప్రదర్శనశాలలు మానసిక ఉల్లాస కేంద్రాలు!

సాధారణ జంతువులతో పాటు అరుదైన, అంతరించే స్థితిలో ఉన్న జంతువులను సహితం పరిచయం చేసే కేంద్రాలను జంతు ప్రదర్శనశాల 'జూ' లేదా 'జులాజికల్ గార్డెన్' అని పిలుస్తున్నాం. మనం చూడడానికి వీలుకాని అటవీ జంతువులను మన కళ్ల ముందుకు చేర్చే గురుతర బాధ్యతలను 'జూ'లు తీసుకుంటున్నాయి. అంతరించే జంతుజాతులను సంతానోత్పత్తి ద్వారా కాపాడడం, ప్రజలకు జంతువుల జీవ వ్యవస్థలను పరిచయం చేయడం, జీవ వైవిధ్య ప్రాధాన్యాన్ని వివరించడం, జంతువుల పరిరక్షణ ప్రాధాన్యాన్ని అవగాహన పర్చడం, జంతు విజ్ఞానాన్ని పొందడం, వినోదాలను పంచే కేంద్రాలుగా 'జూ'లు సేవలు అందించడం, పిల్లలు పెద్దలకు వివిధ రకాల జంతువులు వీనుల విందులు వడ్డించడం జరుగుతున్నది. ప్రతి ఏట మిలియన్ల ప్రజలు/ పిల్లలు జంతుప్రదర్శనశాలలను సందర్శించడం కొనసాగుతున్నది.

**ప్రపంచవ్యాప్తంగా జంతుప్రదర్శనశాలలు:** ప్రపంచవ్యాప్తంగా 10,000లకు పైగా జంతుప్రదర్శనశాలలు ఉండగా, అత్యధికంగా అమెరికాలో 350, జర్మనీలో 316, యూకె లో 118, ఆస్ట్రేలియాలో 104, జపాన్‌లో 96, బ్రెజిల్‌లో 80, భారత్‌లో 66 గుర్తింపు పొందిన 'జూ'లు ఉన్నాయి. భారత కేంద్ర జూ అథారిటీ గుర్తించిన 347'జూ'లు ఉండగా, అందులో 164 మాత్రమే అధికారికంగా పేరును పొందాయి.

వివిధ అరుదైన జంతువులను ప్రజల సందర్శనార్థం మన ముందుకు చేర్చిన జంతుప్రదర్శనశాలలను ప్రస్తుతిస్తూ 2002 నుంచి ప్రతి ఏట 08 ఏప్రిల్ న జాతీయ జంతుప్రదర్శనశాల ప్రేమికుల దినం లేదా నేషనల్ జూ లవర్స్ డేను పాటించుట ఆనవాయితీగా మారింది. జంతు ప్రేమికులు బాధ్యతగా చిన్న/పెద్ద జంతు సంరక్షణలు భాగస్వామ్యం అవుతున్నారు. కొన్ని శతాబ్దాలుగా జంతుప్రదర్శనశాలలు మానవాళి మనుగడకు ప్రశ్నార్థకం చేసాయి. అంతరించే దశలో అరుదైన జాతులుగా ఉన్న అమాయక అందమైన జంతువులు మనిషితో ముఖాముఖి నిలవడం అద్భుత అనుభవంగా నిలుస్తున్నది.

'జూ'లకు విరాళాలు అందించడం, పిల్లలను జూలకు తీసుకు వెళ్లడం, ఎన్నడూ చూడని, నేటి వరకు తెలియని జంతువులను చూసి మానసిక ఉల్లాస అపూర్వ అనుభవం పొందుదాం.

*(08 ఏప్రిల్ జాతీయ జూ ప్రేమికుల దినోత్సవం సందర్భంగా)*

# 'సైద్ధాంతికంగా దివాలా తీసిన కాంగ్రెస్' కేరళలో మూడోసారి ఎల్‌డిఎఫ్ ఖాయం



'ది హిందూ' ఇంటర్వ్యూలో సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా

కేరళలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం అనేక రంగాలలో విజయం సాధించిందని, వరుసగా మూడోసారి కూడా గెలుస్తుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. కాంగ్రెస్ నిందారోపణల ప్రచారం, ఆరోపణలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఆ పార్టీ సమస్యల ఆధారంగా ప్రభుత్వాన్ని విమర్శించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ హ్రస్వ దృష్టితో వ్యవహరిస్తోందని, ఆ పార్టీ ఆత్మపరిశీలన చేసుకోవాలని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. కేరళ శాసన సభ ఎన్నికల్లో భాగంగా వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) తరపున ఆయన విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా 'ది హిందూ' ఆంగ్ల దినపత్రిక ప్రతినిధి ఎస్.ఆనందన్ చేసిన ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు:

**ప్రశ్న:మీరు మున్నార్‌లో తమిళ ప్రజలతో తమిళంలో మాట్లాడుతున్నారు...**

**రాజా :** ప్రజలు కోరుకోవడంతో నేను తిరువనంతపురం, పునలూరులలో కూడా తమిళంలో ప్రచారం చేశాను. ప్రజలలో అపారమైన ఆప్యాయత ఉంది. వారు నిరాధారమైన ఆరోపణల కన్నా తమ జీవనోపాధికి, రాష్ట్ర ప్రగతికి సంబంధించిన సమస్యల గురించి వినాలని కోరుకుంటున్నారు.

**ప్రశ్న :** కేరళలోని వామపక్షాలు అధికారంలో కొనసాగాలని కోరుకుంటున్నప్పటికీ, వాటికి బిజెపితో, అలాగే సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ)తో కూడా రహస్య అవగాహన ఉందనే ఆరోపణల పై విమర్శలను ఎదుర్కొంటున్నాయి.

**రాజా :** ఇవన్నీ నిరాధారమైన ఆరోపణలు. చరిత్రను చూస్తే, ప్రపంచంలో తొలిసారిగా బ్యాలెట్ ద్వారా కేరళ 1957లోనే కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని ఎన్నుకుంది.

వామపక్ష ఉద్యమం ఎవరికోసం నిలబడుతుందో, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తుందో ఇక్కడి ప్రజలకు బాగా తెలుసు. కేరళ ప్రజల రాజకీయ పరిపక్వతను, సైద్ధాంతిక అవగాహనను ఎవరూ తక్కువ చేయలేరు. మెజారిటీ లేదా మైనారిటీకి చెందిన మతతత్వ, ఫాసిస్ట్ శక్తులతో పోరాడుతున్న ఏ మాత్రం రాజీపడని శక్తి వామపక్షమే. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ 'వామపక్షం తన వామపక్ష స్వభావాన్ని కోల్పోయింది' అని అన్నారు. ఆయన ఉద్దేశం ఏమిటి? ఆయన వివరించగలరా?

రాజకీయ పార్టీలను ప్రజలు వాటి పనితీరు, కేరళ భవిష్యత్తు పట్ల వాటి రాజకీయ, సైద్ధాంతిక దృక్పథం ఆధారంగా అంచనా వేస్తారు. ప్రజల నాడిని బట్టి చూస్తే, ఎల్‌డిఎఫ్ వరుసగా మూడోసారి కూడా అధికారంలో కొనసాగుతుందని నేను విశ్వసిస్తున్నాను. వయోజన ఓటు హక్కు మన ప్రజాస్వామ్యం సాధించిన ప్రధాన విజయాలలో ఒకటి. ప్రజలు ఎలా ఓటు వేయాలనేది పూర్తిగా వారి ఇష్టం. అయితే, ఎలాంటి మతతత్వ శక్తులతోనైనా మాకు సైద్ధాంతికంగా గానీ, రాజకీయంగా గానీ ఎటువంటి రాజీ లేదు.

**ప్రశ్న : కేవలం రెండు నెలల క్రితం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో ఎల్‌డిఎఫ్ పరాజయాన్ని దృష్టిలో పెట్టుకుంటే, ప్రభుత్వ వ్యతిరేకత పని-చేస్తోందని అనిపించడం లేదా?**

**రాజా :** అవును, కొన్ని ఎదురుదెబ్బలు ఉన్నాయి. స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రజలు స్థానిక పరిపాలనా సమస్యలు, వ్యక్తుల ప్రవర్తన వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓటు వేస్తారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై దీర్ఘకాలిక ప్రభావం చూపే సమస్యలపై ప్రజలు వివేకవంతమైన, ఆలోచనాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటారు. కేరళ మత సామరస్యానికి ప్రసిద్ధి చెందింది. ప్రజలు కలిసి జీవిస్తూ తమ సమస్యలను, సవాళ్లను పంచుకుంటారు. అందుకే కేరళ ప్రజలకు వామపక్షాలు చాలా ముఖ్యమైనవి.

**ప్రశ్న : కేరళ రాజకీయాల్లోకి బిజెపి చొచ్చుకుపోవడం వామపక్షాలకు ఆందోళన కలిగించే విషయం కాదా?**

**రాజా :** కచ్చితంగా. ఇటీవలి కాలంలో బిజెపి ఓట్ల శాతం కొంత మేరకు పెరిగింది. దాని ప్రచారం విస్తృతంగా వ్యాపించింది. ప్రధానమంత్రి మొదలుకొని, బిజెపి అగ్ర నాయకులు తరచుగా కేరళను సందర్శిస్తుంటారు ఎందుకంటే వారు వామపక్షాల పాలనలో ఉన్న కేరళను వారు ఒక సవాలుగా చూస్తున్నారు. వారి నిరాశ మోదీ హావభావాలలో స్పష్టంగా కనిపిస్తోంది. ఆయన కేరళకు వచ్చి 'వికసిత్ కేరళం' గురించి మాట్లాడుతున్నారు. ఇంతకుముందు ఆయన 'వికసిత్ భారత్' గురించి మాట్లాడారు. అది ఎక్కడుంది? 'వికసిత్ భారత్'లో కేరళ భాగం కాదా? దక్షిణ భారతదేశంలో బిజెపి ఎక్కడ ఉంది? ప్రజలు తమను తిరస్కరిస్తూనే ఉండటం బిజెపికి ఆందోళన కలిగిస్తోంది. బిహార్, మహారాష్ట్ర, హర్యానాలలో ఆ పార్టీ ఎత్తుగడలు ఇక్కడ పనిచేయవు. దక్షిణ భారతదేశానికి దానికంటూ ఒక ప్రత్యేక చరిత్ర ఉంది. ఈ ప్రాంతంలో వారి రాజకీయాలు సఫలం కాబోవని బిజెపికి తెలుసు.

నరేంద్ర మోదీ ఇక్కడికి వచ్చి కేరళ అప్పుల సమస్యను లేవనెత్తారు. ఇప్పుడు ప్రజలు, నేను కూడా అడుగుతున్నాం. ప్రస్తుతం భారతదేశ విదేశీ రుణం ఎంత? దానికి ఎవరు బాధ్యులు? భారత రూపాయి విలువ కు ఏమైంది? ఈ పరిస్థితికి మోదీ సిగ్గుపడాలి. ఆయన ముఖ్యమంత్రి గా ఉన్నప్పుడు ' భారత రూపాయి విలువ దేశ గౌరవాన్ని ప్రతిబింబిస్తుంద'ని అన్నారు. మరి ఇప్పుడు ఆ గౌరవం ఎక్కడ ఉంది?

**ప్రశ్న:మీరు రాహుల్ గాంధీ వ్యాఖ్యల గురించి ప్రస్తావించారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ కూడా అంతే నిరాశలో ఉందా?**

**రాజా :** అవును, కాంగ్రెస్, రాహుల్ గాంధీ తీవ్ర నిరాశలో ఉన్నారు. కానీ వారు గంభీరమైన ఆత్మపరిశీలన చేసుకోవాలి. బిహార్ ఎన్నికలలో మహాఘట్‌బంధన్ ఓటమికి కాంగ్రెస్ బాధ్యత వహించాలి. సరైన సీట్ల పంపకం గానీ, ఉమ్మడి ప్రచారం గానీ జరగలేదు.

హర్యానాలో కూడా పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు, ఆ నిందను కాంగ్రెస్ స్వీకరించాలి. కాంగ్రెస్ సైద్ధాంతిక దివాళా, రాజకీయ అసమర్థత అందరికీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినప్పటికీ, మనలాంటి ప్రజాస్వామ్యంలో సమర్థవంతంగా ఎలా పనిచేయాలనే దానిపై ఆత్మపరిశీలన చేసుకోవడానికి అది నిరాకరిస్తోంది. అందుకే కాంగ్రెస్ నిరాశకరమైన స్థితికి చేరుకుని, నిందాపూర్వక ప్రచారాలు, ఆరోపణలకు పాల్పడుతూ ఇంత నీచస్థాయికి దిగజారుతోంది.

**ప్రశ్న : భారత కూటమి వైఫల్యాలకు కాంగ్రెస్ బాధ్యత వహించాలా?**

**రాజా :** మేము కాంగ్రెస్ పార్టీకి సరిగ్గా అదే సూచిస్తున్నాం. మనం కలిసి పనిచేసేటప్పుడు, పరస్పర విశ్వాసం, పరస్పర సర్దుబాటు ఉండాలి. రాజ్యాంగాన్ని పరిరక్షించడం, లౌకిక ప్రజాస్వామ్య గణతంత్రాన్ని కాపాడటం, సామాజిక న్యాయం, సమానత్వ సూత్రాలపై దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం మన ప్రాథమిక లక్ష్యం. కేరళ విషయానికి వస్తే, ఎల్‌డిఎఫ్ పనితీరు అందరికీ స్పష్టంగా కనిపిస్తోంది.

కాంగ్రెస్ నిజంగా ఎల్‌డిఎఫ్‌ను విమర్శించాలని భావిస్తే... కనీసం ఒక్క అంశాన్ని అయినా తీసుకుని దాని ఆధారంగా ప్రభుత్వాన్ని విమర్శించవచ్చు. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అనేక రంగాలలో విజయం సాధించిందని మేము విశ్వాసంతో చెప్పగలం. అనేక సూచికలలో కేరళ మొదటి స్థానంలో ఉంది. ఇక్కడ బహుముఖీన పేదరికం అత్యల్పంగా నమోదైంది. ఆరోగ్య సంరక్షణలో అగ్రగామిగా ఉంది.

ఆయుర్దాయం 75 సంవత్సరాలుగా ఉంది. విద్య, ప్రభుత్వ రంగ ఉద్యోగాలలో గణనీయమైన పురోగతి సాధించబడింది. కార్మికుల కనీస వేతనాలను కూడా ప్రభుత్వం పెంచింది.

కాబట్టి ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం విఫలమైందని లేదా ఎటువంటి పురోగతి సాధించలేదని వాదించడానికి కాంగ్రెస్ కనీసం ఒక్క అంశాన్నైనా గుర్తించాలి. అలా కాకుండా కాంగ్రెస్ నిందారోపణల ప్రచారానికి పాల్పడింది. ఈ విషయాన్ని రాహుల్ గాంధీ గ్రహించాలి. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడిగా, ఆయన మరింత బాధ్యతతో మాట్లాడాలి.



## దేశానికి జాతీయ గేయాన్ని అందించిన మహాకవి

స్వాతంత్రోద్యమ కాలంలో కుల, మత,ప్రాంతాలకు అతీతంగా దేశ జనులను సమైక్యం చేసి, భారత జాతిలో ఉద్యమ స్ఫూర్తిని, దేశ భక్తిని రగిల్చింది ఈగేయం.1905లో జరిగిన బెంగాల్ విభజన సమయంలో వందేమాతర గేయం మరింత ప్రాచుర్యం పొందింది. అప్పుడే వందేమాతర ఉద్యమం కూడా మొదలైంది.

వందేమాతరం గేయాన్ని బకిం చంద్ర ఛటోపాధ్యాయ రచించిన 'ఆనంద మఠం' నవలలో రెండు పద్య కృతులను స్వాతంత్రోద్యమ కాలంలో జాతీయ గేయంగా తీసుకోవాలని ఆనాటి జాతీయ నాయకులు తీర్మానించారు .

బ్రిటీష్ వారు వందేమాతరం గేయాన్ని నిషేధించారు. ఆ కాలంలోఎవరైనా వందేమాతరం గేయాన్ని ఆలపిస్తే జైలు శిక్ష విధించేవారు. వందేమాతరం గేయాన్ని రచించిన చటర్జీ బెంగాల్ లో జూన్ 27,1838 న జన్మించారు. ఆయన దుర్గానందిని, కపాల కుండల, మృణాళిని, విషవృక్షం, చంద్రశేఖర్ రజని వంటి నవలలు రచించారు. ఆయన రచనల్లో ఆనంద మఠం సుప్రసిద్ధమైనది. వీరు బంగ్లా దర్శన్ మాస పత్రిక సంపాదకులు గా వ్యవహరించారు. ఆయన ఏప్రిల్,8,1894లో తుదిశ్వాస విడిచారు. 1950జనవరి 24న భారత ప్రభుత్వం వందేమాతరాన్ని జాతీయ గేయంగా స్వీకరించింది.

ప్రస్తుతం ఈ గేయం రాయబడి 150ఏళ్లు పూర్తి అయింది. దేశవ్యాప్తంగా దీనికి సంబంధించిన వేడుకలు జరుగుతున్నాయి. నాడు ఈ గేయం ఎందరికో స్ఫూర్తినిచ్చింది. ఈ గేయం స్ఫూర్తి తో నేటితరం పనిచేయాలి.

(ఏప్రిల్ 8 బంకించంద్ర చటర్జీ వర్ధంతి)

ఎం.రాం ప్రదీప్, 9492712836

# కమ్యూనిస్టులపై దుర్భాషలు అమిత్‌షా అజ్ఞానానికి నిదర్శనం



చాడ వెంకట్‌రెడ్డి
సిపిఐ సీనియర్ నాయకులు

నిండు పార్లమెంట్ సాక్షిగా సాక్షాత్తు హోం శాఖ మాత్యులు అమిత్ షా కమ్యూనిస్టులపై పచ్చి అబద్దాలు మాట్లాడ డం, సిపిఐ రష్యా కమ్యూనిస్టు పార్టీ శాఖ అని చెప్పడం చరిత్రను వక్రీకరించడమే. ఆయన అజ్ఞానానికి నిదర్శనం. 1925లో ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడింది. అంతకుముందే కమ్యూనిస్టులు స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీషుకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. ప్రజాసంఘాలు ఏర్పాటుచేసి, దేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక త్యాగాలు చేసిన ఘనత సిపిఐది. మీరట్, కాన్పూర్, పెషావర్ కుట్ర కేసులు ఆనాటి నాయకత్వం పై బ్రిటిష్ పాలకులు పెట్టిన విషయం రికార్డులో ఉంటుంది కదా. చూసుకోవచ్చు!

జస్టిస్ సుదర్శన్ రెడ్డి గారు సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలో ఉన్నప్పుడు సల్వా జూడుం సంస్థను చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సల్వా జుడుం' (ప్రైవేటు సైన్యం) చట్ట విరుద్ధమని తీర్పు ఇచ్చారు. అట్టి తీర్పును కూడా లోక్‌సభలో కేంద్రమంత్రి అమిత్ షా తప్పు పట్టడం అంటే న్యాయవ్యవస్థను కించ పరిచినట్టే అవుతుంది. భూస్వాముల ప్రైవేటు ఆర్మీ సల్వాల జుడుంను సమర్థించినట్లుగా అమిత్ షా వ్యాఖ్యలు ఉన్నాయి.

సల్వాజుడుం పేరుతో వారు తుపాకు లు పట్టుకొని సామాన్యులపై అరాచకం చేయలేదా? అనేక మందిని పొట్టనబెట్టుకోలేదా? రాజ్యాంగ పరిధిలో లేకుండా పోరాడుతున్న వారిపై తుపాకులు పట్టిన సల్వాజుడుంను పాలకపక్షాలు ప్రోత్సహించడం జగమెరిగిన సత్యమే. అలా తుపాకులు ధరించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడాన్నే రాజ్యాంగ విరుద్ధమని జస్టిస్ సుదర్శన్ రెడ్డి సభ్యులుగా ఉన్న సుప్రీం కోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పును ఒక్కరికే ఎలా ఆపాదిస్తారు? అది వ్యక్తి తీర్పు కాదు న్యాయవ్యవస్థ ఇచ్చిన తీర్పు. దానిని వ్యతిరేకించాలనుకుంటే అప్పీలు చేసుకొని వాదనలు వినిపించే అవకాశమూ ఉంది. కానీ, స్వయంగా కేంద్ర హోం మంత్రి ఒక న్యాయమూర్తి తీర్పుపై లోక్‌సభలో వ్యాఖ్యలు చేయడం ద్వారా న్యాయ వ్యవస్థ స్థయిర్యాన్ని దెబ్బతీయడమే అవుతుంది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ప్రతిపక్షాల కూటమి తరపున ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పోటీ చేయడమే హోం మంత్రి అక్కసుకు కారణం. దానిని ఆయన దాచుకోలేదు కూడా. గతంలో కూడా ఆయనను అర్బన్ నక్సలైట్ అన్నారు. తాము బలపరిచే అభ్యర్థిపై పోటీకి దిగితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమనే హెచ్చరికలు ఇందులో దాగి ఉన్నాయి. ప్రజాస్వామ్యంలో ఏ మాత్రం శ్రేయస్కరం కాదు.

మనిషిలోని రక్తం ఎర్రగా లేకుండా మనిషి లేడు. ఎర్రజెండా లేకుండా పోరాటం లేదు. ఆకలి కేకలు ఎక్కడ ఉంటే అక్కడ ఎర్రజెండా ఉంటుంది. దోపిడీ ఉన్న దగ్గర ఉంటుంది. కమ్యూనిస్టు సిద్ధాంతం గురించి అమిత్‌షాకు ఇంకా తెలియకపోవడమంటే ఆయన రాజకీయంగా ఎంత పరపక్వత చెందారో అర్థం అవుతుంది. కమ్యూనిస్టులను అణచివేసే ధోరణిలోనే అమిత్‌షా ఉన్నారు. అందుకు కారణం ఎన్‌డిఎ ప్రభుత్వం చేస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల విధానాలను అడుగడుగున ఎండగట్టడమే. వలసవాద అధికారాన్ని ఎదుర్కొన్నందుకు కమ్యూనిస్టులు జైలు శిక్షలు, బహిష్కరణలు, అణచివేతలను ఎదుర్కొన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యం సాధించడంలో సిపిఐ కీలక పాత్ర పోషించింది అనే విషయాన్ని మర్చిపోకూడదు.

ఆర్‌ఎస్‌ఎస్ 1925లో స్థాపించబడినప్పుడు వలస వ్యతిరేక పోరాటాలకు దూరంగా ఉండే ధోరణితో వ్యవహరించింది. స్వాతంత్ర్య పోరాటంలో కమ్యూనిస్టు పార్టీలు ప్రత్యక్షంగా పుట్టుకొచ్చాయి. ఆనాటికి బిజెపి లేదు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను పుణికిపుచ్చుకొని బిజెపి రాజకీయం చేస్తున్నది. అలాంటి బిజెపికి చెందిన అమిత్‌షాకు కమ్యూనిస్టు పార్టీల చరిత్ర, వీరోచిత పోరాటాలు, త్యాగాలు తెలియకపోవడం ఆయన అజ్ఞానాన్ని మరింత రుజువు చేస్తున్నది. వారికి మతాలు, కులాల మధ్య చిచ్చులు పెట్టి, అమెరికా సామ్రాజ్యవాదంతో చేతులు కలపడం తప్ప, ప్రజాసమస్యలు పట్టవు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబడెతున్నాడు. ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల నిర్ణయాలకు వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీలు నిరంతరం పోరాటం చేస్తున్నాయనే అక్కస్సుతోనే కమ్యూనిస్టు పార్టీల మీద అమిత్‌షా విషం చిమ్ముతున్నాడు.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మావోయిస్టులను ఏరివేయడం అంటే ప్రశ్నించే గొంతుకులను నొక్కడం. ఈ పని రాజ్యాంగంలో ఎక్కడ రాసివుంది. 2026 మార్చి 31 అనే డెడ్‌లైన్ పెట్టి మావోయిస్టులను ఏరి వేసాము అనుకోవడం అమిత్ షాకు భ్రమ గానే మిగులుతుంది. మృత దేహాలను కూడా అప్పజెప్పకుండా సామూహిక దహన సంస్కారాలు చేసిన విధానాన్ని సభ్య సమాజం నివ్వెరపోయింది.

బ్యాలెట్ ద్వారా ప్రజల సమస్యలకు పరిష్కారం లభించదని మావోయిస్టులు అజ్ఞాతంలో వుండి తుపాకి గొట్టం ద్వారా ఉద్యమాలు చేస్తూ వచ్చారు. సిపిఐ, సిపిఐ(ఎం) మరియు కొన్ని వామపక్ష పార్టీలు రాజ్యాంగం మీద నమ్మకంతో ప్రజల మధ్య ఉండి ప్రత్యక్షంగా ప్రజా పోరాటాలు చట్టబద్ధం గా ఉద్యమాలు చేస్తున్నాయి. అయితే పంథాలు వేరైనా, ఎవరూ ఏ పోరాటం చేసి నా ప్రజలకు న్యాయం చేయాలని, వారి సమస్యలు పరిష్కరించాలనేదే కమ్యూనిస్టుల ఉద్దేశం. మావోయిస్టు పార్టీలు కూడా తమ పంథా మార్చుకొని ప్రజల మధ్యకు రావాలని సిపిఐ పలు సందర్భంగాలో విజ్ఞప్తులు చేయడం జరిగింది.

తుపాకి గొట్టం ద్వారా ప్రజాసమస్యలు పరిష్కరించబడవని తెలియజేయడం జరిగింది. ఇటీవల మావోయిస్టులను ఏరివేసే క్రమంలో కేంద్ర ప్రభుత్వం, హోంశాఖ మంత్రి తప్పుడు పద్ధతులలో రాజ్యాంగవ్యతిరేక చర్యలకు పాల్పడ్డారు. మావోయిస్టులనే కాదు. ప్రజాస్వామిక గొంతులను నొక్కి పట్టారు. వరవరరావు, సాయిబాబా లాంటి వారిని జైల్లో నిర్బంధించి అనేక ఇబ్బందులకు గురి చేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. మావోయిస్టుల అంత్యక్రియలకు వెళ్ళిన ప్రగతిశీల శక్తులపై ఎన్‌ఐఎ కేసులు పెట్టి వేధింపులకు గురిచేస్తున్నారు.

రాజ్యాంగ ప్రవేశ పీఠికలో పౌరులకు ఎలాంటి హక్కులు కల్పించబడ్డాయో అమిత్ షా నిశితంగా పరిశీలిస్తే మంచిది. పౌరులు తమకు నష్టం జరిగినప్పుడు, హక్కులు హరించబడినప్పుడు ప్రశ్నించకపోతే ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? ఇదేమీ రాచరిక వ్యవస్థ కాదు. దాని స్థానంలో ప్రజలు పోరాటం ద్వారా స్వాతంత్ర్యం సాధించుకుని ప్రజాస్వామ్యబద్ధంగా పరిపాలన సాగాలని కోరుకోవడం, దానికి అనుగుణంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరచడాన్ని గమనంలో ఉంచుకోవాలి. సంపద అందరిదీ, అందరికీ చెందాలి అనే ప్రాథమిక రాజ్యాంగ సూత్రాన్ని బిజెపి (ఎన్డీఏ) పాలకులు గుర్తించాలి. ప్రగతిశీల, ప్రజాస్వామ్య విధానాలు పౌర హక్కులకై ప్రజలు నడుము బిగించాలి.

# అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

## ఎంఎంసి కమిషనర్ వినయ్‌కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి పట్టణ ప్రణాళిక విభాగం(టౌన్‌ప్లానింగ్) అధికారులను ఆదేశించారు. నగరంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఆయన తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సకాలంలో నిర్మాణ అనుమతులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మల్కాజిగిరి నగరపాలక సంస్థ పరిధిలో పట్టణ ప్రణాళిక, అమలు వ్యవహారాలపై కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి మంగళవారం ప్రధాన కార్యాలయం నుండి చీఫ్ సిటీ ప్లానర్ బి.ప్రదీప్ కుమార్, టౌన్ ప్లానింగ్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నగర అభివృద్ధి, పౌర సేవల్లో జాప్యంపై ఆయన అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ప్రధానంగా లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్), భవన నిర్మాణ అనుమతులు, ట్రాన్సరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టిడిఆర్) దరఖాస్తుల స్థితిగతులపై సర్కిల్ వారీగా సమీక్ష జరిపారు. దరఖాస్తుల పరిష్కారంలో ఎటువంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. సర్వీస్ లెవల్ అగ్రిమెంట్స్(ఎస్ఎల్ఎ) నిబంధనల ప్రకారం నిర్ణీత కాలపరిమితిలోగా అనుమతులు మంజూరు చేయాలని ఆదేశించారు.

### ఆక్రమణల తొలగింపునకు ఆదేశం

నగరంలో పెరుగుతున్న అనధికార కార్యకలాపాలపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజా సౌకర్యాలకు విఘాతం కలిగిస్తున్న అంశాలపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫుట్‌పాత్‌లు, నాలాల ఆక్రమణలు, డ్రైనేజి వ్యవస్థకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. రోడ్లను ఆక్రమిస్తూ నిర్మించిన ర్యాంపులు, మొక్కలు లేని ప్లాంటర్ బాక్సులను తొలగించి బాటసారులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అనుమతి లేకుండా తవ్విన సెల్లార్లు, నిబంధనలకు విరుద్ధంగా కడుతున్న నిర్మాణాలపై కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. నగరంలోని ప్రజా ప్రదేశాలను పరిరక్షించడం మన బాధ్యత అని, పట్టణ ప్రణాళిక నిబంధనలను పక్కాగా అమలు చేయడం ద్వారానే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. టెలీకాన్ఫరెన్స్‌లో చీఫ్ సిటీ ప్లానర్ బి. ప్రదీప్ కుమార్, అదనపు చీఫ్ సిటీ ప్లానర్ రంజిత్ కుమార్‌తో పాటు వివిధ జోన్‌ల సిటీ ప్లానర్లు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, టౌన్ ప్లానింగ్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల కోసం పోరాడే పార్టీ సిపిఐకి చేయూత ఇవ్వండి : నరసింహ్మా



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** నిరంతరం పేద ప్రజల కోసం పోరాడే పార్టీ సిపిఐకి ప్రజలు చేయూత ఇవ్వాలని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు బాతరాజు నరసింహ కోరారు. మంగళవారం సరూర్ నగర్ మండల కేంద్ర పరిధిలోని భగత్‌సింగ్ నగర్‌లో ఇంటింటికీ సిపిఐ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాతరాజు నరసింహ మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఇంటింటికి తీరుగుతూ తెలుసుకోవడంతో పాటు ప్రజల సమస్యను గుర్తించి సంబంధిత అధికారులకు దృష్టికి తీసుకుపోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర నాయకులు మారగోని ప్రవీణ్ కుమార్ గౌడ్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి కుమార్, ఏఐటియుసి జిల్లా నాయకులు రమావత్ సక్రు నాయక్, భగత్ సింగ్ నగర్ శాఖ కార్యదర్శి ఉష, ఎన్టీఆర్ నగర్ శాఖ కార్యదర్శిండి ఇస్మాయిల్, నాయకులు వగ్రే ఇస్తారి, కరుణాచారి, ఇన్సాఫ్, జాహెద్ పాల్గొన్నారు.

## తుర్కయంజాల్ మునిసిపల్‌లో అవినీతిపై సమగ్ర విచారణ జరపాలి

### అధికారులకు సిపిఐ వినతి

**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన యంత్రాల కొనుగోలు, అక్రమ లేఅవుట్ల అనుమతులలో భారీ ఎత్తున అవినీతి చోటుచేసుకుందని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలంటు సిపిఐ ప్రతినిధి బృందం మంగళవారం ఆదిభట్ల డిప్యూటీ కమిషనర్ సత్యనారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీకి అవసరమైన వివిధ యంత్రాలు, వాహనాల కొనుగోలులో కోట్లాది రూపాయల ప్రజాధనం పక్కదారి పట్టిందని ఆరోపించారు. అక్రమ లేఅవుట్లు ప్రభుత్వ భూములు, ట్రస్ట్ భూములలో నిబంధనలకు విరుద్ధంగా వెలిసిన అక్రమ లేఅవుట్లకు మున్సిపాలిటీ అధికారులు పెద్ద ఎత్తున ముడుపులు తీసుకుని అనుమతులు మంజూరు చేశారన్నారు. తుర్కయంజల్ రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 338,212లలో వెలసిన అక్రమ లేఅవుట్లపై తక్షణమే విచారణ జరపాలని, అక్కడ ఇచ్చిన ఇంటి అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అవినీతికి సహకరించిన అధికారులను సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. బాధ్యులపై చర్యలు తీసుకునే వరకు సిపిఐ పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యులు శివకుమార్ గౌడ్, ఆదిభట్ల సర్కిల్ కార్యదర్శి కాటంరాజు గౌడ్ పాల్గొన్నారు

## గ్రామపంచాయతీల అభివృద్ధే లక్ష్యం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** గ్రామ పంచాయతీల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం అని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం షాద్‌నగర్ నియోజక వర్గ పరిధిలోని భీమారం గ్రామానికి బీటి రోడ్డు నిర్మాణం కోసం రూ. 12 కోట్లతో పనులకు సర్పంచ్ జ్యోతి శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్తూర్ మండల కేంద్రంలో మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణ ప్రాంతానికి దగ్గరలో ఉన్న ప్రతి గ్రామానికి ఎన్‌హెచ్ 44 నుండి లింకు రోడ్లు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్, వైస్ చైర్మన్ రవీందర్, మహ్మద్‌అలీఖాన్, బాబర్, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వెంకట్ రాం రెడ్డి, శివశంకర్‌గౌడ్, కొండారెడ్డి, సత్తయ్య, శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.


## ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసిన బిజెపి నాయకులు



**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని మొండిగౌరేల్లి గ్రామానికి చెందిన బిజెపి నాయకులు మంగళవారం బిజెపి ఎంపి ఈటల రాజేందర్, బిజెపి తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన చెన్న కేశవరెడ్డిని వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మేకల బాల కృష్ణారెడ్డి, నక్క శ్రీనివాస్, ఎలిమినేటి శ్రీనివాస్‌రెడ్డి,గుడాల వెంకటేశ్, మదం జంగయ్య, కుంటి మల్లేశ్,గుడాల మధు,గుడాల రాములు,మొగిలి జంగారెడ్డి, అవినాశ్,యాదయ్య,చిన్న మధు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ధ్యేయం

### పండ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి



**ప్రజాపక్షం /తుర్కయంజాల్ :** రైతుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని పండ్ల మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి అన్నారు. కోహెడ పండ్ల మార్కెట్ స్థలంపైన మాజీ మంత్రి హరీశ్‌రావు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. మంగళవారం ఆదిభట్ల సర్కిల్ తొర్రూరులో ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ పాలకవర్గం సభ్యులతో కలిసి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఇబ్రహీంపట్నం నాయకులు కోహెడ పండ్ల మార్కెట్ గురుంచి అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, నాయకులతో సమావేశం పెట్టడం కాదని, దమ్ముంటే మార్కెట్ వ్యాపారులు, రైతులతో మాట్లాడాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ బాస్కరచారి, సభ్యులు బండి మధుసూదన్ రావు, పన్యాల జైపాల్‌రెడ్డి, మేకం లక్ష్మి, గణేష్ నాయక్, మచ్చేందర్ రెడ్డి, రఘుపతిరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నవరాజ్ , వెంకటేశ్వర్లు గుప్తా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## కెబిఆర్ పార్క్ పరిసరాల్లో ..

# రోడ్ల విస్తరణకు సహకరించాలి

### జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కెబిఆర్ పార్క్ చుట్టూ ప్రతిపాదించిన రోడ్డు విస్తరణ పనుల పురోగతిపై జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ఆస్తి యజమానులతో సమావేశం నిర్వహించారు. జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్, కెబిఆర్ పార్క్ జంక్షన్, ముగ్ధ జంక్షన్‌తో పాటు ఇతర ప్యాకేజీ రోడ్ల విస్తరణపై ఈ సందర్భంగా సుదీర్ఘంగా చర్చించారు. రోడ్డు విస్తరణ వల్ల కలిగే ప్రయోజనాలను కమిషనర్ యజమానులకు వివరించారు. ముఖ్యంగా భూమిని కోల్పోయే వారు టిడిఆర్ పద్ధతిని ఎంచుకోవడం వల్ల కలిగే లాభాలను వివరించి, దానిని వినియోగించుకోవాలని కోరారు. రోడ్డు విస్తరణ పనుల వల్ల ప్రభావితమయ్యే ఆస్తి యజమానుల సందేహాలను కమిషనర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. టిడిఆర్ అప్లికేషన్ ప్రాసెస్, సర్టిఫికెట్ల జారీలో జరిగే ప్రక్రియపై వారికి స్పష్టతనిచ్చారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఈ రోడ్ల విస్తరణ అత్యంత కీలకమని, ఇందుకు ఆస్తి యజమానులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ప్రియాంక అలా, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్, ఇతర ఉన్నతాధికారులు, సంబంధిత విభాగాల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆస్తి యజమానులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ గ్యాస్ కంపెనీలు

# ఆటో ఎల్‌పిజి సరఫరా వేగవంతం చేయాలి

### సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రైవేట్ గ్యాస్ మార్కెటింగ్ కంపెనీలు ఆటో ఎల్‌పిజి సరఫరాను మరింత వేగవంతం చేయాలని సివిల్ సప్లైస్ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర ఆదేశించారు. గ్యాస్ కంపెనీలతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ గత వారం రోజుల్లో పలు గ్యాస్‌కంపెనీలు పనితీరు మెరుగుపడగా మరికొన్ని మాత్రం అదే విధానాన్ని కొనసాగిస్తున్నాయన్నారు. ఈ వారంరోజుల్లో మొత్తం 363 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పిజిని తెప్పించి సరఫరా చేశారని అదేవిధంగా మూతపడిన 17 బంకులను మళ్లీ తెరిపించి గ్యాస్ సరఫరాను పెంచిన సూపర్ గ్యాస్, గోగ్యాస్, టోటల్ ఎనర్జీస్, ప్రైమ్ ఫ్యూయల్ కంపెనీలు చేసిన కృషిని కమిషనర్ అభినందించారు. అయితే మరికొన్ని కంపెనీలు మాత్రం పెద్దగా పనితీరు చూపించకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆటో ఎల్‌పిజిని సాధ్యమైనంత మేర తెప్పించి తమ బంకులన్నింటిలో ఎక్కడా ఆగకుండా సరఫరా చేయాలని ఆ కంపెనీలను ఆదేశించారు. ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతినకుండా ఉండాలంటే ఆటో ఎల్‌పిజి సరఫరా ఆగకుండా చూడటం ముఖ్యమన్నారు. సివిల్ సప్లైస్ శాఖ ఇకపై ఈ పరిస్థితిని నిరంతరం గమనిస్తూనే ఉంటుందని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, గ్యాస్ సరఫరాను ఇదే విధంగా కొనసాగిస్తూ ఇంకా పెంచాలని కంపెనీలను కోరారు.

## డిహెచ్‌పిఎస్ పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరంగల్‌లో ఈనెల 17,18 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని డిహెచ్‌పిఎస్ రాష్ట్ర సహాయకార్యదర్శి జెర్రిపోతుల కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లోని ఎఐటియూసి రాష్ట్ర కార్యాలయంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కోశాధికారి ఆరుట్ల రాజ్‌కుమార్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బాబు, పాధ్యక్షుడు పి.ఆంజనేయులు పాల్గొన్నారు..

## అగ్నిప్రమాదాల నియంత్రణకు 99 రోజుల యాక్షన్‌ప్లాన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని అగ్నిప్రమాదాల నివారణకు తెలంగాణ అగ్నిమాపక శాఖ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. ఈ యాక్షన్ ప్లాన్ లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మాక్ డ్రిల్స్, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో అప్రమత్తత పెంచాలని అగ్నిమాపక శాఖ డైరెక్టర్ విక్రమ్ సింగ్ మాన్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా విద్యాసంస్థలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలలో మాక్ డ్రిల్స్ నిర్వహించి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు. ఈనెల 6 నుంచి ఏప్రిల్ 6 వరకు రెండు దశల్లో నిర్వహించిన ఈకార్యక్రమాల్లో వేల సంఖ్య లో ప్రజలు పాల్గొనగా, అగ్ని ప్రమాదాల సమయంలో ఎలా స్పందించాలో శిక్షణ ఇచ్చారు. అలాగే ఫైర్ సేఫ్టీ నిబంధనలను కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు. వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరిగే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అగ్ని ప్రమాదాలు సంభవించిన వెంటనే ఫైర్ సర్వీసులకు సమాచారం అందించాలని అధికారులు కోరారు.

# ఐపిఎల్ బెట్టింగ్‌లపై అసత్య ప్రచారాలు

### హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక



**ప్రజాపక్షం /హైదరాబాద్:** ఐపిఎల్ క్రికెట్ సీరిస్‌ను ఆసరాగా చేసుకుని ఆన్‌లైన్ బెట్టింగ్, అసత్య ప్రచారాలు, అంచనాల పేరుతో మోసాలకు పాల్పడుతున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఓ వీడియోను పంచుకుంటూ సైబర్ నేరగాళ్లు, ఇన్‌ఫ్లుయెన్సర్ల తీరును వివరించారు. డబ్బు కోసం కొందరు ఇన్ఫ్లూయెన్సర్లు అసత్య ప్రచారాలు చేస్తూ సామాన్యులను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'టాస్ ఎవరిది? మ్యాచ్ ఏ టీమ్ గెలుస్తుంది?' అని ముందే చెబుతామంటూ తమ ఛానెల్స్‌ను సబ్‌స్క్రైబ్ చేయించుకుని అమాయకులను బెట్టింగ్ ఊబిలోకి దించుతున్నారన్నారు. ఇలాంటి ఫేక్ ఛానెళ్ల మాటలు నమ్మి కష్టార్జితాన్ని పోగొట్టుకోవద్దని సూచించారు.

### సైబర్ క్రైం పోలీసుల కొరడా.. ఫిర్యాదు చేయండిలా

బెట్టింగ్ ప్రమోషన్ల విషయంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. ఇందులో భాగంగానే గత నెల రోజుల్లో 494 పెయిడ్ ప్రకటనలను, వాటిని ప్రచారం చేస్తున్న 129 సోషల్ మీడియా ఖాతాలను బ్లాక్ చేయించినట్లు వెల్లడించారు. ఈ నిఘా నిరంతరం కొనసాగుతుందని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలాంటి మోసపూరిత ప్రకటనలు దృష్టికి వచ్చినా, మోసపోయినా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా 33వ రోజున నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను నిర్వహించారు. 18 కేంద్రాలలో శిబిరాలు నిర్వహించారు. 2,116 మంది పారిశుద్ధ్య, వెటర్నరీ కార్మికులకు పరీక్షలు నిర్వహించారు. ఉచిత మందుల పంపిణి, వైద్య సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నగర పాలక సంస్థ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ప్రతి కార్మికుడి ఆరోగ్యం తమకు అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశామన్నారు. పారిశుద్ధ్య అదనపు కమిషనర్ రఘు ప్రసాద్ ఈ కార్యక్రమ వివరాలను వెల్లడించారు. నగరాన్ని శుభ్రంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం తమ బాధ్యతని అన్నారు. కాప్రాలో జరిగిన హెల్త్ క్యాంప్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పద్మజ పాల్గొని, కార్మికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.



## రైల్వే పెండింగ్ ప్రాజెక్టు పనులు

# త్వరితగతిన పూర్తిచేయాలి




### సిఎస్ కె.రామకృష్ణా రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పురోగతిలో ఉన్న రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ అంశాలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు అన్నారు. రాష్ట్రంలో పలు రైల్వే ప్రాజెక్టులకు సంబందించిన అపరిష్కృత అంశాలపై సిఎస్ మంగళవారం సచివాలయంలో సంబంధిత ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, జయేష్ రంజన్, నవీన్ మిట్టల్, టిజిఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి, సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ సృజన, టిజి ఎస్‌పిడిసిఎల్ ఎండి జితేష్ పాటిల్, మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టర్ మను చౌదరి తదితర అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులకు సంబంధించి రైల్వే అండర్ బ్రిడ్జిలు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం, రోడ్ల విస్తరణ, చర్లపల్లి రైల్వే స్టేషన్ నుండి ప్రజా రవాణా మరింత మెరుగు పరచడం తదితర దాదాపు 21 అంశాలపై సమీక్షించారు. ఈ పెండింగ్ అంశాలకు సంబంధించి సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, ప్రధానంగా మున్సిపల్, జలమండలి, రెవెన్యూ, విద్యుత్, రోడ్లు భవనాల శాఖల అధికారులు సంయుక్త తనిఖీలను నిర్వహించి తగిన పరిష్కార మార్గాలను చేపట్టాలని సిఎస్ ఆదేశించారు. ఈ రైల్వే ప్రాజెక్టుల పెండింగ్ అంశాలపై త్వరలోనే రైల్వే ఉన్నతాధికారులతో సమావేశముందని, ఈ లోపు ప్రతీ పెండింగ్ అంశానికి తగిన నివేదికను సమర్పించాలని సిఎం సూచించారు.

## సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడొద్దు



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సైబర్ నేరగాళ్ళ ఉచ్చులో పడకుండా వృద్దులు, మహిళలు, యువత అప్రమత్తంగా ఉండాలని ఐటీ నిపుణులు సూచించారు. కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వర్ రావు ఫౌండేషన్ (సిఆర్ ఫౌండేషన్) వేదికగా మంగళవారం సైబర్ భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నగరంలోని ప్రముఖ ఐటీ కంపేనీలలో సాఫ్ట్‌వేర్ ఇంజనేర్లుగా పనిచేస్తున్న రితికా వేద, రిషిత ఏనుగుల, స్నేహ, భాగ్యశ్రీలు విచ్చేసి అవగాహన సదస్సులో పాల్గొని పలు సూచనలు సలహాలు అందజేశారు. సైబర్ నేరగాళ్ళు వృద్దులను, మహిళలను లక్ష్యంగా చేసుకొని చేసే మోసాలలో ఫిషింగ్, ఓటిపి ఫ్రాడ్స్, ఫేక్ కాల్స్‌లపై వివరించి అందులో మొదటగా గుర్తుతెలియని లింకులను క్లిక్ చేయకుడదని, వ్యక్తిగత సమాచారాన్ని ఎవ్వరికి పడితే వారికి తెలపకుండ ఉండడం వంటి జాగ్రత్తలు పటించాలని తెలిపారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే తీసుకోవలసిన చర్యలు, ఫిర్యాదులు చేసే దానిపై అవగాహన అందరికి అర్థం అయ్యేలా వివరించామని తెలిపారు. వక్తలు మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వృద్దులకు ఆశ్రయం అందించడమే కాకుండా పేద మహిళలకు నైపుణ్యాభివృద్ధి కోర్సులను అందిస్తున్నారని కొనియాడారు. తమ బిజి షెడ్యూల్ లో కూడ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు సామాజిక బాధ్యతతో ఈ అవగాహన సదస్సును నిర్వహించడానికి వచ్చిన వారికి వృద్ధులు ఆశ్రమవాసులు అభినందించారు. కార్యక్రమంలో సిఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ , కోశాధికారి వి.చెన్నకేశవరావు, ఉపాధ్యక్షుడు కంభంపాటి అజయ్‌కుమార్, సిఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజనీ, మహిళా సంక్షేమ కేంద్ర డైరెక్టర్ జ్యోస్యభట్ల కల్పన, సభ్యురాలు వయ్యకంటి లలిత, కమిటీ సభ్యులు వెంకటేశ్వరరావు, రాజేందర్‌రావు, హోంమేనేజర్ శ్రీనివాస్, ఆశ్రవాసులు, మహిళా సంక్షేమ కేంద్రం విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.




## శాంతి భద్రతలను కాపాడాలి

### ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌కు హైమారెడ్డి వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రజలకు శాంతి భద్రతలను కాపాడాలని, ఆన్ లైన్ బెట్టింగ్, డిజిటల్ మోసాలు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాలు లాంటి విషయాలకు సంబంధించి తగు చర్యలు తీసుకోవాలని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్‌కు మహిళా శక్తి మై వాయిస్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎన్. హైమారెడ్డి మంగళవారం వినతి పత్రం సమర్పించారు. మహిళా శక్తి మై వాయిస్ ఆధ్వర్యంలో మీ సమస్య మా పరిష్కారంలో భాగంగా ప్రజా ప్రయోజనాల కోసం మేడ్చల్ నియోజకవర్గంలోని శామీర్ పేట డివిజన్ పరిధిలోని పోలీసు శాఖ వారికి కలిశామని హైమారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ రమేష్, మత్స్య కారుల సంఘం డైరక్టర్ రాము, ఆంజనేయులు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

## కుమ్మరి కుంటపై చర్యలేవి..?

### ఎంసిపల్లి తహశీల్దార్‌కు కౌన్సిలర్ దోసకాయల లత వినతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఉద్దెమర్రి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 252లో కుమ్మరి కుంట ప్రభుత్వ స్థలం కబ్జాకు గురవుతున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఉద్దెమర్రి వార్డు కార్యాలయం కౌన్సిలర్ దోసకాయల లత ఆరోపించారు. మూడుచింతలపల్లి మున్సిపల్ ఉద్దెమర్రిలోని కుమ్మరి కుంట ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని తహాశీల్దార్ కు మంగళవారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం కౌన్సిలర్ లత మాట్లాడుతూ ప్రభుత్వానికి చెందిన స్థలంలో నగరం నుంచి వచ్చిన వారు భూమిని కబ్జా చేసి గెస్‌హౌస్ నిర్మించుకున్నారని కుమ్మరి కుంటకు చెందిన స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. కుమ్మరి కుంటలో సుమారు 6 ఎకరాల 21 గుంటల ప్రభుత్వ స్థలం ఉందని ఈ భూమి విలువ రూ. 10 కోట్ల వరకు ఉంటుందని చెప్పారు. కీసరకు వెళ్లే ప్రధాన రోడ్డులో ఈ భూమి ఉండటం వలన కబ్జాదారుల కన్ను ఈ భూమిపై పడిందన్నారు. గతంలో కూడ రెవెన్యూ అధికారులకు పిర్యాదు చేసినప్పటికి ప్రభుత్వ భూమిని కాపాడుట లేదని అన్నారు. కుమ్మరి కుంటలోని భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేసి ఇళ్లులేని నిరుపేదలు ఎస్‌సి, ఎస్టి, బిసిలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇట్టి ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. జిల్లా కలెక్టర్ ఇట్టి విషయంపై దృష్టి సారించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.




## దుండిగల్ లో 'ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక'

**ప్రజాపక్షం/దుండిగల్ :**దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్ నాయక్ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దుండిగల్ సర్కిల్ లో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది, ఇతర సిబ్బంది అందరికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దుండిగల్ వద్ద హెల్త్ క్యాంపులు నిర్వహించారు. ఈ హెల్త్ క్యాంప్‌లో సిబ్బంది అందరికీ టెస్టులు చేసి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ స్వర్ణలత దుండిగల్ సర్కిల్ ఎఎంఒహెచ్ డాక్టర్ విజయ మోహన్ రావు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ డిప్యూటి ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ అశోక్, హాస్పిటల్ ఇన్చార్జ్ సిరాజ్, సర్కిల్ పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.




## ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేటలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుళ కళాశాలలో మంగళవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. అ సందర్భంగా డాక్టర్ బాగ్యలక్ష్మి మాట్లాడుతూ 2026 ప్రపంచ ఆరోగ్య దినోత్సవ థీమ్ టూగెదర్ ఫర్ హెల్త్ స్టాండ్ విత్ సైన్స్ అని తెలిపారు. శాస్త్రీయ నిరూపణలతో కూడిన ఆరోగ్య సూచనలను పాటించాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ మాట్లడుతూ చదువు కన్న ఆరోగ్యం చాల ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఆరోగ్యం సరిగా లేకపోతే చదువుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్య అసమానతలను తొలగించడం, శాస్త్రీయ విజ్ఞానాన్ని ఉపయోగించి అంటువ్యాదులు, దీర్ఘ కాలిక వ్యాదులు నివారించడం, మంచి ఆరోగ్య సేవలను అందించడం, మహిళల దీర్ఘకాలిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వడం, కల్తీలేని ఆహారంపై అవగాహన, మంచి పోషకా లు కల్గిన ఆహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు డాక్టర్ భాగ్యలక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ స్రవంతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ కె.అనిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అనురాగ్ యూనివర్సిటీ యువకుడికి ల్యాప్‌టాప్ అందజేత



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** సామాజిక బాధ్యతలో భాగం గా అనురాగ్ యూనివర్సిటీ ముందుకు సాగుతూ తన సహాయ కమ్యూటీ సపోర్ట్ ఇనిషియేటివ్ ద్వారా మరోసారి సేవా భావాన్ని చాటుకుంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్థికంగా బలహీన పరిస్థితుల్లో ఉన్న శీలా కొమరుమల్లుకు ల్యాప్టాప్‌ను అందజేశారు. శీలా కొమరుమల్లు వృద్ధ తల్లిదండ్రులతో కలిసి జీవిస్తూ కుటుంబాన్ని పోషించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శారీరక వైకల్యం కారణంగా సాధరణ ఉపాధి అవకాశాలు పొందడంలో అవరోధాలు ఎదుర్కొంటున్నప్పటికీ స్వయం ఉపాధి సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. పరిస్థితిని గుర్తించిన అనురాగ్ యూనివర్సిటీ సహాయ బృందం స్వతంత్రంగా ఉపాధి ప్రారంభించేందుకు తోడ్పాటుగా ల్యాప్టాప్‌ను అందిస్తున్నామని అన్నారు. డాక్టర్ విష్ణుమూర్తి మాట్లాడుతూ సమాజంలో అవసరంలో ఉన్నవారికి చేయూత అందించడం ద్వారా సానుకూల మార్పు తీసుకురావడమే విశ్వవిద్యాలయం లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ సమన్వయకర్తలు డాక్టర్ నాగరాజు,అమితా మిశ్రా పాల్గొన్నారు.

# రాబోయే 60 రోజులు కీలకం

### జలమండలి ఎండి అశోక్‌రెడ్డి




**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** రాబోయే 60 రోజులు అత్యంత కీలకమని.. తాగునీరు సరఫరా చేసేందుకు క్షేత్ర స్థాయిలో అవసరమైన ప్రణాళికలు రూపొందించుకోవాలని జలమండలి ఎండి అశోక్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాలకు కేటాయించే నీటి సరఫరాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని.. ఏ ప్రాంతంలోనైనా సరఫరాలో తక్కువ నీరుంటే.. సర్దుబాటు చేసే లాగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నీటి సరఫరా చేసేటప్పుడు సమయ పాలన పాటించాలని.. ఒకవేళ అందులో ఏవైనా ఇబ్బందులు ఉంటే ముందుగా ప్రజలకు సమాచారమివ్వాలన్నారు.

ఈ మేరకు వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో నగరంలో తాగునీటి సరఫరా పరిస్థితులపై జలమండలి ఎండి అశోక్‌రెడ్డి సమగ్ర సమీక్ష నిర్వహించారు. సమీక్షలో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా విధానాన్ని, ప్రస్తుత డిమాండ్‌సప్లయ్ పరిస్థితులను, వివిధ జలాశయాలలో ఉన్న నీటి నిల్వలు, పంపింగ్ సామర్థ్యం, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై ట్రాన్స్మిషన్, ఒఅండ్‌ఎమ్ విభాగాల ఉన్నతాధికారులతో ఎండి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిర్ధారించిన నీటిని సరఫరా కంటే అందనగా సరఫరా అవుతున్న నీటిని తగ్గించి తక్కువగా అందుతున్న ప్రాంతాలను గుర్తించి, సమతుల్య పంపిణీకి తక్షణ చర్యలు చేపట్టాలని ట్రాన్స్ మిషన్ అధికారులను ఆదేశించారు. అధికంగా నీరు అందుతున్న ప్రాంతాల్లో సరఫరాను సర్దుబాటు చేసి, తక్కువగా అందుతున్న ప్రాంతాలకు మళ్లించడం ద్వారా ప్రతి ప్రాంతానికి సమానంగా నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైన చోట్ల వాల్వ్ ఆపరేషన్లు పునఃసమీక్షించి, సరఫరా సమయాలను పునర్వ్యవస్థీకరించాలని పేర్కొన్నారు. లీకేజీలు, అనధికార కనెక్షన్లు, నీటి వృధాను నియంత్రించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, క్షేత్ర స్థాయిలో కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. పంపింగ్ స్టేషన్లు, రిజర్వాయర్లు, కీలక సరఫరా లైన్లను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా కొనసాగించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని డిమాండును అంచనా వేసి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు ప్రణాళికలు వేసుకోవాలన్నారు. నగరంలో ఇప్పటికే 1,250 ట్యాంకర్లు, 90 ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లు, 145 ఫిల్లింగ్ పాయింట్స్ ఉండగా.. డిమాండ్‌ని బట్టి అదనపు ఫిల్లింగ్ స్టేషన్ కోసం ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. ప్రతి జిఎం.. సక్రమ నీటి సరఫరాకు ట్రాన్స్ మిషన్ అధికారుల సమన్వయంతో ఇన్ ఫ్లో ను పర్య వేక్షించాలని తెలిపారు. డిమాండ్‌ను తట్టుకునేందుకు వీలుగా.. ఇక నుంచి రాత్రి సమయాల్లోనూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. పగటి వేళల్లో గృహ అవసరాలకు.. రాత్రి వేళ కమర్షియల్ అవసరాలకు ట్యాంకర్లను డెలివరీ చేయడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

ప్రజలు జలమండలి సరఫరా చేసే నీటిని త్రాగటానికి కాకుండా ప్రాంగణాలు, వాహనాలు కడగడానికి.. ఇతర అవసరాలకు నీటిని వృధాచేసే వారిపై కఠినం గా వ్యవహరించాలని.. అలాగే తాగునీటి సరఫ రా సమయాల్లో కొంతమంది మోటార్లతో నీటిని తోడుతున్న ప్రాంతాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జలమండలి ఇడి స్రామాట్ అశోక్, ఆపరేషన్ డైరెక్టర్ నారాయణ, సిజిఎంలు, రెవెన్యూ, ఐటి విభాగపు అధికారులు పాల్గొన్నారు.

## పిల్లలకు మంచి భవిష్యత్తు అందించాలి

### రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీత దయాకర్






**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** 18 ఏళ్ల పిల్లలకు మంచి భవిష్యత్తు అందించేలా సంబంధిత ప్రభుత్వ విభాగాలన్నీ సమన్వయంతో, ప్రణాళికతో బాధ్యతాయుతంగా ముందుకు వెళితేనే ఆశించిన ఫలితాలు సాధించగలుగుతామని తెలంగాణా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ సీత దయాకర్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, కమిషన్ సభ్యురాలు సరిత, చందనలతో కల్సి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేడ్చల్ జిల్లాలోని జవహర్‌నగర్‌లోని పిల్లలను కాపాడటమే కాక వారికి అవసరమైన మౌలిక సదుపాయాలైన విద్య, వైద్యం అందించాలన్నారు. పిల్లలు ఎదుర్కొనే సమస్యలన్నిటిని ఒక్కటొక్కటిగా ప్రాధాన్యతా పరంగా పరిష్కరించాలని, పిల్లలందరిని మన పిల్లలుగా భావించి వెళ్ల గలిగితేనే వారికి సరైన న్యాయం చేయగలుగుతామన్నారు.

వైద్య శిబిరాలను తరచు ఏర్పా టు చేస్తూ పిల్లలందరికి క్రమం తప్పకుండా వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరిపించి అవపసరమైన పక్షంలో సరైన వైద్యం అందించాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్ తరహాలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ బాల కార్మికులను గుర్తించి ఉన్నతాధికారుల సహకారం తీసుకొని సమస్యలు పరిష్కరించాలన్నారు. జిల్లా కలెక్టర్ మనుచౌదరి మాట్లాడుతూ ఆయా ప్రాంతాల్లోని పిల్లలందరికి అవసరమైన మౌలిక సదుపాయాలు అందించి పిల్లలను ఉన్నత స్థాయికి చేరుకొనేలా సంబంధిత ప్రభుత్వ శాఖాధికారులను బాధ్యులను చేసేందుకు ప్రణాళికాయుక్తంగా ముందుకు వెళుతామన్నారు.

ఈ నెలలో అంగన్‌వాడిల ద్వారా కుటుంబ సర్వే నిర్వహిచటం ద్వారా సేకరించే వివరాలతో పరిశీలన ఉంటుందన్నా రు.

## ఈరగళ్ల మహేందర్‌కు దళితరత్న అవార్డు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్ దేవరయాంజాల్‌కు చెందిన ఈరగళ్ల మహేందర్‌కు దళిత రత్న అవార్డు దక్కింది. మంగళవారం మాజీ దేశ ఉప ప్రధాన మంత్రి బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని రవీంద్రభారతి ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈరగళ్ల మహేందర్ దళితుల అభ్యున్నతికి, విద్య సామాజిక చైతన్యం ఇలా అనేక సేవా కార్యక్రమాల్లో విశేషంగా చేసిన కృషికి ఈ గౌరవ అవార్డును అందుకున్నారు. జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ సుదర్శన్ బాబు, జాతీయ కళా మండళి అధ్యక్షుడు ఎన్‌వై అశోక్‌ల చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు ఈరగళ్ల మహేందర్‌ను అభినందించారు.



## అభివృద్ధిని గడపగడపకూ తీసుకువెళ్లాలి

### ఎంపి ఈటల రాజేందర్



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న అభివృద్ధిని గడపగడపకూ తీసుకువెళ్లాలని మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి, కేఆర్‌సిఆర్ హరితవనం కాలనీలో మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన బిజెపి పార్టీ కార్యాలయాన్ని ఎంపి ఈటెల రాజేందర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించిన అనంతరం పలువురు యువకులు, నాయకులకు బిజెపి కండువాల ను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ సంకీర్ణ రాజకీయాలే రాజ్యమేలుతున్న ఈ రోజుల్లో ఐదేళ్లు పాలిస్తేనే చాలంటున్న తరుణంలో మూడుసార్లు నరేంద్ర మోడి ప్రధాన మంత్రి కావడం గర్వకారణమని అన్నారు. కశ్మీర్ నుండి కన్యాకుమారి, కచ్ నుండి అరుణాచల్ ప్రదేశ్ వరకు సంస్కృతి, సాంప్రదాయాలు, బాషలు వేరైనా ప్రతి బిడ్డ బారతీయున్నే అని చెప్పుకునేలా దేశాన్ని అభివృద్ధి చేసిన ఘనంత మోడీకే దక్కిందన్నారు. ఎన్ని సంవత్సరాలు రాజకీయాల్లో ఉన్నామని కాకుండా ఎంతమంది ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నామనేదే ముఖ్యమని తెలిపారు. బాచుపల్లిలో ప్రారంభించిన ఈ కార్యాల యం కేవలం నాలుగు గోడల భవనంలా కాకుండా సామాన్యుడి కష్టాలను తీర్చే వేదిక గా ఉండాలని సూచించారు.

కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అర్బన్ బిజెపి అధ్యక్ష, కార్యదర్శులు మల్లారెడ్డి, గిరివర్ధన్ రెడ్డి, రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యులు రమణా రెడ్డి, మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి, నాయకులు, కార్యకర్త లు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలి




**ప్రజాపక్షం/వికారాబాద్:**వరి ధాన్య కొనుగోలు పారదర్శకంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో యాసంగి 2025–26 ధాన్యం కొనుగోళ్లపై పౌర సరఫరా సంస్థ ఆధ్వర్యంలో సన్నాహక మరియు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వరి ధాన్యం కొనుగోలు చేపట్టాలన్నారు. ఏ గ్రేడ్ వరి ధాన్యకొనుగోలు చేపట్టాలన్నారు. ఏ గ్రేడ్ వరి ధాన్యానికి క్వింటాలు 2389 రూపాయలు, మద్దతు ధరను నిర్దేశించడం జరిగిందని అదే విధంగా సన్నవ రకం ధాన్యానికి 500రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించడాలనికలెక్టర్ తెలిపారు. వరి ధాన్యం కేంద్రాల్లో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ తెలిపారు. వేసవిని దృష్టి లో పెట్టుకొని టెంట్లు, త్రాగునీరు సమకూర్చాలని అయన తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో విద్యుత్తు సరఫరా ఉండే చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ధాన్యం 17శాతం కంటే తక్కువ తేము న్నరైతులకు టోకెన్ లు ఇచ్చిధాన్య సేకరించాలని అదేశించారు. తూకం, తేమ, తూర్పార యంత్రాలు, గోనే సంచులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వరి,డిఆర్డిఓ శ్రీనివాస్, డిఎంసిఎస్ మోహన్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా పరిషత్ భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలి :** మంగళవారం జిల్లా కలెక్టర్ జిల్లా పరిషత్ భవన నిర్మాణపనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవనం నిర్మాణం ద్వారా అన్ని విభాగాలను ఒకే చోట సమీకరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని, నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి ,పనులు నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని అవసరమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్, నీటి సరఫరా పార్కింంగ్ వసతులు కల్పించాలని అన్నారు. ఈ భవనం పూర్తయిన తరువాత ప్రజలకు పరిపాలనా సేవలు వేగవంతంగా, సులభంగా అందుతాయని అన్నారు. మొదటిఅంతస్తు పనులు పూర్తి అయిన వాటికీ పేటింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఓ సుధీర్ ఉమష్‌కామార్,డిప్యూటీ ఇఇ శ్రీనివాస్ సంబంధిత అధికారులు ఉన్నారు.

## ఫ్లెక్సీ స్టాండ్ తొలగించాలని ప్రజల విజ్ఞప్తి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:**283 డివిజన్ పరిధిలోని స్థానిక గిరినగర్ బస్తీ ప్రవేశ ద్వారం ముందు రోడ్డుకు అడ్డంగా ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీ నాయకుల ఫ్లెక్సీ స్టాండ్ స్థానికులకు ప్రమాదంగా మారింది. ఇటీవల చింతల్ సర్కిల్ అధికారులు ఫ్లెక్సీని తొలగించినప్పటికీ, ఇనుప స్టాండ్ మాత్రం అలాగే మిగిలి ఉండటంతో వాహనదారులు, బస్తీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యేకంగా రద్దీ సమయంలో ఈ ఇనుప స్టాండ్ కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గిరినగర్ బస్తీ వెల్ఫేర్ అసోసియేష్ అధ్యక్షుడు వంగాల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది లేకుండా వెంటనే సంబంధిత అధికారులు స్పందించి ఇనుప స్టాండ్‌ను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

## కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎఐవైఎఫ్ డిమాండ్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** విద్యా శాఖ నిబంధనలకు విరుద్దంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు తమ విద్యా సంస్థ పేరిట పుస్తకాలు, స్టేషనరీ ముద్రించి వేలాది రూపాయలు వసూలు చేస్తున్న సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్,ఎస్ఎఫ్ఐ సంఘాలు డిమాండ్ చేసాయి. కాప్రా మండలంలోని నారాయణ స్కూల్ యాజమాన్యం ఈసిఐఎల్‌లో పాఠశాల ఏర్పాటు చేసి భారీ ఫీజులు వసూలు చేయటంతో పాటు యూనిఫారాలు, పుస్తకాలు, స్టేషనరీ అంతా తమ వద్దే కొనుగోలు చేయాలంటూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులపై ఒత్తిడి తేవటం ద్వారా విద్యా వ్యాపారం చేస్తోందని ఏఐవైఎఫ్ ప్రతినిధులు సత్యప్రసాద్, ధర్మేంద్రలు వాపోయారు. ఈ విషయంపై జిల్లా విద్యాశాఖాధికారులు చూసీ చూడకుండా వ్యవహరించటం ఆక్షేపణీయమన్నారు. ఇప్పటికైనా డిఈఓ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.






## సిపిఐ ఆధ్వర్యంలో రైతులను పరామర్శించడానికి వెళ్తున్న తెలంగాణ రైతు సంఘం

**ప్రజాపక్షం/పరిగి :** వికారాబాద్ జిల్లాలోని పరిగి నియోజకరవర్గంలోని కళాపూర్, రాపోల్ గ్రామంలో 1200 ఎకరాల భూమిని, రైతుల నుండి ఇండస్ట్రీయల్ పార్క్ పేరుతో ప్రభుత్వం లాక్కుంటుంది. మంగళవారం ఆ ప్రాంత రైతులను తెలంగాణ రైతు సంఘం సిపిఐ ఆధ్వర్యంలో పరామర్శించడానికి వెళ్లిన వికారాబాద్ జిల్లా సహాయ కార్యదర్శి షెర్ మొహమ్మద్ తెలంగాణ రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి గంటి సురేష్ కుమార్ జిల్లా కార్యవర్గ సభ్యులు , మండల కార్యదర్శ వెంకటేష్ జిల్లా సభ్యులు, యువజన సమాఖ్య కార్యదర్శి చంద్రయ్యలను కళాపూర్ గేటు వద్ద పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.




## ధర్నాకు తరలిన విద్యుత్ కార్మికులు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** విద్యుత్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటు వరంగల్‌లో తలపెట్టిన ధర్నాకు శామీర్‌పేట నుంచి మంగళవారం పెద్ద ఎత్తున కార్మికులు తరలివెళ్లారు. శామీర్‌పేట సబ్ డివిజన్ పరిధిలోని అలియాబాద్, శామీర్‌పేట సెక్షన్‌ల పరిధిలోని విద్యుత్ కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం ఎన్పిడిఎస్‌ఎల్ వద్ద చేపట్టిన రాష్ట్రవ్యాప్త ధర్నాకు తరలివెళ్లారు. నేటి నుంచి (బుధవారం) సమస్యల పరిష్కారం కోసం జెఎసి ఇచ్చిన పిలుపు మేరకు సమ్మెలోకి వెళ్తున్నట్లు కార్మికులు తెలిపారు. సమస్యలు సాధించేవరకు పోరాటాలు ఆపేదే లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శామీర్‌పేట సబ్ డివిజన్ పరిధిలోని కార్మికులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు ప్రారంభం


**ప్రజాపక్షం/శామీర్‌పేట:** మూడుచింతలపల్లి మున్సిపల్‌లోని పొన్నాల్‌లో మున్సిపల్ చైర్మన్ జాం రవి సిసి రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించారు. పోన్నాల్‌లోని 11, 12 వార్డుల కౌన్సిలర్లు మ్యాడబోయిన మౌనిక, కొల్లాస్ రాజులతో కలిసి సుమారు రూ.19లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంబించారు. అనంతరం చైర్మన్ జాం రవి మాట్లాడుతూ దశల వారీగా ఎంసిపల్లి మున్సిపల్‌లో అభివృద్ధి పనులను చేపడుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ పవన్‌కుమార్, పంచాయతిరాజ్ ఎఇ సనా, కౌన్సిలర్ అజయ్, గ్రామస్థులు జగన్, రామలింగారెడ్డి, సతీష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** ఉప్పల్ నియోజకవర్గంలో 100 పడకల ప్రభుత్వ ఆస్పత్రి మంజూరైంది. ఆస్పత్రి నెలకొల్పేందుకు అనుకూలమైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు ఉప్పల్ తహసీల్దార్ పూల్‌సింగ్ మల్లాపూర్ డివిజన్ ప్రాంతాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను కల్సిన డివిజన్ మాజీ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి డివిజన్‌లోని ఎలిఫెంట్ సర్కిల్ వద్ద 84వ సర్వేలో ఉన్న ప్రాంతం అనుకూలంగా ఉంటుందని చెప్పటంతో తహసీల్దార్‌తో కల్సి ఆ స్థలాన్ని పరిశీలించారు. జలమండలి డిజిఎం వేణుగోపాల్, మేనేజర్ రోహిత్, రెవెన్యూ అధికారులు సర్వేలో పాల్గొన్నారు.


## కాప్రా సర్కిల్ కార్యాలయంలో వైద్య శిబిరం



**ప్రజాపక్షం/చర్లపల్లి:**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య, ఎంటమాలజీ, ట్రాన్స్‌పోర్టు కార్మికులకు కాప్రా సర్కిల్ కార్యాలయంలో ప్రసాద్ హాస్పిటల్ ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్‌ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. కార్మికులందరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మ, మెడికల్ ఆఫీసర్ మమత, రవి, రవిచంద్, సూపర్‌వైజర్ సుదర్శన్, డాక్టర్లు, పాత్రికేయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఐపిఎల్‌కు వాన గండం.

## ముంబై, రాజస్థాన్ మ్యాచ్ టాస్ ఆలస్యం!



ఐపిఎల్ పంతొమ్మిదో సీజన్‌కు వరుణుడు వరసగా పలకరిస్తున్నాడు. ఈడెన్ గార్డెన్స్‌లో పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్ సాగనీయని వర్షం.. ఈసారి గువాహటిలోనూ దాపురించింది. టాస్‌కు ముందు నుంచే చినుకులు మొదలవ్వడంతో ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ టాస్ వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం రాత్రి 7:00 గంటలకు వేయాల్సిన టాస్ వాన కారణంగా మరింత ఆలస్యం అయ్యేలా ఉంది. దాంతో, ఈ మ్యాచ్‌లో గెలిచి ముందంజ వేయాలనుకున్న ముంబై శిబిరంలో ఆందోళన కనిపిస్తోంది. ఐపిఎల్లో వరసగా రెండు విజయాలతో జోరు మీదున్న రాజస్థాన్ రాయల్స్ తమ సొంత గడ్డపై ముంబై ఇండియన్స్‌ను ఢీ కొడుతోంది. ఈ మ్యాచ్‌లోనూ విజయంతో టాపర్‌గా కొనసాగాలనుకున్న ఆ జట్టు ఆశలపై వరుణుడు నీళ్లు చల్లేలా ఉన్నాడు. అవును.. ఈ సీజన్‌లో వరసగా రెండో మ్యాచ్‌కు వర్షం ముప్పు తప్పేలా లేదు. సోమవారం ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా ఇన్నింగ్స్ 3.4 ఓవర్లోనే అందుకున్న వాన కారణంగా మ్యాచ్ రద్దయ్యింది. మంగళవారం గువాహటిలో కాసేపట్లో టాస్ అనగా వర్షం ధాటికి మైదానమంతా కవర్లతో కప్పేశారు. చినుకులు తగ్గాక అంపైర్లు టాస్ సమయాన్ని, ఓవర్ల కోత అంశాన్ని నిర్ణయించనున్నారు. ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచుల్లో విజయాలతో రాజస్థాన్ రాయల్స్ అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు తొలి మ్యాచ్‌లో గెలుపు.. ఆపై ఓటమితో నిరాశపరిచిన ముంబై గువాహటిలో గర్జించాలనే పట్టుదలతో ఉంది. ఈ మ్యాచ్‌లో అందరి కళ్లు వైభవ్ సూర్యవంశీ మీదే ఉండనున్నాయి. ఎందుకంటే విధ్వంసక ఆటతో బౌలర్లను భయపెడుతున్న ఈ బుడ్డోడు తొలిసారి జస్ప్రీత్ బుమ్రాను ఎదుర్కోబోతున్నాడు.

## కీలక టోర్నీకి సాత్విక్ జోడీ దూరం!

### లక్ష్య, సింధుపైనే ఆశలు



**నింగ్బొ (చైనా) :** ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ ఆసియా చాంపియన్‌షిప్ నుంచి భారత బ్యాడ్మింటన్ ద్వయం సాత్విక్ సాయిరాజ్‌చిరాగ్ శెట్టి తప్పుకున్నారు. కొద్దిరోజుల క్రితం స్విస్ ఓపెన్ ఆడుతూ సాత్విక్ భుజానికి గాయమవగా దాని నుంచి అతడు ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోలేదు. 'సాత్విక్ ఇంకా భుజం నొప్పి తో బాధపడుతున్నాడు. ఈ టోర్నీలో వారు ఆడటం లేదు' అని ఈ జోడీ కోచ్ కిమ్ హర్ తెలిపాడు. 2023లో డబుల్స్ టైటిల్ గెలిచిన సాత్విక్ ద్వయం టోర్నీ నుంచి దూరమవడం భారత్కు ఎదురుదెబ్బే. వీళ్లు వైదొలగడంతో మంగళవారం నుంచి మొదలుకానున్న ఈ టోర్నీలో భారత ఆశలన్నీ సింగిల్స్ ఆటగాళ్లు లక్ష్యసేన్, పీవీ సింధుపైనే ఉన్నాయి. సింగిల్స్ క్యాటగిరీలో భారత్ నుంచి ఆఖరిసారి 1965లో దినేశ్ ఖన్నా టైటిల్ నెగ్గగా ఆ తర్వాత ఒక్కరు కూడా విజేతగా నిలువలేదు. ఇటీవలే ముగిసిన ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్ రన్నరప్‌గా నిలిచిన లక్ష్య.. అదే జోరును కొనసాగించాలని భారత్ భావిస్తున్నది. లక్ష్యతో పాటు శ్రీకాంత్, హెచ్ఎస్ ప్రణయ్, ప్రియాన్షు రజావత్ కూడా బరిలో ఉన్నారు. ఇక ఆల్‌ఇంగ్లండ్ ఆడేందుకు వెళ్తూ ఇరాన్ యుద్ధం కారణంగా దుబాయ్లో చిక్కుకుని ఇంటికి చేరుకున్న సింధు.. కొద్దిరోజుల పాటు ఆటకు దూరమైన విషయం తెలిసిందే. పునరాగమనంలో ఆమె ఎలా ఆడుతుందనేది ఆసక్తికరం! మహిళల సింగిల్స్‌లో ఉన్నతి, తన్వి, మాళవిక పోటీలో ఉన్నారు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ జోడీ స్థానంలో హరిహరన్, ఎంఆర్ అర్జున్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

## ఫైనల్‌కు ప్రీతి..

### టైటిల్ పోరుకు ప్రియ, అరుంధతి

#### సెమీస్‌లో నిఖత్, లవ్లీనా ఓటమి



**ఉలన్బాతర్ (మంగోలియా) :** ఏషియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు ప్రీతి పవార్, ప్రియా, అరుంధతి ఫైనల్‌కు దూసుకెళ్లారు. సోమవారం ఇక్కడ జరిగిన సెమీస్ పోరులో ఈ ముగ్గురూ తమ ప్రత్యర్థులను చిత్తుచేసి పసిడి పతక పోరుకు అర్హత సాధించారు. మహిళల 54 కిలోల సెమీస్‌లో ప్రీతి.. 50తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత ఇమ్ ఎజి (దక్షిణ కొరియా)ను చిత్తుచేసింది. మూడు రౌండ్లలోనూ ప్రత్యర్థిని తన పంచ్ పవర్‌తో బెంబేలెత్తించిన ప్రీతి.. ఫైనల్ పోరులో మూడుసార్లు వరల్ చాంపియన్ అయిన చైనీస్ తైపీ బాక్సర్ హువాంగ్ సియావొవెన్తో తలపడనుంది. 60 కిలోల విభాగంలో ప్రియ.. 50తో నమున్ మొంకోర్ (మంగోలియా)ను ఓడించింది. 70 కేజీల సెమీస్లో అరుంధతి.. 41తో తొయిరొవ (ఉజ్బెకిస్థాన్)ను మట్టికరిపించింది. ఇదిలాఉండగా మాజీ వరల్ చాంపియన్ నిఖత్ జరీన్, టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా బొర్గొహెయిన్ పోరాటం సెమీస్లోనే ముగిసింది. నిఖత్.. 05తో పారిస్ ఒలింపిక్ విజేత వు యు (చైనా) చేతిలో ఓడగా లవ్లీనా.. 05తో అజిజ జొకిరొవ (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఖంగుతింది. పూజారాణి, అంకుషిత సైతం సెమీస్‌లో ఓటమిపాలై కాంస్యాలతో సంతృప్తి పడ్డారు.

మహిళ

## ఆత్మహత్యాయత్నం నుంచి ఐఎఎస్ వరకు..



ఒక్క క్షణం.. ఒకటే క్షణం.. ఆలస్యమై ఉంటే, ఈ రోజు ఆమె కథ ఉండేది కాదు. ఒక చీర, ఒక ఫ్యాన్, ఒక విరిగిపోయిన మనసు.. అంతే. కానీ అదే క్షణంలో ఆమె జీవితానికి కొత్త అర్థం దొరికింది. చావు అంచున నిలబడి, జీవితం వైపు తిరిగిన ఓ సాధారణ మహిళ కథ ఇది. ఈ రోజు ఆమెను దేశం ఒక ఐఎఎస్ అధికారిణిగా గుర్తిస్తోంది. కానీ ఆ గుర్తింపుకి వెనుక దాగి ఉన్నది.. ఆకలి, అవమానం, హింస, అణచివేత, మరియు వాటన్నిటిని చీల్చుకుంటూ వచ్చిన అసాధారణ ధైర్యం. మధ్యప్రదేశ్‌లోని చిన్న మండీ గ్రామం. అడవుల మధ్య, ఆదివాసీ కాలనీలో, ఏడు మంది పిల్లల కుటుంబం. ఆమె మూడో సంతానం. పేరు సవితా ప్రధాన్. తల్లిదండ్రులు బీడీ ఆకులు ఏరుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ఆమె పాఠశాల మెట్లెక్కింది. కారణం చదువు మీద ప్రేమ కాదు, ప్రభుత్వం ఇచ్చే రూ.75 స్కాలర్‌షిప్. ఆ డబ్బుతో ఒక పూట జావ, ఒక జత యూనిఫాం వచ్చాయి. కష్టపడి పదో తరగతి పూర్తిచేసింది. ఆ ఊళ్లో పదో తరగతిపాసైన తొలి అమ్మాయిగా నిలిచింది. ఆ చిన్న విజయం ఆమె మనసులో పెద్ద కలలకు విత్తనం వేసింది. కానీ చదువు చాలు అంటూ పెళ్లి నిర్ణయించారు. తనకన్నా పదకొండేళ్లు పెద్దవాడు. 'ఈ పెళ్లి నాకు వద్దు' అని బతిమిలాడింది. పెద్దింటి సంబంధం అంటూ నోరు నొక్కేశారు. ఆ రోజు ఆమె ఓటమి పాలైంది. కానీ అసలు పోరాటం అప్పుడే మొదలైంది. అత్తింట్లో అడుగుపెట్టిన రోజు నుంచే ఆమెకు తన విలువ అర్థమైంది. కోడలు కాదు, పనమ్మాయి. అందరూ తిన్నాకే తినాలి. మిగలకపోతే ఆకలితోనే పడుకోవాలి. నవ్వకూడదు. నలుగురిలోకి రాకూడదు. టీవీ చూడకూడదు. తలమీద చెంగు తీస్తే పాపం. ఎదురు తిరిగితే రక్తం కారేలా కొట్టేవాడు భర్త. నవ్వడం అంటే ఏమిటో మరిచిపోయింది. రోజూ అనుభవిస్తున్న నరకం నుంచి బయటపడాలంటే ఆత్మహత్యే పరిష్కారం అనిపించింది. కానీ, తాను గర్భవతినని ఆమెకు అప్పుడే తెలిసింది. ఆ కడుపులోని ప్రాణం కోసమైనా బతకాలనుకుంది. కానీ గర్భిణిగా ఉన్నా సరైన ఆహారం లేదు. ఆకలికి తట్టుకోలేక నాలుగు రొట్టెలు దొంగిలించి, బాత్ రూమ్‌లో గుట్టుగా తినాల్సి వచ్చింది. ఈ బాధలన్నీ తల్లికి చెబితే, బిడ్డ పుడితే అన్నీ సర్దుకుంటాయి అని సర్ది చెప్పింది. కాలం గడుస్తున్నది. సవిత ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది. వేధింపులు మరింత పెరిగాయి. ఇక భరించడం తన వల్లకాదన్న నిర్ధారణకు వచ్చింది. ఉరేసుకోవాలని నిర్ణయించింది. చీరను ఫ్యాన్‌కు బిగించింది. మెడకు చుట్టుకునే క్షణంలో...కిటికీ వైపు చూసింది. అక్కడ ఆమె అత్తగారు. అన్నీ చూస్తోంది. ఆపడం లేదు. ఆ క్షణంలో ఒక ప్రశ్న ఆమె గుండెల్లో మెరిసింది. ఇలాంటి వాళ్ల కోసం నేనెందుకు చావాలి? నేను పోయాక నా పిల్లల పరిస్థితి ఏంటి? చీరను వదిలేసింది. కన్నీళ్ల మధ్యే ఒక నిర్ణయం తీసుకుంది. పిల్లల కోసం బతకాలి. ఇంటి గడప దాటింది. చిన్న పిల్లలతో ఒంటరిగా జీవితం మొదలైంది. ఓ బ్యూటీ పార్లర్‌లో సహాయకురాలిగా చేరింది. పిల్లలకు ట్యూషన్లు చెప్పింది. ఇళ్లలో వంటపనులు చేసింది. కానీ చదువు వదల్లేదు. బిఎ పూర్తి చేసింది. ఎంఎ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో యూనివర్సిటీ ఫస్ట్ వచ్చింది. ఒకరోజు దినపత్రికల్లో ఉద్యోగ ప్రకటనలు చూస్తుండగా యుపిఎస్‌సి నోటిఫికేషన్ కనిపించింది. మొదట ఆమె కళ్లలో పడింది మాత్రం జీతమే. రేయింబవళ్లు చదువుకుంది. ఫలితం అద్భుతం. మొదటి ప్రయత్నంలోనే విజయం. 24 ఏళ్లకే చీఫ్ మున్సిపల్ ఆఫీసర్ అయ్యింది. ఈ రోజు గ్వాలియర్, చంబల్ ప్రాంతాలకు అర్బన్ అడ్మినిస్ట్రేషన్ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తోంది. విజయం వచ్చినా, భర్త వేధింపులు ఆగలేదు. చివరకు విడాకులు తీసుకుంది. ఆ తర్వాత తనకు అర్థమయ్యే మనసున్న హర్షను రెండో వివాహం చేసుకుంది. ఈ రోజు సవితా ప్రధాన్ కేవలం ఐఎఎస్ అధికారిణి మాత్రమే కాదు.... ఒక ఉద్యమం. 'హిమ్మత్‌వాలీ లడ్కియా' పేరుతో యూట్యూబ్ ఛానల్ ప్రారంభించి, తన జీవితాన్నే పాఠంగా మార్చింది. మౌనంగా బాధలు భరిస్తున్న వేలాది అమ్మాయిలకు ఆమె ఒక స్వరం. నువ్వు బలహీనురాలు కాదు. పరిస్థితులు నిన్ను అలా అనిపిస్తున్నాయి అని ధైర్యం నూరిపోస్తోంది. ఈ కథ ఒక మహిళ కథ మాత్రమే కాదు. ఇది ప్రతి ఆడపిల్లలో దాగి ఉన్న శక్తి కథ. ధైర్యం ఉంటే, జీవితం దిశ మారుతుందని చెప్పే సాక్ష్యం.

## ధైర్యానికి ప్రతిరూపం 'నోరా'



అరిజోనా టెరిటరీ, 1879, అప్పటికి ఆమె వయసు కేవలం పదిహేడు సంవత్సరాలు. కానీ ఆ వేసవిలో చెలరేగిన అగ్ని ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ప్రజలు ఆమెను 'నోరా వాలంటైన్' అని పిలిచేవారు. రాంచ్ యజమాని కుమార్తె, అదుపులో ఉండని స్వభావం గల అమ్మాయి. పగ్గాలు లేకుండానే గుర్రాన్ని అదుపులో పెట్టగలదని, వంద గజాల దూరంలో దూకుతున్న జాక్‌రాబిట్‌ని ఒక్క గుండుతో పడగొట్టగలదని ఆమె గురించి చెప్పుకునేవారు. కొండల నుంచి దొంగలు దిగివచ్చిన ఆరాత్రి, ఆకాశం మంటలతో ఎర్రబడింది. వాళ్లు ఆమె అన్నను చంపారు. కుటుంబ పశువులను అగ్ని, పొగ మధ్యకి తోసేశారు. ఆ దృశ్యం చూసి పట్టణం మొత్తం నోరా ధైర్యం పతనమవుతుందని అనుకున్నారు. కానీ ఆమె కళ్ల నుంచి ఒక్క చుక్క కన్నీరు కూడా రాలేదు. ఆమె తండ్రి వించెస్టర్ తుపాకి ని నిశ్శబ్దంగా శుభ్రం చేసింది. తెల్లవారకముందే గుర్రానికి కట్టేసి, ఎవరికీ వీడ్కోలు చెప్పకుండా ఎర్రటి ఎడారిలోకి దూసుకెళ్లింది. ప్రతీకారాగ్ని మాత్రమే ఆమెకు తోడుగా ఉంది. మూడు రోజులపాటు ఆమె వారిని వెంబడించింది. నాలుగో రోజు వాళ్లను చూసింది.. దొంగిలించిన విస్కీతో మత్తులో, నవ్వుకుంటూ, నిర్లక్ష్యంగా కూర్చుని ఉన్నారు. మొదటి కాల్పుతో నాయకుడు లేచేలోపే నేలకొరిగించింది. రెండో గుండు అతని పక్కవాడి నవ్వును శాశ్వతంగా ఆపేసింది. మూడో తూటా ఆమె కళ్లను మూసుకున్నట్టే దూసుకెళ్లిందని తరువాత వాళ్లు చెప్పుకున్నారు. ఆమె తిరిగి ఇంటికి వచ్చేసరికి, చొక్కాపై రక్తం, కళ్లలో నిశ్శబ్దం. తుపాకిని తండ్రి చేతిలో పెట్టి, ఒక్క మాట కూడా చెప్పకుండా ఉదయపు వెలుగులోకి నడిచిపోయింది. ఏళ్ల తరువాత, 'కొచీస్ కౌంటీ' మీదు గా ప్రయాణించినవాళ్లు ఆమెను ఇంకా అక్కడే చూశారు. కంచెలు సరిచేస్తూ, కొత్త గుర్రాలను శాంతింపజేస్తూ, సూర్యుణ్ని అడ్డుకునేందుకు టోపీ నీడలో ముఖాన్ని దాచుకుంటూ. కాలం ఆమె ముఖంపై గీతలు గీసింది. కానీ ఆమె సంకల్పాన్ని మాత్రం తాకలేకపోయింది. నోరా వాలంటైన్ అడవిలో పుట్టింది, అగ్నిలా వెలిగింది.... ఆమె వెళ్లిన దారిలో, నరకం కూడా వెంబడించడానికి ధైర్యం చేయలేదు... ఇవీ ప్రజల దృష్టిలో ఆమె గురించిన అభిప్రాయాలు.

# యుద్ధానికి వ్యతిరేకంగా శాంతి ర్యాలీలు




**ప్రజాపక్షం/నల్లగొండ :** ప్రపంచ దేశాలపై ఆధిపత్యమే లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ పై తలపెట్టిన యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం (ఎఐపిఎస్‌ఒ) నాయకులు డిమాండ్ చేశారు. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాల దాడులను ఖండిస్తూ ఎఐపిఎస్‌ఒ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో మంగళవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతి సంఘం జిల్లా అధ్యక్షులు కట్ట వెంకట్ రెడ్డి, అనంతుల శంకరయ్య, జిల్లా సమన్వయ ప్రధానకార్యదర్శి జిల్లా యాదయ్య, గుర్రం వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ యుద్ధాల ప్రభావంతో పెట్రోల్, గ్యాస్‌తో పాటు అన్ని నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి సాధారణ ప్రజల జీవితం దుర్భరంగా మారుతోందన్నారు. ప్రపంచ శాంతి కోసం ట్రంప్ యుద్ధాన్ని ఆపాలని, ఈ దిశగా భారత ప్రధాని అమెరికాపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ర్యాలీకి మద్దతుగా సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయకార్యదర్శి లోడంగి శ్రవణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు దేప నరేందర్‌రెడ్డి, నేషనల్ షరీఫుద్దీన్, బిఆర్ఎస్ నాయకులు చీర పంకాజ్ యాదవ్, జమాల్ ఖాద్రి, సిపిఎం నాయకులు పి.నర్సిరెడ్డి, నల్పరాజు సైదులు, ఎంఐఎం నాయకులు రజియుద్దీన్, ముస్లిం మత పెద్ద మౌలానా యాసర్, పాదర్ అలెగ్జాండర్, కోమటిరెడ్డి అనంత రెడ్డి, లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రేపల మదన్ మోహన్, రేఖల భద్రాద్రి, పబ్బు వీరస్వామి, ముంతాజ్ అలీ సంఘీభావం తెలిపారు. శాంతి సంఘం నాయకులు పసల శౌరయ్య, శ్యామల నాగసేనారెడ్డి, కట్ట అనంతరెడ్డి, బుక్క ఈశ్వరయ్య, ముల్ల ముత్యాలు, పి.బ్రహ్మాచారి, సిహెచ్.సుధాకర్‌రెడ్డి, ఇదురు సాగర్, లెనిన్, కర్నాటి వెంకటేష్, నిమ్మల భీమార్జున్‌రెడ్డి, దశరథ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు చేస్తున్న యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ ప్రపంచ శాంతిని కాపాడుకోవాలని మంగళవారం వామ పక్ష పార్టీలు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ రైల్వే స్టేషన్ నుంచి వరంగల్ చౌరస్తా వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు.ర్యాలీలో సిపిఐ జిల్లా కార్యదర్శి భాషామియా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి అక్కనపల్లి యాదగిరి, ఎఐసిటియు జిల్లా ప్రధానకార్యదర్శి ముక్కెర రామస్వామి, సిఐటియు జిల్లా కార్యదర్శి ఆరూరి కుమార్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సోమిరెడ్డి శ్రీనివాస్, విద్యార్థి సంఘం నాయకులు వలివుల్లా ఖాద్రీ పాల్గొన్నారు. ర్యాలీకి ఎంసిపిఐయు వరంగల్ నగర కార్యదర్శి మాలోత్ సాగర్ అధ్యక్షతన వహించగా, వివిధ పార్టీల నాయకులు నర్రా ప్రతాప్, మేకల రవి, సింగారపు బాబు, ఎండి బషీర్, దుర్గయ్య, లాదర్ల శరత్, సుంచు జగదీశ్వర్, గణిపాక ఓదెల్, ల్యాదళ్ళ శివ, ఎగ్గని మల్లికార్జున్, గోవర్ధన్, రాజు, మాలి ప్రభాకర్, అప్పనపూరు నర్సయ్య, జాన్‌పాల్ పాల్గొన్నారు.




## ఆరు గ్యారంటీలు అమలు చేయండి



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ్మా డిమాండ్

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ్మా, సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్ డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఇంటింటికీ సిపిఐ గడపగడపకు సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాల్ నరసింహ్మా హాజరై మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీతో స్నేహపూర్వకంగా సంబంధాలు ఉన్నప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటాలు సిపిఐ చేస్తుందన్నారు. రాజకీయాలకతీతంగా అర్హులందరికీ గ్యారంటీలను అమలు చేయాలని సిపిఐ డిమాండ్ చేస్తుందన్నారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ ఆందోళనబాట పడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు పెబ్బేటి విజయుడు తన్నీరు నరసింహ, సిపిఐ మండల కార్యదర్శి బుల్లెట్ల శ్రీనివాసులు, బండి లక్ష్మీ పతి, మండల సహాయ కార్యదర్శి లక్ష్మీ నారాయణ, నాయకులు సాయిలు, శాఖ కార్యదర్శి లక్ష్మ ణస్వామి, కల్వకోల్ సిపిఐ శాఖ కార్యదర్శి సంఘం కృష్ణ, నాయకులు బండి కృష్ణయ్య, రాధాకృష్ణ, బాపనపల్లి పెద్ద బొందయ్య, మద్దిలేటి జి.రామకృష్ణ, మాసన్న, సుల్తాన్, రవి, కుర్మయ్య సత్యనారాయణ, శివకుమార్, కొండల్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై కదులుదాం..

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** సంస్థాగతంగా సిపిఐ పార్టీని బలోపేతం చేయడం కోసం త్వరితగతిన పార్టీ సభ్యత్వాన్ని పూర్తిచేసి నిర్మాణాన్ని పటిష్ట పరుచుకొని ప్రజా సమస్యలపై కదులాదామని పార్టీ శ్రేణులకు సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కరీంనగర్ జిల్లాకేంద్రంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై నిరంతరం నిర్వహించే పోరాటాలు, సైద్ధాంతిక అవగాహన కల్పించి నూతన సభ్యులను పార్టీలో చేర్పించాలని, పార్టీని బలోపేతం చేయడం కోసం పార్టీ నాయకత్వం క్షేత్రస్థాయిలో పనిచేయాలని, ప్రజా సం ఘాల నిర్మాణం కోసం వారికి సహకరించి ప్రోత్సహించాలని పంజాల శ్రీనివాస్ కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గసభ్యులు పొనగంటి కేదారి, అందె స్వామి, కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, గూడెం లక్ష్మి, బత్తుల బాబు, కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సమ్మయ్య, నాగెల్లి లక్ష్మారెడ్డి, పిట్టల సమ్మయ్య, న్యాలపట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్రంలో 'ఫీజు రీయింబర్స్‌మెంట్' ఎత్తేసే కుట్ర

### ఎఐఎస్ఎఫ్ రాష్ట్రకార్యదర్శి పుట్ట లక్ష్మణ్




**ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ :** తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్నారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ ఆరోపించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్‌లో ఎఐఎస్ఎఫ్ 4వ రాష్ట్ర మహాసభలు నిర్వహించిన మహాసభ ఆహ్వాన సంఘం ముగింపు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి కసిరెడ్డి మణికంఠరెడ్డి, పుట్ట లక్ష్మ ణ్ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై హైకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్రప్రభుత్వం స్పందించకుండా మౌనంగా ఉండటాన్ని గమనిస్తే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర అని, పథకాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రయివేటు, విద్యాసంస్థల ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తే విద్యాశాఖ అధికారులు ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలకు తొత్తుగా వ్యవహరిస్తున్నారన్నారు. విద్యార్థులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఇంకెప్పుడు అమలు చేస్తారని ప్రశ్నించారు. 2004లో నాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెడితే, నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం పథకాన్ని నిర్వీర్యం చేస్తుందన్నారు. విద్యాశాఖను రేవంత్‌రెడ్డి తన వద్ద పెట్టుకున్న బకాయిలు ఇవ్వకుండా రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తున్నారన్నారు. 2023 ఎన్నికల హామీల్లో ఫీజు బకాయిలు అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఒకేసారి విడుదల చేస్తామని చెప్పి అధికారం చేపట్టిన రెండున్నర సంవత్సరాలు గడుస్తున్నా రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు ఇవ్వకుండా విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని ఒకపక్క చెబుతు మరోపక్క రేవంత్ రెడ్డి కార్పొరేట్ విద్యాసంస్థల ప్రారంభానికి ఎలా వెళ్లారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఫీజు రీచయింబర్స్‌మెంట్ బకాయిలు వారం రోజుల్లో విడుదల చేయకపోతే సిఎం క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ మాజీ నాయకుడు సుధాకర్, ఎఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుబోద్, రఘురాం, జిల్లా కోశాధికారి అనూష, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, జిల్లా సమితి సభ్యులు కిషోర్, నాయకులు గణేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఉద్యమాలు మరింత బలోపేతం

### సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** ఇంటింటికీ సిపిఐ పేరుతో ప్రతి ఇంటిని తట్టి సమస్యలపై ప్రజలను కదిలించాలని ప్రజా ఉద్యమాలను బలోపేతం చేయాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సిపిఐ సత్తుపల్లి టౌన్ మండల కమిటీల సమావేశం చాకలి ఐలమ్మ భవన్‌లో పాలకుర్తి వీరయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా దండి సురేష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై దృష్టి పెట్టి ప్రజలకు మరింత చేరువు కావాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు ఎక్కడ ఉంటే కమ్యూనిస్టులు అక్కడ ఉంటారని, కమ్యూనిస్టు పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. సిపిఐ కార్యవర్గ సభ్యులు దండు ఆది నారాయణ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గం, పట్టణంలో ఇళ్ల స్థలాలు లేని పేదలు అనేకమంది ఉన్నారని వారందరికీ ఇళ్ళ స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని, శిఖం భూములు పేదలకు పంచాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి నిమ్మటూరి రామకృష్ణ, సహాయ కార్యదర్శి పాలకుర్తి వీరయ్య, దండు జగన్, రామారావు, కోలేటి వెంకటేశ్వరరావు, నాగరాజు, ఎస్.కె కాసింబి, ఎస్.కె జాన్ బి, సునీల్, గిరి పాల్గొన్నారు.



## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికే అడ్వాన్స్ టెక్నాలజీ

రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి 46 కోట్ల రూపాయలతో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర భారీనీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులనుద్దేశించి మంత్రి మాట్లాడారు. ఈ అడ్వాన్స్ సెంటర్‌ను 40 కోట్ల రూపాయలతో నిర్మించడం జరిగిందని, టాటా అడ్వాన్స్ టెక్నాలజీ వారి సహకారంతో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇందులో ప్రస్తుతం 172 మంది విద్యార్థులు వివిధ కోర్సుల్లో శిక్షణ తీసుకుంటున్నామని అన్నారు. నిరుద్యోగ, చదువుకున్న యువతకు వివిధ కోర్సులలో శిక్షణ ఇచ్చి వారు స్వతహాగా జీవించడానికి ఉద్యోగం సంపాదించుకోవడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందని, వచ్చే ఆర్థిక సంవత్సరం నుండి ప్రతినెల విద్యార్థికి రెండువేల చొప్పున స్కాలర్‌షిఫ్ ఇవ్వడం జరుగుతుందని, ఆర్ఓ ప్లాంట్, టాయిలెట్స్, ఇతర మౌళిక సదుపాయాలు 2,3 నెలల్లో పూర్తి చేయడం జరుగుతుందని అన్నారు. దీనిలో బెసిక్ శిక్షణ ఇస్తారని, అడ్వాన్స్ టెక్నాలజీ శిక్షణ ఇస్తారని తెలిపారు. తదుపరి మంత్రి నిర్మాణంలో ఉన్న ఐటిఐ భవనాన్ని సందర్శించి, భవన నిర్మాణ పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్లను అదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, ప్రిన్సిపాల్ శ్రీరాములు, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ పాల్గొన్నారు.

## భూసేకరణ పనులు వేగవంతం

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/నందికొండ:** ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ పనులను వేగవంతం చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.మంగళవారం కలెక్టర్ ఛాంబర్‌లో ఇరిగేషన్,రెవిన్యూ,సర్వే అధికారులతో ప్రాజెక్టుల భూసేకరణ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఉదయ సముద్రం,అయిటిపాముల లిఫ్ట్ ఇరిగేషన్,మాద ఎడవల్లి,శివన్నగూడెం, డిండి,నక్కలగండి, ఏకేబియర్, పెండ్లిపాకల, చింతచెట్టు తండా ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేస్తే వర్ష కాలం వచ్చే లోపు ప్రాజెక్ట్ పనులు వేగవంతం చేయవచ్చని రెవిన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు సమన్వయము చేసుకుంటూ భూ సేకరణ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.భూసేకరణ,పునరావాసం కల్పన,నష్ట పరిహారం చెల్లింపులలో ఆలస్యం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.భూసేకరణ ప్రక్రియలో ఎలాంటి తప్పులకు అస్కారం లేకుండా రైతులకు సమయానికి పరిహారం చెల్లించాలన్నారు . పునరావాస కేంద్రాలలో రోడ్లు, విద్యుత్, త్రాగు నీరు లాంటి మౌలిక వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని తెలిపారు.ఈ సమావేశానికి రెవిన్యూ అదనపు కలెక్టర్ జె .శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,దేవరకొండ ఆర్‌డిఓ రమణారెడ్డి,ఇతర అధికారులు,ఇరిగేషన్ అధికారులు హాజరయ్యారు.

## మిల్లర్లు- దళారీల దోపిడీకి గురవుతున్న రైతులు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు




**ప్రజాపక్షం/గరిడేపల్లి:** నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు ఎండనక, వాననక రేయింబవుళ్లు కష్టపడి పంట పండించి మిల్లర్ల దగ్గరకి ధాన్యం అమ్ముకోవడం కోసం రైతులు వెళ్తే ధాన్యం కొనుగోలు చేయక పోగా వారిని బిచ్చగాళ్ల కంటే హీనంగా చూస్తు ఇక్కడ నుండి వెళ్లమని కసురుకుంటున్నారని, వారికి నచ్చిన విధంగా రోజుకో ధరను నిర్ణయిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను నిలువ దోపిడి చేస్తున్నారని, ఐనా ప్రభుత్వానికి గాని, ప్రభుత్వ అధికారులకు గాని ఏమీ పట్టనట్లుగా చోద్యం చూస్తున్నారే తప్ప రైతులకు అండగా నిలవడం లేదని ఇది చాల దుర్మర్గామని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గానుగబండలో జరిగిన సిపిఐ గ్రామ కమిటి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వేసంగి పంట చేతికి రావడానికి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, అనేక రకాల తెగుళ్ల వచ్చినా ఎప్పటికప్పుడు క్రిమిసంహరక మందులు పిచికారి చేసి పొలాలను కాపాడుకొని పంట పండించి అమ్ముకోవడానికి వస్తే మిల్లర్లు దళారీలు దోపిడి చేస్తున్నారే తప్ప గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని ఆయన అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కుందూరు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, తాళ్ల తిరపయ్య, మెండే వెంకటేశ్వర్లు, కట్ట నర్సింహారావు, పోకల నర్సింహారావు, ఈశ్వరచారి, షేక్ నబీసాబ్, గోధుముల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నల్లగొండ జిల్లాలో రబీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

126 కేంద్రాలు ఏర్పాటు

**ప్రజాపక్షం/నల్లగొండ :** రబీ ధాన్యం కొనుగోలు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఇప్పటివరకు 126 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, కోటి 42 లక్షల రూపాయల విలువ చేసే 595 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు ఏర్పాటుచేశారు.2025/26 రబీ సీజన్‌లో భాగంగా ఐకెపి, పిఎసిఎస్,రైతు ఉత్పత్తి కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ కొనసాగుతుంది.ఇప్పటివరకు ఐకెపి కేంద్రాలకు 48,750 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం చేరగా, పిఎసిఎస్ కొనుగోలు కేంద్రాలకు 89,705 మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం,1,480 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం వచ్చింది అలాగే రైతు ఉత్పత్తి కేంద్రాలకు 180 మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం చేరింది.ఈ విధంగా మొత్తం కొనుగోలు కేంద్రాలకు 1,40,115 మెట్రిక్ టన్నుల ధాన్యం ఇప్పటివరకు 63 మంది రైతులకు చెందిన 595 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి,దానికి సంబంధించిన రూ.1.42 కోట్ల విలువ చెల్లింపు ప్రక్రియ కొనసాగుతోంది.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం సేకరణను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నామని ఆదికారులు తెలుపుతున్నారు. రబీ ధాన్యం కొనుగోలు కోసం ఇప్పటివరకు 8,65,600 గన్నీ బ్యాగులను కొనుగోలు కేంద్రాలకు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు కొనుగోలుకు సిద్దంగా ఉన్నారు.

# వేగంగా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం మినీ మీటింగ్ హాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట రెడ్డి పాల్గొన్నారు. ఇండ్ల నిర్మాణాల ప్రగతిని విప్ బీర్ల ఐలయ్య సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సొంత ఇంటి కళ నెరవేర్చే లక్ష్యంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే స్లాబ్ లెవెల్ పూర్తి అయిన ఇండ్లకు గృహప్రవేశాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వంగపల్లి ప్రాంతంలోని డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు కరెంట్, రోడ్లు, మంచినీటి సౌకర్యాలు వంటి మౌలిక వసతులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కడా మంచినీటి సమస్య లేకుండా చూడాలని సూచించారు. అలాగే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించి, కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఇంకా పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య మహేందర్ రెడ్డి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీరాములు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు ప్రతి గడపకూ అందాలి

భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



**ప్రజాపక్షం/నకిరేకల్ (శాలిగౌరారం):** తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా అధికారులు కృషి చేయాలని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. మంగళవారం శాలిగౌరారం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నల్గొండ కలెక్టర్ బి.చంద్రశేఖర్‌లతో కలిసి ప్రారంభించారు.బైరవునిబండ గ్రామం నుంచి నార్కెట్‌పల్లి మండలం నక్కలపల్లి వరకు రూ.8 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు శంఖుస్థాపన చేశారు. అలాగే రూ.10 లక్షలతో నిర్మించనున్న స్త్రీశక్తి భవనానికి భూమిపూజ చేసి,రూ.10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ అప్పుల కారణంగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ దశలవారీగా అభివృద్ధి పనులను కొనసాగిస్తామని తెలిపారు. శాలిగౌరారం తన సొంత మండలమని, అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు.ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డులు, సన్న బియ్యం, సన్న వడ్లకు బోనస్, సబ్సిడీ గ్యాస్, ఉచిత బస్ ప్రయాణం, గృహలక్ష్మి వంటి పథకాలను అమలు చేస్తున్నదన్నారు. మండలంలోని మాదారంఇటుకులపహాడ్, వల్లాలజోలోని గూడెం రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం ఐకేఎఫ్ సెంటర్‌ను ప్రారంభించి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పెర్కకొండారం జెడ్‌పి హైస్కూల్‌లో కంప్యూటర్ డిజిటల్ ల్యాబ్‌ను కూడా ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,అదనపు కలెక్టర్ (స్థానికసంస్థ) వై.అశోక్ రెడ్డి,డీఆర్‌డీఏ పీడీ శేఖర్ రెడ్డి,ఎంపీడీవో జ్యోతిలక్ష్మి, తహసీల్దార్ వరప్రసాద్,మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ నరిగ యాదయ్య,ఉపసర్పంచ్ దండ శ్రీలతకృష్ణారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు దండ అశోక్ రెడ్డి,మండల అధ్యక్షులు సమరం రెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళు షురూ

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 280 కొనుగోలు కేంద్రాలు

4.79 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యంగా



**ప్రజాపక్షం/సూర్యాపేట :** రైతులు తాము పండించిన వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేయడం షురూ చేసింది. ఈ రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ళు చేసేందుకు సంబంధిత అధికారులు జిల్లా వ్యాప్తంగా మొత్తం 280 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో ఐకెపి 158, పిఏసిఎస్ 109, మెప్మా 13 కేంద్రాలు ఉండగా సన్నాల కొనుగోళ్ళకు ఇందులో ప్రత్యేకంగా 74, దొడ్డు ధాన్యం కొనుగోళ్ళకు 206 కేంద్రాలను అధికారులు కేటాయించడం జరిగింది. జిల్లాలో వరి సాగు మొత్తం 4 లక్షల 82 వేల ఎకరాలలో రైతులు సాగు చేయగా 12లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అవుతుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. దీనిలో 4.79 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారికంగా ప్రకటించారు. సూర్యాపేట నియోజక వర్గంలో ధాన్యం కొనుగోళ్ళు జోరుగా సాగుతున్నాయి. ధాన్యం కొనుగోళ్ళకు అవసరమైన గన్నీ బ్యాగ్‌లను కూడా అధికారులు సమకూర్చుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు లారీల కొరత లేకుండా ట్రాన్స్‌పోర్టు అధికారులతో వరుస సమావేశాలు నిర్వహించారు.

**కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బంది లేకుండా...**

కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు నీడ కోసం టెంట్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ఆరబెట్టుకొని చెత్త, పెల్ల, తాలు లేకుండా తీసుకవచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్ధతు ధరను పొందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కోరారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం కొనుగోళ్ళు వేగవంతం చేయాలని కేంద్రాల నిర్వహకులను ఆదేశించారు.

## రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది

పల్లెపహాడ్‌లో ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేముల వీరేశం

**ప్రజాపక్షం/నల్లగొండ(నార్కెట్ పల్లి):** రైతులకు మద్దతు ధరపై ధాన్యం కొనుగోలు సౌకర్యం కల్పించేందుకు పల్లెపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలో ఏర్పాటు చేసిన ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్,స్థానిక శాసనసభ్యులు వేముల వీరేశం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి సరైన ధర లభించేలా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తమ పంటను తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు.ఐకెపి కేంద్రాల ద్వారా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేసి రైతులకు చెల్లింపులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సంగిశెట్టి రాణమ్మశ్రీనివాస్,ఉప సర్పంచ్ దిలీప్ రెడ్డి,వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు,అధికారులు,రైతులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# వేసవిలో తాగునీటి ఎద్దడి రావొద్దు

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** జిల్లాలో వేసవిలో త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. మంగళవారం విసి కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని ఆర్‌డిఓలు, మున్సిపల్ కమీషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, ఎంపిఓలు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో వివిధ శాఖల పనితీరు, చేపట్టవలసిన పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్‌కు అధికారులు రబీ 2025/26 సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 280 పిపిసి సెంటర్లు ఏర్పాటు చేసినట్లు, వీటిలో దాదాపు అన్ని సెంటర్లు ప్రారంభించి, ధాన్యం కొనుగోలుకు సిద్ధంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిపిసి సెంటర్ ఇంచార్జీలకు సూచిస్తూ, ధాన్యం కొనుగోలుకు అవసరమైన అన్ని రకాల సామాగ్రిని టిపి సెంటర్లలో సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కొనుగోలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమర్థవంతంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలన్నారు. జిల్లాలోని అన్ని సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి, రైతులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఉపాధి హామీ పథకం పనుల గురించి మాట్లాడుతూ గ్రామ పంచాయితీలలో సరాసరి 100 మంది కూలీలతో పని చేయించాలని, ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల అందరికి ఫేస్ రికగ్నేషన్ యాప్ ద్వారా హాజరు తీసుకోవాలన్నారు. నర్సరీల్లో 100 శాతం జర్మినేషన్ ఉండేలా చూడాలని, నర్సరీలకు షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేయాలని, అన్ని రకాల రిజిస్టర్లు నిర్వహించాలని, ఉపాధి నందు ఐడెంటిఫై చేయవలెనని, ముఖ్యంగా నీటి సంరక్షణ పనులు గుర్తించాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా సమస్యలు, ఇబ్బందులు కలిగితే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అలాగే ఎఫ్ఐఆర్ మ్యాపింగ్ వేగవంతం చేయాలని, బిఎల్ఓ వెరిఫై చేసి మ్యాపింగ్ ప్రోగ్రాం చేయాలని, బూత్ లెవల్ ఏజెన్సీలను నియమించాలని, ఫారం పెండెన్సీ పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డిఎస్ఓ మోహన్‌బాబు, సిపిఓ కిషన్, డిపిఓ యాదగిరి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## డిండి, ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టు ద్వారా రైతులకు సాగునీరు

2028 జూన్ నాటికి ఎస్ఎల్‌బిసి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేయాలి : ఎంఎల్ఏ బాలునాయక్

**ప్రజాపక్షం/దేవరకొండ :** ఎస్ఎల్‌బిసి 2028 నాటికి పూర్తి చేసి డిండి ప్రాజెక్టు, ఎస్ఎల్‌బిసి ద్వారా రైతాంగానికి సాగునీరు అందిస్తామని దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. మంగళవారం దేవరకొండ పట్టణంలోని ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ శాఖ, రెవెన్యూ శాఖ, ఫారెస్ట్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. దేవరకొండ నియోజకవర్గంలో పెండింగ్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పూర్తికి భూ సేకరణ, రైతులకు పరిహారం చెల్లింపుపై ఎంఎల్ఏ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశంలో చర్చించారు. నియోజకవర్గంలోని పెండింగ్ ప్రాజెక్టుల పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఇరిగేషన్ రంగంలో అధికారులు, ఇంజనీరింగ్ నిపుణులు, కాంట్రాక్ట్ ఏజెన్సీలు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రాజెక్టులకు అవసరమైన భూ సేకరణ, భూ నిర్వాసితులకు తగిన పరిహారం (ఆర్ అండ్ ఆర్) సకాలంలో అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యవసాయానికి నీరందించే ప్రాజెక్టులను సకాలంలో పూర్తిచేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంఎల్ఏ పేర్కొన్నారు. పెండ్లీపాకల రిజర్వాయర్ ముంపు గ్రామాలైన గుడితండా, హరిజతండా, పత్యతండా, కారోబార్‌తండా భూములు, ఇళ్లు కొల్పోయిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ప్రాజెక్టుల ద్వారా ప్రభావితమైన ప్రజల హక్కులు, జీవన ఉపాధి ప్రభుత్వ బాధ్యత అని, భూ నిర్వాసితుల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం అని ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. పెండ్లీపాకుల ప్రాజెక్టు కింద భూములు, ఇండ్లు కొల్పోయిన నిర్వాసితులందరికి పరిహారం, పునరావాసం కల్పించాలని, గాజీనగర్, శాఖవెల్లి, నేరేడుగొమ్ము పరిధిలో ఉన్న భూములు మిస్సింగ్ సర్వే నెంబర్ వెంటనే సర్వే చేసి టైటిల్ ఇచ్చి, ప్రభుత్వం నుండి భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. ఎస్‌సి బద్రునాయక్, ఎస్‌డివో రాజ్‌కుమార్, ఆర్డీవో రమణా రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అనంత ప్రతాప్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ నీలా, అరుణ, డిఎఫ్‌వో సంగీత, శ్రీనివాస్, ఈఈలు సత్యనారాయణ, రాములు, జాదవ్, డిఈలు, రెవెన్యూ, ఇరిగేషన్, ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.






## పేద ప్రజలకు అండ సిపిఐ జెండా

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/కోదాడ:** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమంను మంగళవారం శ్రీమన్నారాయణ కాలనీలో, టీచర్స్ కాలనీ, ఉత్తమ్ పద్మావతి కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటా సిపిఐ (వారి సమస్యలపై ) నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్, నాయకులు గోపినాయక్, క్రాంతి, జానీ, లింగయ్య, బాల్‌మియా, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిపిఐ పోరాటాలకు చేయూతనివ్వండి



**ప్రజాపక్షం/చింతపల్లి :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు తెలిపారు. అందులో భాగంగా మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో ప్రజలనుండి విరాళాల సేకరణ చేప ట్టారు. ఈ సందర్భంగా యాదగిరారవు మాట్లాడుతూ సిపిఐ నిర్వహించే ప్రజా ఉద్యమాలకు, పోరాటాలకు చేయుతగా విరాళాలిచ్చి ఆదరించాలని యాదగిరిరావు ప్రజలను కోరారు. నల్లగొండ జిల్లా సమాగ్రాభివృద్ధికి చేపట్టిన ఎస్ఎల్‌బిసి, డిండి ఎత్తిపోతల పథకాన్ని తక్షిణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలె వెంకటయ్య, నాయకులు పల్లపు లక్ష్మయ్య, యాచారం శ్రీశైలం, గ్యార పరుశరాములు, మదారం ముత్యాలు, మదారం వెంకటయ్య, ఎండి మన్వర్‌ఖాన్, గుద్దటి నర్సింహ్మా, జల్లెల వెంకటయ్య, పోలెపల్లి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమ సమాజ నిర్మాణమే ధ్యేయం



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి:** సమాజంలో అంతరాలు లేని సమ సమాజ నిర్మాణమే ధ్యేయంగా పనిచేసే ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఇంటింటికి సిపిఐ కార్యక్రమాన్ని ఆయన సిపిఐ నాయకులతో కలిసి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, మండల కార్యదర్శి గుమ్మకొండ వెంకటేశ్వర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పెరికేటి చంద్రశేఖరా చారి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, వలమల్ల ఆంజనేయులు, సోమ్లానాయక్, కల్లు చరణ్‌రెడ్డి, పి. శ్రీనివాస్‌పాల్గొన్నారు.




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** గోలుసు కట్టు కాల్వల ద్వారా సాగు నీరు అందించాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన మోటకొండూరు మండలంలోని వర్టూరులో సిపిఐ ఇంటింటికి ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు సందర్భంగా భారత దేశంలో సిపిఐ పార్టీ ప్రజా సమస్య లపై అనేక ఉద్యమ పోరాటాలు నిర్వహించిన ఘనత సిపిఐకే ఉన్నదని అన్నా రు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ కార్యదర్శి గాదెగాని మాణిక్యం, మండల కార్యవర్గ సభ్యులు పల్లె వెంకన్న, శాఖ కార్యదర్శి సుదగాని వెంకన్న, శాఖా సహాయ కార్యదర్శి పల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా ఇసుక తరలింపు

రెండు ట్రాక్టర్లు సీజ్

వ్యవసాయ మోటార్ దొంగతనం ఘటనపై కేసు నమోదు

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** మండలంలో అక్రమ ఇసుక రవాణాపై పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకుని సీజ్ చేసి, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. స్థానిక ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం అర్ధరాత్రి సమయంలో గోవర్ధనగిరి గ్రామానికి చెందిన వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు అడ్డుకుని ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మంగళవారం తెల్లవారుజామున సంగినేనిపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తి కూడా అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. ఈ ఘటనపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు. అక్రమ ఇసుక రవాణాపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఇక మరో ఘటనలో గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మేకల కురుమయ్య ఇచ్చిన ఫిర్యాదుమేరకు వ్యవసాయ మోటార్ దొంగతనం కేసు నమోదైంది. సోమవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆయన వ్యవసాయ పొలంలో ఉన్న కరెంటు మోటార్‌ను దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితులను త్వరలోనే గుర్తించి పట్టుకుంటామని ఎస్ఐ నరేష్ తెలిపారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందజేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని వనపర్తి శాసనసభ్యులు మెఘారెడ్డి అన్నారు. మండలంలోని పెబ్బేరు, తోమాలపల్లి, రామాపురం వివిధ గ్రామాలకు చెందిన 15 మంది లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులు మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వనపర్తి ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసాగర్, మాజీ సర్పంచు సురేందర్ గౌడ్, యాపర్ల రామ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, భగవంతు పాల్గొన్నారు.

## సర్కస్ యజమానిపై కేసు నమోదు

**ప్రజాపక్షం/మాగనూర్ :** మండల పరిధిలోని అడవి సత్యారం గ్రామంలో మంగళవారం అక్రమంగా బాల కార్మికుడితో పని చేయిస్తున్న సర్కస్ యజమానిపై మాగనూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేట్ జిల్లా చైల్డ్ హెల్ప్ లైన్ (1098) సూపర్ వైజర్ బాలరాజుకి అందిన సమాచారం ప్రకారం అనంతపురం జిల్లా ఎన్.పి. కుంట మండలానికి చెందిన 14 సం॥ బాలుడు అడవి సత్యారం గ్రామంలో నిర్వహిస్తున్న ఒక సర్కస్ లో బాల కార్మికుడిగా పనిచేస్తున్నట్లు తెలిసింది. ఈ సమాచారంతో చైల్డ్ హెల్ప్‌లైన్ బృందం, మాగనూరు పోలీసులు కలిసి సదరు సర్కస్ కేంద్రంపై దాడి చేసి బాలుడిని రక్షించారు. ఈ సర్కస్‌ను అన్నమయ్య జిల్లా మదనపల్లికి చెందిన వనస్పతి అశోక్ తండ్రి ఆనంద్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రక్షించబడిన బాలుడిని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సిడబ్ల్యూసి) చైర్మన్ ఆదేశాల మేరకు నారాయణపేటలోని సురక్షిత షెల్టర్ హోమ్‌కు తరలించారు. చైల్డ్ హెల్ప్ లైన్ సూపర్ వైజర్ బాలరాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, సర్కస్ యజమాని వనస్పతి అశోక్‌పై జువైనల్ జస్టిస్ (జెజె) యాక్ట్, బాల కార్మిక నిషేధ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాగనూరు ఎస్సై పి.అశోక్ బాబు తెలిపారు. చిన్నారులను పనుల్లో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, ఎవరైనా చైల్డ్ లేబర్‌ను ప్రోత్సహిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

## గడువులోపు సిఎంఆర్ బియ్యం




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** రైస్ మిల్లర్ల నిర్ణీత గడువులోపు సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి సమర్పించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీను ఆదేశించారు. మంగళవారం బీసీ హాల్‌లో అదనపు కలెక్టర్ డీఎం సివిఎస్‌సి, రైస్ మిల్లర్లందరితో, డిటి సివిఎస్‌సితో సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ 2025–26 కోసం సిఎంఆర్ డెలివరీలపై సమీక్ష నిర్వహించారు. సమావేశంలో రబీ 2025–26 కోసం వరిని కేటాయించడానికి బ్యాంక్ గ్యారెంటీలు, ఒప్పందాలను సమర్పించాలని అలాగే మిగిలిపోయిన గోనె సంచులను వెంటనే తిరిగి ఇవ్వాలని ఆదేశాలు జారీ అయ్యాయని ఆయన తెలిపారు. ఈ కర్యక్రమంలో డీఎం సివిల్ సప్లై సైదులు, సివిల్ సప్లై అధికారి బాల్ రాజ్, రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

## స్పాట్ కేంద్రాన్ని సందర్శించిన ఆర్జెడి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పదవ తరగతి మూల్యాంకనం కేంద్రం వద్ద రెండవ రోజు ఉపాధ్యాయ సంఘాల ఐక్య కార్యాచరణ సమితి పిలుపుమేరకు ధర్నా జరగడంతో సమస్య తీవ్రతను జిల్లా విద్యాశాఖ అధికారులు రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు తెలియజేశారు. మూల్యాంకన చేసేందుకు ఉపాధ్యాయులు ఒప్పుకోవడం లేదని తెలియడంతో ఆర్జెడి సోమిరెడ్డి హుటాహుటిన హైదరాబాద్ నుండి మహబూబ్‌నగర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సమస్యను ప్రభత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఉపాధ్యాయులకు వీలైనంత త్వరగా డబ్బులు వారి వ్యక్తిగత ఖాతాల్లో జమ అయ్యేటట్లు చూస్తామన్నారు. ఉపాధ్యాయులు మూల్యాంకనను కొనసాగించాలని కోరారు. ఆర్జెడి సూచన మేరకు ఉపాధ్యాయులు మధ్యాహ్నం నుండి మూల్యాంకన చూసేందుకు అంగీకరించారు. విధులను బహిష్కరించాలని మూల్యాంకనను కొనసాగించవద్దని వెళ్లిపోవాలని కొన్ని ఉపాధ్యాయ సంఘాల పిలుపునివ్వడంతో కొంతమంది ఉపాధ్యాయులు వెళ్లిపోగా మరి కొంతమంది మూల్యాంకనం కొనసాగించారు.



# నిత్య అధ్యయనంతో ఉజ్వల భవిష్యత్తు

తెలంగాణ బి.సి సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** విద్యార్థులు వారి మంచి భవిష్యత్తు, ఉన్నతమైన వృత్తి సాధన కోసం కష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సూచించారు. హన్వాడ మండల కేంద్రంలోని హన్వాడ మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బి.సి సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ మంగళవారం సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 7వ తరగతి విద్యార్థునులతో మాట్లాడుతూ ఇప్పటి నుంచే క్రమశిక్షణతో చదువుపై దృష్టి పెట్టాలని, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. పాఠశాలలోని వంటగదిని తనిఖీ చేసి కలెక్టర్ భోజనం నాణ్యతను పరిశీలించారు. వంటగది శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని మరుగుదొడ్లను, డార్మిటరీనీ, తరగతి గదులను పరిశీలించారు. ముఖ్యంగా వేసవి కాలంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. అనంతరం హన్వాడ మండలంలోని పల్లెమోని కాలనీ సమీపంలో ఉన్న వేపూర్ బి.సి సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి గురించి కూడా కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. హీమోగ్లోబిన్ స్థాయిలను క్రమం తప్పకుండా పరీక్షిస్తున్నారా అని అడిగారు. మంచి ఆరోగ్యానికి ఆరోగ్యానికి ఆకుకూరలు, గుడ్లు వంటి పోషకాహారం తీసుకోవాలని, అవి ఐరన్, కాల్షియం, ప్రోటీన్లను అందిస్తాయని తెలిపారు. పాఠశాలలోన డార్మిటరీని పరిశీలించి వేసవిలో ఇబ్బంది లేకుండా ఫ్యాన్‌లు అవసరమైతే అదనంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పాఠశాలలో సరిపడా మరుగుదొడ్లు ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదినీ. స్టోర్ రూమ్‌ను పరిశీలించి బియ్యం గుడ్ల నిల్వలను కూడా తనిఖీ చేశారు. భోజన నాణ్యత పరిశీలించి తదనంతరం కలెక్టర్ విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు.






## మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మండలంలోని గంగాపూర్ వ్యవసాయ మార్కెట్ యార్డులో మక్కలు కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జడ్చర్ల శాసనసభ్యులు జానంపల్లి అనిరుధ్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు పండించిన పంటకు సరైన మద్దతు ధరలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని తెలిపారు. కేంద్రాలు ఉపయోగపడతాయని అన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ మక్కలను విక్రయించుకునేందుకు అవసరమైన అన్ని సదుపాయాలు కేంద్రంలో కల్పించామని తెలిపారు. రైతుల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రధాన లక్ష్యమని, రైతుల అభివృద్ధి కోసం నిరంతర కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎయంసి మార్కెట్ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి, అల్వాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కోనేటి పుష్పలత, నర్సింహులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మార్కెట్ కమిటీ అధికారులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

## కమ్యూనిస్టు పార్టీకి చేయూతనివ్వండి

సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు మారేడు శివశంకర్




**ప్రజపక్షం/నాగర్‌కర్నూల్ :** బడుగు బలహీన వర్గాల కోసం పాటుపడే భారత కమ్యూనిస్టు పార్టీకి చేయూతనివ్వాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు మారేడు శివశంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ, టీచర్స్ కాలనీలో ఇంటింటికి సిపిఐ ప్రజల వద్దకు సిపిఐ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అంతవరకు పోరాటాలు నిర్వహిస్తామన్నారు. గల్లి నుంచి ఢిల్లీ వరకు జరిగే ఇంటింటికి సిపిఐ ప్రజల వద్ద సిపిఐ ప్రోగ్రాంను విజయవంతం చేసి ప్రజలు మద్దతు కూడగట్టుతామని ముందు తరాల భవిష్యత్తు కోసం పార్టీని పటిష్టంగా చేసుకోవడమే ముందున్న లక్ష్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్ కే కాజా మైనుద్దీన్, సిపిఐ నాగర్ కర్నూల్ టౌను సభ్యులు ఈర్ల హుస్సేన్, గొర్ల సత్యం, రాజు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జల విధానం లోపభూయిష్టం

పాలకులపై సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి పరమేష్ గౌడ్ ఫైర్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తారా లేకపోతే ఎంపీ ఎమ్మెల్యే పదవులకు రాజీనామా చేస్తారని సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి, ప్రముఖ అడ్వకేట్ బి.పరమేశ్వర్ గౌడ్ పాలకులపై ఫైర్ అయ్యారు. భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ) నేతృత్వంలో ఇంటింటికి సిపిఐ పేరుతో ప్రచార యాత్రను మంగళవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో పుర వీధుల్లో ప్రజలను కలుసుకొని ప్రజా సమస్యల పై సర్వే చేస్తూ ప్రజలతో, న్యాయవాదులతో కలిసి ఉద్యమ నిధిని సేకరించారు. ఈ సందర్భంగా పరమేష్ గౌడ్ మాట్లాడుతూ పాలమూరు కరువు,వలసలు, వెనుకబడిన జిల్లా అనే అంశాలను ఎన్నికల ముందు ప్రస్తావిస్తూ ప్రజల ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత పాలకులు పాలమూరు ప్రగతిని పట్టించుకోవడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్, కేంద్రంలో ఉన్న బిజెపి, గత పదేళ్లు పాలించిన టిఆర్ఎస్ సర్కార్ అన్ని పార్టీలు పాలమూరు దగాజేసినయని వారు ఆరోపించారు. కృష్ణా బేసిక్ లో పాలమూరు పరివాహక ప్రాంతం 100% ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యం కారణంతో ఇక్కడి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కాలేదు, రైతాంగానికి చివరి ఆయకట్టు వరకు నీళ్లు రాని పరిస్థితి దాపురించిందని వాపోయారు. జిల్లా ప్రజా ప్రతినిధులు నీళ్ల విషయంలో నిర్లక్ష్యం చేస్తూ ఇక్కడి రైతాంగాన్ని మోసం చేస్తున్నారు. సాగునీటి జల విధాన వైఖరే లోపభూయిష్టంగా ఉన్నదని మండిపడ్డారు. పాలకుల వైఖరి విధంగానే ఉంటే రానున్న కాలంలో జిల్లా రైతాంగం పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేస్తారా ఎమ్మెల్యే, ఎంపీ పదవులకు రాజీనామాలు చేస్తారా ప్రజలు నిలదీస్తారని హెచ్చరించారు. తాగు సాగు నీరు సాధనలో ప్రజల ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. సురేష్, సిపిఐ నాయకులు వై. రంగన్న, యాదయ్య, దేవానంద్,యాదగిరి, బి.ఆర్, విల్సన్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# మనిషి జీవితంలో ఆరోగ్యం ప్రధానం

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**ప్రజాపక్షం/గద్వాలరూరల్ :** ప్రతి మనిషి జీవితంలో ఆరోగ్యంగా ఉండడం ప్రధానమని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే ఎవరైన సరే తాము అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం గద్వాల పాత డీఎంహెచ్వో కార్యాలయం వద్ద గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి కలెక్టర్ హెల్త్ డే ర్యాలీని జెండా ఊపి ప్రారభించారు. ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కళాశాలల విద్యార్థులతో పాటు ముఖ్య అతిథులు, వైద్య సిబ్బంది ర్యాలీలో పాల్గొనగా పాత బస్టాండ్ మీదుగా కృష్ణవేణి చౌరస్తా వరకు కొనసాగింది. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ టుగెదర్ ఫర్ హెల్త్ స్టాండ్ విత్ సైన్స్ నినాదంతో ఈ ఏడాది వరల్డ్ హెల్త్ డేను నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ధ్యేయంగా వైద్యాధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు. గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ మనిషి ఎంత సంపద ఉన్నా ఆరోగ్యం లేకపోతే ఆరోగ్యమే మహాభాగ్యం అనే నినాదాన్ని చెప్పడం జరిగిందన్నారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున ప్రజలను భాగ్యస్వాములను చేసి అవగాహన కలిగించాలని, ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల మున్సిపల్ చైర్‌పర్సన్ జయలక్ష్మి , డిఎంహెచ్‌ఓ సంధ్య కిరణ్మయి, డిడబ్ల్యూఓ సురంద, గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్ పలువురు కౌన్సిలర్లు, లీగల్ సర్వీసెన్ అథారిటీ సభ్యులు, వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు, ఇతర వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.







## సమ సమాజ స్థాపనకు సిపిఐ రాజీలేని పోరాటాలు

అమరచింతలో సిపిఐ ఇంటింటి ప్రచారం

**ప్రజాపక్షం/అమరచింత :** కార్మిక, కర్షక, ప్రజా సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో రాజీలేని పోరాటాలు సిపిఐ పార్టీ చేస్తున్నదని సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి ఏ.భాస్కర్ తెలిపారు. సిపిఐ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు అమరచింతలు ఈనెల ఒకటి నుండి 10వ తారీకు వరకు ఇంటింటికి సిపిఐ పార్టీ ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కార్యక్రమాన్ని చేపట్టారు. మంగళవారం 9,10, వార్డులలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ ఆవిర్భవించి, వందేళ్ల కాలంలో ఎన్నో పోరాటాలు, అమర వీరుల రక్తతర్పణంతో ఎన్నో విజయాలు సిపిఐ పార్టీ సాధించిందని తెలిపారు. ప్రజలందరూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ పట్టణ కార్యదర్శి ఏ.రవీందర్, మండల కమిటీ సభ్యులు శ్యాంసుందర్, లక్ష్మీనారాయణ, పట్టణ కమిటీ సభ్యులు కుమార్, ఇజ్రాయిల్, సోలు, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపొర్లకు బస్సు సౌకర్యానికి చర్యలు

**ప్రజాపక్షం/ఉట్కూర్ :** ఉట్కూర్ మండలంలోని పెద్దపొర్ల గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామ పంచాయితీ తరపున పంపిన వినతి పత్రానికి స్పందనగా, పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డీకే అరుణ ఎంపీ కార్యాలయం నుండి అధికారిక లేఖ జారీ అయింది. ఆ లేఖను నేడు నారాయణపేట డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి, గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యను తక్షణమే పరిష్కరించాలని ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బోయిన్ పల్లి కాశమ్మ, తనయులు నరేష్ కుమార్, వెంకటేష్, మాజీ సర్పంచ్ రవికుమార్, అలాగే యువ నాయకులు వెంకట్, రాము, సత్యం, అంజి తదితరులు పాల్గొన్నారు. గ్రామ ప్రజలకు త్వరలోనే బస్సు సౌకర్యం అందుబాటులోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## లక్ష్యసాధనతో ఉన్నత చదువులు

**ప్రజాపక్షం/అమరచింత :** విద్యార్థులందరూ ఒక లక్ష్యం పెట్టుకుని ఉన్నతమైన చదువులను అభ్యసించినట్లయితే భవిష్యత్తులో విజయానికి మంచి మార్గదర్శకులుగా తయారవుతారని ఎస్సై స్వాతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ఎస్పీ సునీల్ రెడ్డి ఆదేశానుసారంగా ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్, డయల్ 100 ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి, ఇష్టపడి చదివితేనే విజయం సాధిస్తారని తెలిపారు. విద్యార్థులకు పరీక్షలు జీవితంలో ఒక దశ మాత్రమేనని ధైర్యంగా, ఏకాగ్రతతో ముందుకు సాగితే ప్రతి విద్యార్థి విజయాన్ని సాధిస్తారని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఉన్నత చదువుల ద్వారా తల్లిదండ్రుల కలలను నిజం చేయాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు ఎవరైనా వేధిస్తే, బెదిరిస్తే వెంటనే పోలీసులకు 100 డయల్ చేసినట్లయితే పోలీసులు అండగా ఉంటారని స్వాతి విద్యార్థులకు తెలిపారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీస్ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ప్రజాపక్షం/వనపర్తి న్యూటౌన్ :** ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి కల సహకారం కోసం ఎదురుచూస్తున్న ఆ కుటుంబాలకు నేడు ఇందిరమ్మ ఇళ్లు కట్టించి వారి సొంత ఇంటి కలను సహకారం చేసింది. మంగళవారం వనపర్తి మండలం అంకుర్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకుని గృహ ప్రవేశాలు చేసిన లబ్దిదారుల ఇళ్లకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా అంకుర్ గ్రామానికి చెందిన భాగ్యలక్ష్మి భీష్ముడు, కొండకింది శారద శేఖర్ రెడ్డి, కావేరి వెంకటేశ్వర్‌రెడ్డి, నిర్మల శేఖర్ రెడ్డి, మాధవి ముత్యాలు కుటుంబాలకు సంబంధించిన దంపతులకు నూతన వస్త్రాలను అందించి శుభాకాంక్షలు తెలిపారు.



# పాత కక్షలే హత్యకు కారణం


మృతుని, నిందితుల మధ్య భూమి ఆస్తి, పందుల పెంపకం వివాదాలు

హత్య చేసేందుకు టిప్పర్ డ్రైవర్‌తో రెండు లక్షలకు సుపారీ

టిప్పర్, కారు, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం

డిఎస్‌పి సాయి రెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** పాత కక్షలే హత్యకు ప్రధాన కారణమని, మృతునికి నిందితుల మధ్య భూమి, ఆస్తి, పందుల పెంపకం కార్యకలాపాలకు సంబంధించి దీర్ఘకాలికంగా ఉన్న వివాదాల కారణంతోనే ముందస్తు ప్రణాళికతో హత్యకు పాల్పడ్డారని కల్వకుర్తి డీఎస్పీ సాయి రెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. మంగళవారం కల్వకుర్తి డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెల్దండ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 4వ తేదీన ఒక హత్య కేసు నమోదు అయిందని, అట్టి కేసును మూడు రోజులలో చేయించడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. వెల్దండ మండల కేంద్రానికి చెందిన రుద్రాక్షల సాయిలుకు ముగ్గురు భార్యలు ఉన్నారు. పెద్ద భార్య జంగమ్మకు, కృష్ణయ్య, పెద్ద వెంకటమ్మ, చిన్న వెంకటమ్మ, రెండో భార్య అంజనమ్మకు శివ శంకర్, మహేష్ సంతానం కలదు. పెద్ద భార్య కుమార్తె పెద్ద వెంకటమ్మకు కల్వకుర్తిలో ఉన్న పందుల షెడ్డును 2023 లో తొలగించలా సాయిలు వెల్దండ తన వ్యవసాయ పొలంలో పందుల షెడ్డు పెట్టించినాడని, తన కూతురుకు 20 గుంటల పొలం రిజిస్ట్రేషన్ చేసేందుకు వెల్దండలో స్లాట్ బుక్ చేయగా రుద్రాక్షల మహేష్ అడ్డుకున్నాడని తండ్రిపై కోపంతో ఉన్న రెండో భార్య పిల్లలు మహేష్, శివశంకర్‌లు తరచూ గొడవ పడేవారని, గతంలో కూడా పోలీస్ స్టేషన్లో కేసులు కావడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. గతంలో బెల్లంకొండ రాములుకు చెందిన పందులు దొంగతనమైన విషయంలో మనుపాటి పవన్, మనుపాటి శివ, మనుపాటి అన్వేష్ లు కల్వకుర్తిలో పందుల దొంగతనం చేసి వెల్దండల గల పందుల షెడ్డులో ఉంచారని మహేష్, బెల్లంకొండ రాములుకు వారే సమాధానం ఇచ్చి కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌లో దొంగతనం కేసు పెట్టించారని, వారి పందులను తీసుకువెళ్లేందుకు వెల్దండ పందుల షెడ్డు వద్దకు వెళ్లగా అక్కడ జరిగిన గొడవల్లో నిందితులు బెల్లంకొండ రాములును చంపడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. విషయంలో కూడా నిందితులు జైలుకు వెళ్లడం జరిగిందన్నారు. మహేష్ ఎరుకల సంఘం అధ్యక్షులు కావడంతో మహేష్ రోజుకు ఎదుగుతుండడంతో మమ్మల్ని బ్రతకనివ్వడం లేదని ఏ విధంగానైనా మహేష్‌ను చంపాలని నిందితులు ముందస్తు ప్రణాళిక ప్రకారం టిప్పర్ డ్రైవర్‌తో మాట్లాడి మహేష్ కారును టిప్పర్‌తో చంపి యాక్సిడెంట్‌గా చిత్రీకరించాలనుకున్నారని డీఎస్పీ తెలిపారు. రంజాన్ ముందు టిప్పర్ డ్రైవర్ అయిన బురాన్‌కు లక్ష రూపాయలు ఇచ్చి 20 రోజులకు లక్ష నిందితులు ఇచ్చారన్నారు. ఈనెల రెండవ తేదీన అన్వేష్, శివలు వెళ్లి రుద్రాక్షల మహేష్‌ను టిప్పర్‌తో ఢీకొట్టి చంపడానికి రావాల్సిందిగా కోరడంతో టిప్పర్ డ్రైవర్ బురాన్ ఈనెల 3వ తేదీన టిప్పర్ తీసుకొని వస్తానని చెప్పాడన్నారు. పథకం ప్రకారం పవన్, అన్వేష్, శివలు కలిసి మహేష్ ను కల్వకుర్తికి పిలిపించుకుని అతనితోనే తిరుగుతూ సాయంత్రం వరకు అతని కారులోనే ఉండి, సాయంత్రం దిగి వెల్దండలో ఉన్న వాళ్ళ మామ రుద్రాక్షల కృష్ణయ్య కారు పిలిపించుకుని నలుగురు కలిసి అక్కడి నుంచి మహేష్‌ను అనుసరిస్తూ వెల్దండకు వచ్చి మహేష్ వెల్దండలో గల పాల కేంద్రం దగ్గర దింపి రుద్రాక్షల కృష్ణయ్య వెళ్లిపోవడంతో టిప్పర్ డ్రైవర్‌కు అడ్రస్ చెప్పగా అతను వెల్దండ స్కూల్ దగ్గరికి టిప్పర్ తీసుకొని రావడం జరిగిందని, అన్వేష్ శివలు టిప్పర్ ఎక్కి పవన్‌ను స్కూల్ దగ్గరే ఉంచి క్రషర్ వద్దకు వెళ్లారు. స్కూల్ దగ్గర ఉన్న పవన్ మహేష్ తన రెడ్ కలర్ మారుతి కారులో బయలుదేరాడని సమాచారం ఇవ్వగా మహేష్ వస్తున్న కారుని గమనించి వాళ్లు టిప్పర్‌తో ఎదురుగా వచ్చి కార్‌తో ఢీ కొట్టిన అతను బతికే ఉన్నాడని చూసి టిప్పర్ డ్రైవర్ మహేష్ కాళ్లు పట్టుకోగా అన్వేష్, శివలు, మహేష్ తల ముఖంపైన గుద్ది చంపి టిప్పర్ అక్కడే వదిలిపోయారని డీఎస్పీ తెలిపారు. హత్యకు పాల్పడిన నిందితులను మంగళవారం కల్వకుర్తి పట్టణ సమీపంలో గల తిమ్మరాళి పల్లి గ్రామ శివారులో గల నిందితుల పందుల షెడ్డు దగ్గర పట్టుకుని రిమాండ్‌కు తరలించడం జరిగిందని డీఎస్పీ సాయి రెడ్డి, వెంకట్ రెడ్డి తెలిపారు. నిందితుల నుండి టిప్పర్, కార్‌తో పాటు ఆరు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకోవడం జరిగిందని డీఎస్పీ తెలిపారు. కేసును త్వరగా చేదించి, రిమాండ్‌కు తరలించినందుకు వెల్దండ సీఐ రఘువీర్ రెడ్డి, సహకరించిన వెల్దండ ఎస్సై కురుమూర్తితో పాటు సిబ్బందిని జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి.పాటిల్, డీఎస్పీ వెంకట్ రెడ్డిలు అభినందించారు.



ప్రదీప్ రంగనాథన్ హీరోగా, విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన క్రేజీ లవ్ స్టోరీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. శ్రీ పద్మిని సినిమాస్ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఏప్రిల్ 10న ఈ చిత్రం గ్రాండ్‌గా విడుదల కానుంది. 500 స్క్రీన్స్‌లో రిలీజ్ కానుంది.

# రీల్

## వినాయక్ చేతుల మీదుగా 'అహోం' ప్రారంభం




వివేక్ మిశ్రా, శృతిక జంటగా నటిస్తున్న సినిమా 'అహోం'. ఈ చిత్రాన్ని ఈగల్ ఐ స్టూడియో ఇంటర్నేషనల్ బ్యానర్‌పై దశరథ్ నిర్మిస్తున్నారు. ప్రసాద్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా భాషల్లో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళంలో సినిమా తెరకెక్కనుంది. నిర్మాత కె.ఎస్ రామా రావు, డైరెక్టర్ వి.వి.వినాయక్ ముఖ్య అతిథులుగా ఈ చిత్ర ప్రారంభోత్సవం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్మాత కేఎస్ రామారావు మాట్లాడుతూ డైరెక్టర్ ప్రసాద్ రాజు మంచి అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దర్శకత్వంలో ఈ సినిమా పలు భాషల్లో రూపొందడం సంతోషంగా ఉంది. ఎందుకంటే ఈ రోజు సినిమా ఒక్క భాషలో చేస్తే వర్కవుట్ కావడం లేదు. హిందీతో పాటు దక్షిణాది అన్ని ప్రధాన భాషల్లో 'అహోం' సినిమాను రూపొందిస్తున్నారు. బెంగాలీ, మరాఠీ వంటి భాషలతో పాటు ఈ చిత్రానికి ఇంగ్లీష్ లోనూ డబ్ చేయాలని సూచిస్తున్నా. నిర్మాత దశరథ్ గారికి కంగ్రాట్స్. కొత్త నిర్మాతలు బాగుంటేనే మరిన్ని చిత్రాలు తెరకెక్కి ఇండస్ట్రీ మీద ఆధారపడి ఉన్న వారికి ఉపాధి కల్పిస్తాయి. 'అహోం' సినిమా మంచి విజయం సాధించాలని కోరుతున్నా. అన్నారు. వివేక్ మిశ్రా, శృతిక, అజయ్ ఘోష్, శాండీ, కోటకొండ కృష్ణ, తదితరులు నటిస్తున్నారు ఈ చిత్రానికి కొరియోగ్రాఫర్ ఎంఆర్ బి, ఫైట్స్ జయరాం, లిరిక్స్ శ్రీరామ్ తపస్వి, ఎడిటర్ శివ శర్వాణి, మ్యూజిక్ వివేక్ పునీత్, డిఒపి వెంకట్ ఆనెం.

## నరేష్ హీరోగా 'కనకదుర్గ' షురూ



తమిళ సినీ ఇండస్ట్రీలో విజయవంతమైన కంటెంట్ స్టూడియో అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. అందులో భాగంగా టెంపుల్ టౌన్ పిక్చర్స్‌తో కలిసి చేయబోతున్న సినిమా 'కనక దుర్గ'ను రోజున పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. వెర్సటైల్ స్టార్ అల్లరి నరేష్ హీరోగా నటిస్తోన్న ఈ సినిమాలో కాజల్ చౌదరి హీరోయిన్. ఈ సినిమాలో నటుడు సుబ్బరాజు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ భక్తి ప్రధాన కథా చిత్రానికి బి.వి.ఎస్. రవి కథ అందిస్తుండగా..ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహిస్తున్నారు. సమీర్ నాయర్, దీపక్ సెహగల్, అజిత్ ఠాకూర్, బి.వి.ఎస్.రవి నిర్మాతలు. భారతీయ దేవతల ఆధారంగా ఒక దివ్యమైన ప్రపంచాన్ని ఆవిష్కరిస్తూ ఈ సినిమా భక్తి, యాక్షన్, భావోద్వేగాలు, సంగీతం ఇలా అన్ని అంశాలతో ప్రేక్షకులకు ఓ అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించనుంది. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో టెంపుల్ టౌన్ పిక్చర్స్ నిర్మాణంలో రూపొందుతోన్న ఈ సినిమా ఈ రెండు సంస్థలకు ఎంతో ప్రత్యేకమైనది. ఘనంగా జరిగిన కార్యక్రమంలో సురేఖ కొణిదెలతో పాటుగా ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, హరీష్ శంకర్, తదితరులు అతిథులుగా విచ్చేశారు. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత అల్లు అరవింద్ క్లాప్ కొట్టగా, సురేఖ కొణిదెల కెమెరా స్విచ్ ఆన్ చేశారు. మా బ్యానర్‌లో రూపొందుతోన్న తొలి తెలుగు సినిమా ఇది.

## అల్లు అర్జున్, అట్లీ కాంబోలో ఫస్ట్ లుక్ పోస్టర్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో సన్ పిక్చర్స్ అంతర్జాతీయ స్థాయిలో సినిమాని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ AA22XA6 అంటూ ఇప్పటికే సోషల్ మీడియాలో ఓ ట్రెండ్ క్రియేట్ చేసింది. ఇక ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన అప్డేట్ అల్లు అర్జున్ బర్త్ డే (ఏప్రిల్ 8) సందర్భంగా అందరినీ ఆశ్చర్యపర్చబోతోంది. ఈ క్రమంలోనే తాజాగా AA22XA6 ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రీ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ ఒక్క పోస్టర్‌తోనే మేకర్స్ ప్రేక్షకులు, సినీ లవర్స్‌లో ఎన్నో అనుమానాల్ని, ఉత్సుకతను రేకెత్తించారు. ఆ హ్యాండ్ ఎవరిది? ఆ ఆకారం ఏంటి? అది ఎందుకు అలా మారింది? కథ ఎలా ఉండబోతోంది? అని ఇలా అందరిలో రకరకాల ప్రశ్నల్ని లేవనెత్తింది. ఈ ఒక్క ప్రీ లుక్ పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాని షేక్ చేసేస్తోంది. టైటిల్‌తో పాటుగా హీరో ఫస్ట్ లుక్ పోస్టర్‌ని కూడా రివీల్ చేయబోతోన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ మూవీని ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఇక అల్లు అర్జున్ పుట్టిన రోజు సందర్భంగా సినిమాకు సంబంధించిన టైటిల్, పాత్రకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌తో అభిమానుల్ని అలరించనున్నారు. సరికొత్త సినిమాటిక్ వరల్డ్‌కి తీసుకు వెళ్లేలా ఈ చిత్రం ఉండబోతోందని టీమ్ చెబుతోంది.

## 'హిందీ'లో చక్కని రీచ్

### డెకాయిట్ : హీరో అడివి శేష్




అడివి శేష్ హీరోగా నటించిన తాజా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'. ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా హీరో అడివి శేష్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. హిందీలో చాలా అద్భుతంగా ఉంది. హిందీలో మేము ఊహించిన దాని కంటే చాలా చక్కని రీచ్ ఉంది. ఫస్ట్ టైం భోజ్‌పురి లో కూడా ప్రీమియర్ చేస్తారా అని అడిగారు. అది విన్నప్పుడు చాలా ఆనందంగా అనిపించింది. పవన్ సింగ్ ఇందులో చేయడం భోజ్ పురికి ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.నా గత సినిమాల్లో ఒక బిగ్ ప్లాట్‌ఫామ్ చేరుకోవడానికి లవ్ స్టోరీ వుంటుంది. కథలో ఒక చిన్న భాగంగా ఉంటుంది. కానీ ఈ సినిమాలో లవ్ స్టోరీనే మెయిన్ ప్లాట్ ఫామ్. ఈ మొత్తం సినిమాకి లవ్ స్టోరీయే కారణం. ఒక లవ్ స్టోరీలో యాక్షన్ చూడ్డానికి వెళ్తే మీరు చాలా హ్యాపీగా ఫీల్ అవుతారు. ఒక యాక్షన్ సినిమాలో లవ్ చూడడానికి వెళ్తే మాత్రం డిసప్పాయింట్ అవుతారు. ఇందులో ఎమోషన్స్ అన్నీ కూడా ఆర్గానిక్‌గా ఉంటాయి.'ఒక బిజీ రోడ్డుపైన ఒక కాంక్రీట్ సిమెంట్ ఫుట్ పాత్ క్రాక్ నుంచి ఒక చిన్న పువ్వు బయటికి వస్తే'...ఈ విజువల్ ఇమాజినేషన్ నుంచి ఈ కథ మొదలైంది. ఒక ఇంటెన్స్ యాంగర్ యాక్షన్ మధ్యలో మధ్యలో లవ్ స్టోరీ తయారు చేశాం.చిన్నప్పుడు ఫంక్షన్ లో డాన్స్ చేస్తున్నప్పుడు నువ్వు చాలా పొడుగ్గా ఉన్నావు డాన్స్ చేయొద్దు ఎవరో అన్నారు. అప్పటి నుంచి ఆ ఫీలింగ్ ఎలా ఉండిపోయింది. నాకు నేనే ఆ లిమిట్ పెట్టుకున్నాను. నాకు బ్రోకెన్ లవ్ స్టోరీ అంటే చాలా ఇష్టం. అందుకే దేవదాస్ సినిమాని మనం ఎన్నిసార్లు అయినా చూస్తాం. నేను రాసిన ప్రతి సినిమాలో నా లైఫ్ లో జరిగింది ఎంతో కొంత ఉంటుంది. నాకు ఫస్ట్ బ్రేకప్ అయినప్పుడు ఏం అర్థం కాలేదు. అప్పుడు 19 ఏళ్ళు. దాన్నుంచి బయటపడడానికి దాదాపు పదేళ్లు పట్టింది. ఆ బ్రేకప్ జరిగినప్పుడు అర్థం కాని ఒక రెండేళ్లు ఉంది. ఆ ఎమోషన్‌ని హరి క్యారెక్టర్ ద్వారా ఛానల్ చేయడానికి ట్రై చేశాను. డైరెక్టర్ శానిల్ మేమిద్దరం బెస్ట్ ఫ్రెండ్స్. ఇద్దరు అన్నదమ్ములలాగే ఉంటాం. సినిమా విషయంలో మాత్రం రాజీపడం.జి2 ఈ ఏడాది చివర్లో వస్తుంది.

## 17న వస్తున్న 'బ్యాడ్ బాయ్ కార్తీక్'

హీరో నాగ శౌర్య, రామ్ దేశినా (రమేష్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఇంటెన్స్ యాక్షన్ డ్రామా 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రంతో మాస్ అవతార్‌తో రాబోతున్నారు. శ్రీ వైష్ణవి ఫిలిమ్స్ బ్యానర్ పై శ్రీనివాస రావు చింతలపూడి నిర్మించిన ఈ చిత్రం. ఈ నెల 17వ తేదీన విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు. నరేష్ వీకే పాత్ర దేవుడిని ప్రార్థిస్తూ.. ప్రమాదకరమైన వ్యక్తుల అణచివేతలో ఇబ్బందులు పడుతున్న నేపథ్యాన్ని ప్రజెంట్ చేస్తుంది. ఆ సమయంలో 'బ్యాడ్ బాయ్ కార్తిక్' అనే రగడ తన రూల్స్‌తో జీవించే పవర్‌ఫుల్ క్యారెక్టర్ ఎంట్రీ అదిరిపోతుంది. విలన్‌పై అతను ఎలా పోరాడుతాడు, అమాయకులని ఎలా కాపాడుతాడు అన్నదే కథలో ప్రధానాంశం. నాగ శౌర్య ఫుల్ మాస్ పెర్ఫామెన్స్ ఇచ్చాడు. యాక్షన్ సన్నివేశాలతో పాటు, తనలోని వేరియేషన్స్ అద్భుతంగా వున్నాయి. ముఖ్యంగా సాయి కుమార్‌తో వచ్చే ఫన్ సీన్స్‌లో అతని కామిక్ టైమింగ్ ఆకట్టుకుంటుంది. ట్రైలర్ చివర్లో శౌర్య లార్డ్ లక్ష్మీ నరసింహ స్వామి ప్రజెన్స్‌లో కనిపించడం గూస్ బంప్స్ ఇచ్చేలా ఉంటుంది. హీరోయిన్‌గా విధి తన చార్మ్‌తో ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో హీరో నాగ శౌర్య మాట్లాడుతూ ఈ సినిమా ఏప్రిల్ 17న రిలీజ్ అవుతుంది. ఆరెంజ్ సినిమా పాటలు విన్నప్పటి నుంచి హారిస్ జయరాజ్ గారితో వర్క్ చేయాలని అనుకునేవాడిని. ఈ సినిమాతో ఆ అవకాశం వచ్చింది. ఆయన చాలా మంచి మ్యూజిక్ ఇచ్చారు. అలాగే రసూల్‌తో వర్క్ చేస్తే ఎలా ఉంటుందో అనుకునేవాడిని. ఆయన కెమెరాలో నేను ఎలా కనిపిస్తానో చూడాలని ఉండేది. ఈ సినిమా ద్వారా అది సాధ్యమైంది. 'ఈశ్వర్' సినిమాలో శ్రీదేవి గారిని చూసాను. అలాంటి అదృష్టం నాకు కూడా ఈ సినిమాతో రావాలని కోరుకుంటున్నాను. శ్రీదేవి ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది శ్రీదేవి మాట్లాడుతూ 'బ్యాడ బాయ్ కార్తీక్' సినిమా ఏప్రిల్ 17న థియేటర్లలో విడుదల అవుతుంది. మా ప్రొడ్యూసర్ ఇంకా చాలా మంచి నిర్మించాలని కోరుకుంటున్నాను అని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఒపి రసూల్, ప్రొడ్యూసర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.




## 'ముగిసిన' కేరళ, అస్సాం, పుదుచ్చేరి
# అసెంబ్లీ ఎన్నికల ప్రచారం
## 9న పోలింగ్

కేరళ అసెంబ్లీ మొత్తం స్థానాలు 140,
ఎన్నికల తేదీ ఏప్రిల్ 9
అస్సాంలో మొత్తం స్థానాలు 126,
ఎన్నికల తేదీ ఏప్రిల్ 9
పుదుచ్చేరి మొత్తం స్థానాలు 30,
ఎన్నికల తేదీ ఏప్రిల్ 9

**తిరువనంతపురం :** ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతలతో ప్రచారం వేడెక్కిన కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. దీంతో పాటు అస్సాం, పుదుచ్చేరి, కేరళ రాష్ట్ర అసెంబ్లీ స్థానాల ఎన్నికల ప్రచారం కూడా ఇదే సమయానికి ముగిసింది. రాష్ట్రంలోని 2.71 కోట్ల ఓటర్లలో మెజారిటీ మద్దతును కూడగట్టుకోవడానికి అధికార సిపిఐ(ఎం), కాంగ్రెస్, బిజెపిల నేతృత్వంలోని మూడు రాజకీయ కూటములు చివరి ప్రయత్నాలు చేస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం నిర్దేశించిన తేదీ ప్రకారం అసెంబ్లీ ఎన్నికల ప్రచారం మంగళవారం ముగిసింది. కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏప్రిల్ 9న జరునున్న విషయం తెలిసిందే. మంగళవారం సాయంత్రం 6గంటలకు ప్రచారం ముగిసిన తర్వాత పాటించాల్సిన 48 గంటల నిశ్శబ్దకాలంలో అనుసరించాల్సిన కఠినమైన నిబంధనలను ఎన్నికల సంఘం వివరించింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను నిర్ధారించడానికి జారీ చేసిన ఈ చర్యలు ఓటర్లు ఎలాంటి భయం లేదా ఒత్తిడికి తావులేకుండా తమ ఓటుహక్కును వినియోగించుకునేలా చేసే లక్ష్యంతో పోలింగ్ ముగియడానికి 48గంటల ముందు నుండి అమలులోకి వస్తాయని కేరళ ప్రధాన ఎన్నికల అధికారి (సిఇఓ) డాక్టర్ రతన్ యు కెల్కర్ ఒక రోజు క్రితం ఈ విషయాన్ని వెల్లడించారు. ఓటర్లను ప్రభావితం చేయగల బహిరంగ సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు, సంగీత కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు, ఇతర వినోద కార్యక్రమాలను నిర్వహించడం లేదా వాటికి హాజరుకావడాన్ని నిషేధించినట్లు సిఇఓ జారీ చేసిన ప్రకటనలో తెలిపారు. అంతేకాకుండా ఏప్రిల్ 8, 9 తేదీలలో వార్తా పత్రికలలో వచ్చే రాజకీయ ప్రకటనలకు మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసిఎంసి) నుండి ముందస్తు అవసరమని ఎన్నికల సంఘం తెలిపింది. అవినీతి, ఆర్థిక దుర్వినియోగం, బిజెపితో ఒప్పందాలు వంటి తీవ్రమైన ఆరోపణలతో లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్), యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్)లు ఒకరిపై మరొకరు విమర్శలు, ఆరోపణల దాడితో చేసుకున్న ప్రచారాల అనంతరం కేరళ రాష్ట్ర అసెంబ్లీలోని 140 స్థానాలకు పోటీ చేస్తున్న 890మంది అభ్యర్థుల భవితవ్యాన్ని ఈ ఎన్నికలు నిర్ణయించనున్నాయి,. ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల మధ్య రహస్య పొత్తు ఉందని బిజెపి కూడా తీవ్ర స్థాయి ఆరోపణలు చేసింది.మువత్తుపుఝా కాంగ్రెస్ ఎమ్మెల్యే మాథ్యూ కుఝాల్‌నాదన్ మంగళవారం ఒక కొత్త ఆరోపణ చేశారు. మట్టి తవ్వకం కంపెనీకి లబ్ధి చేకూర్చేందుకు అధికార కూటమే వరదలకు కారణమైందని ఆరోపించారు. అలప్పుజలోని ఒక ముఖ్యమైన ఆనకట్ట స్పిల్‌వేలను సకాలంలో తెరవడం, రాష్ట్రంలోని ఇతర ఆనకట్టల విషయంలో కూడా స్పిల్‌వేలను ఆలస్యంగా తెరవడంలో ఇలాంటి అవకతవకలు చోటుచేసుకున్నాయని ఆయన ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి తక్షణ స్పందన రాలేదన్న ఆరోపణ చోటుచేసుకుంది. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన బాధితుల గృహవసతి కోసం కాంగ్రెస్ సేకరించిన నిధులను ఆ పార్టీ దుర్వినియోగం చేసిందని ఎల్‌డిఫ్ ఆరోపించింది. వయనాడ్‌లో 2024లో కొండచరియలు విరిగిపడిన భారీ ప్రకృత్తి విపత్తు ఘటనలో దాదాపు 200మందికి పైగా బాధితులు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడటంతో నష్టపోయిన నివాసితులకు గృహవసతి కల్పించే సహాయ నిధుల వివాదం ఒక ప్రధాన ఎన్నికల అంశంగా మారి కాంగ్రెస్‌ను ఇరకాటంలో పడేసింది. సిపిఐ(ఎం) నేతృత్వంలోని ఎల్‌డిఎఫ్ కూడా కన్నూరులో తన పురోగతి నివేదికను విడుదల చేసింది.2021లో ఇచ్చిన హామీలలో సుమారు 97శాతం నెరవేర్చినట్లు ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో హోం మంత్రి అమిత్‌షా సహా బిజెపి అగ్ర జాతీయ నాయకులు, కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా సోమవారం రాష్ట్రంలో తమ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అధికార ఎల్‌డిఎఫ్ ప్రచారానికి సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు, ముఖ్యమంత్రి పినరయి విజయన్ నాయకత్వం వహించారు. 140 స్థానాలు కలిగిన కేరళ అసెంబ్లీకి ఏప్రిల్ 9న ఏకవిడత ఎన్నికలు జరుగనున్నాయి. ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి మే 4న ఉంటుంది.



## సరికొత్త రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక దూరం ప్రయాణించి వెళ్ళారు. అత్యధిక దూరం ప్రయాణించిన వెళ్ళి కొత్త రికార్డులు సృష్టించిన 'ఓరియన్ క్యాప్స్యూల్'లోని నలుగురు వ్యోమగాములు సరికొత్త అనుభవాలు నిక్షిప్తం చేసుకుని తిరిగివస్తున్నారు. ఏప్రిల్ ఒకటో తేదీన వారు చంద్రయానం ప్రారంభించారు. పదో తేదీన తిరిగి వారు భూమికి వస్తారు. వ్యోమగాములు ప్రయాణిస్తున్న క్యాప్స్యూల్ చంద్రుడి వెనుకభాగానికి వెళ్ళిన తర్వాత భూమితో సంబంధాలు తెగిపోయాయి. 40 నిమిషాలసేపు వారు మానవ ప్రపంచానికి దూరంగా గాఢాంధకారంలో జీవులను చూడని ఒక సరికొత్త ప్రపంచాన్ని సందర్శించారు. ఆ ప్రపంచాన్ని కెమెరాలలో బంధించారు. ఆ తర్వాత భూతల కేంద్రంతో క్యాప్స్యూల్‌కు తిరిగి సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ క్షణాలలో మహిళావ్యోమగామి క్రిస్టినా కోచ్ స్పందిస్తూ, "భూమితో తిరిగి మేం సంబంధాలు ఏర్పాటు చేసుకోవడం ఎంతో గొప్ప ఘన కార్యం" అని వ్యాఖ్యానించారు.

## పోరాడేది కమ్యూనిస్టు పార్టీలే

(మొదటి పేజీ తరువాయి)

ఉపయోగపడేలా నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అసెంబ్లీలు,పార్లమెంట్లు ప్రజల కోసమా లేక డబ్బుదారుల కోసమా అన్న సందేహం వస్తోంది" అని అన్నారు. "మా కమ్యూనిస్టు పార్టీ మాత్రం ప్రజల దగ్గర నుంచి ఒక్కో రూపాయి సేకరించి అదే బలం మీద పోరాటం చేస్తుంది.అధికారంలో లేకపోయినా పేదల,కార్మికుల పక్షాన నిలబడేది కమ్యూనిస్టులే" అని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ "పెట్రోల్,డీజిల్,గ్యాస్ ధరలు పెరుగుతాయంటూ ముందే చెప్పడం అంటే ప్రజలపై భారాలు మోపడం కాదా? ఇది పూర్తిగా పాలనా వైఫల్యం" అని మండిపడ్డారు."విశ్వగురు అంటున్న నాయకత్వం అమెరికా మాటే వినే పరిస్థితికి వెళ్లింది. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదు.దేశ గౌరవం కాపాడాలి గానీ, విదేశాల ముందు తలవంచకూడదు" అని ఘాటుగా వ్యాఖ్యానించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాలమాకుల జంగయ్య,పుస్తకాల నర్సింగ్ రావు,పానుగంటి పర్వతాలు,ఆర్. యాదగిరి,నగ్రగిరి,గిలక రాజు నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు హైకోర్టు కీలక తీర్పు

(మొదటి పేజీ తరువాయి)

న్యాయవాదులు తమ వాదనలు వినిపించగా, ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును రిజర్వ్ చేసింది. ఇక ఈ తీర్పుకు రాజకీయంగా ప్రాధాన్యత నెలకొంది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగిందని ఆరోపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలకు సిద్ధమవుతోంది. ఒకవేళ కోర్టు నివేదికను సమర్థిస్తే పిటిషనర్లకు చట్టపరమైన ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. మరోవైపు, నివేదికలో లోపాలు ఉన్నాయని కోర్టు అభిప్రాయపడితే విచారణ ప్రక్రియపై ప్రభావం పడే అవకాశముంది. రేపు వెలువడనున్న ఈ తీర్పు కాళేశ్వరం ప్రాజెక్టు భవితవ్యంతో పాటు రాష్ట్ర రాజకీయాలపై కూడా కీలక ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## విద్యాహబ్‌గా అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

పురోగమిస్తుంది. పలు ప్రధాన రహదారులు బోనకల్ కేంద్రంగా అనుసంధానం కానున్నాయి. జిల్లాలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే మినహా మిగిలిన ప్రధాన రహదారులు బోనకల్ మండల స్వరూపాన్ని మార్చనున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేట నుంచి కొత్తగూడెం వరకు నిర్మించనున్న నాలుగు లైన్ల రహదారి బోనకల్ మండల కేంద్రంగా వెళ్లనుండడంతో రెండు రాష్ట్రాలను కలుపుతూ ఇది ఒక ప్రధాన రహదారిగా మారనుంది. హైదరాబాద్, విజయవాడ హైవేకు అనుసంధానం కానుంది. నాగపూర్, అమరావతి హైవే మధిర, బోనకల్ క్రాస్ రోడ్డు వద్ద పెద్ద రింగ్ ఏర్పాటు కానుండడంతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందనుంది. నాగపూర్, అమరావతి హైవేపై ఖమ్మం తర్వాత ఇక్కడే ఎగ్జిట్ ఇవ్వడంతో వైరా, మధిర, జగ్గయ్యపేటకు వెళ్లే వాహనాలతో బోనకల్ క్రాస్ రోడ్డు ఒక రద్దీ ప్రాంతంగా మారనుంది. ఖమ్మం నుంచి నాగులవంచ, బోనకల్, ఆళ్లపాడు, రాయన్నపేట, మధిర మండలం వంగవీడు మీదుగా నాలుగు లైన్ల ప్రధాన రహదారి నిర్మాణానికి రూ. 350 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇది ఖమ్మం జిల్లాలోనే ఒక ప్రధాన రహదారిగా నిలవనుంది. పచ్చటి పొలాల మధ్య నిర్మాణం జరిగే ఈ రహదారి అనేక గ్రామాలను అభివృద్ధి దిశగా నడిపించనుంది. ప్రధాన రహదారులతో పాటు మండలంలోని గ్రామాలను కలుపుతూ అనేక లింక్ రోడ్ల నిర్మాణం పూర్తికాగా మరికొన్ని రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మోటమర్రి నుంచి వైరా మండలం గన్నవరంకు రాయన్నపేట, కలకోట, రాపల్లి గ్రామాల మీదుగా డబుల్ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ప్రతి గ్రామం నుంచి మరో గ్రామానికి లింక్ రోడ్ల నిర్మాణం దాదాపు పూర్తయింది. మల్లు భట్టివిక్రమార్కకు మండలంపై ఉన్న అవగాహన, అభివృద్ధి కాంక్ష ఈ అభివృద్ధికి దోహదపడింది.

**విద్యాహబ్‌గా బోనకల్**

బోనకల్ మండలం విద్యా పరంగా ఇప్పటికే అభివృద్ధి చెందింది. ప్రతి గ్రామంలోనూ విద్యావంతులు, ప్రభుత్వ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో ఉండడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించి విదేశాలలో స్థిరపడిన వారు ప్రతి గ్రామంలోనూ ఉన్నారంటే అతిశయోక్తి కాదు. ఈ క్రమంలో సామాన్యులను దిగువ మధ్యతరగతి, బడుగు, బలహీన వర్గాల పిల్లలను ఉన్నత విద్యకు చేరువ చేసి ఉన్నత స్థాయికి చేర్చేందుకు ప్రభుత్వ పరంగా ఒక బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టారు. బోనకల్ మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో సమీకృత విద్యాలయాన్ని నిర్మిస్తున్నారు.నిర్మాణ పనులను మల్లు భట్టి విక్రమార్క నిరంతరం పర్యవేక్షిస్తూ పనుల్లో వేగం పెంచేందుకు కృషి చేస్తున్నారు. ఈ విద్యాలయ నిర్మాణం పూర్తయితే కొన్ని వేల మందికి ఆధునీక వసతులతో పాటు మారిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యా బోధన జరగనుంది. దీనికి తోడు చిరునోముల, రావినూతల గ్రామాల్లో మోడల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో పిల్లలను మోడల్ స్కూల్స్‌కు చేర్చడంతో పాటు ప్రత్యేక యూనిఫాం, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేసి అత్యున్నత పద్ధతుల్లో విద్యా బోధన చేపట్టనున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో విద్యను తమ పిల్లలకు అందించలేకపోతున్నామనే అనేక మంది తల్లిదండ్రుల వ్యథను తీర్చేందుకు ప్రభుత్వం ఈ మోడల్ స్కూల్స్‌ను స్థాపించింది. మండలంలోని కలకోట గ్రామంలో మరో మోడల్ స్కూల్ ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ఆలోచన చేస్తుంది. వ్యవసాయ రంగానికి సంబంధించి చిన్న చెరువులను, కుంటలను అభివృద్ధి చేయడంతో పాటు జాలిముడి కాలువ ద్వారా ఐదువేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు కాలువలను ఆధునీకరించనున్నారు. నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధికి నీటి ఎద్దడి లేకుండా నీరందించేందుకు చర్యలు చేపట్టనున్నారు. బోనకల్ మండలాన్ని అన్ని విధాలా సమగ్రాభివృద్ధి చేసేందుకు భట్టి విక్రమార్క కృషి చేస్తున్నారు. బోనకల్ మండలంపై ప్రత్యేక దృష్టి సారించారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com